# శ్రీ విష్ణు సహస్రనామం

డా॥ ఇలపావులూరి పాండురంగరావు



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# శ్రీ విష్ణు సహస్రనామం

వ్యాఖ్యాత
డా॥ ఇలపావులూరి పాండురంగరావు

ప్రచురణ
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
**2006**

**SRI VISHNUA SAHASRANAMAM**

(The Thousand names of Lord Vishnu)

(Imparted to king Yudhishthira as part of the instructions given by Bhishma on his death bed - The Mahabharata, Anusasana Parvan, Chapter - 135)

Introduction, Sthotram, Nama Navaneetham and Namavali.

by

**DR. ILAPAVULURI PANDURANGA RAO**

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No : 171

First Edition : 1984
Re-Prints : 1999, 2001, 2003, 2004, 2005,2006

Copies : 5,000

Published by:
**Sri A.P.V.N. Sarma, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati — 517 507

*Cover Design*
*P. Narayanagiri Dattu*

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# ముందుమాట

మహాభారతానికి 'పంచమవేద'మని ప్రసిద్ధి. ఈ ప్రశస్తికి కారణమైన ఘట్టాలు, సన్నివేశాల్లో అత్యంత ముఖ్యమైనవి రెండు. భీష్మపర్వంలోని భగవద్గీత అందులో ఒకటి; రెండవది అనుశాసనిక పర్వంలోని విష్ణుసహస్ర నామం. గీత భగవంతుని విశ్వరూపాన్ని ప్రముఖంగా ప్రదర్శిస్తే, సహస్ర నామం ఆ 'విశ్వరూపుని' గుణగణాలను వెల్లడించే వెయ్యినామాలతో పవిత్రంగా ప్రతిధ్వనిస్తూవుంది.

ఆదిశంకరుల భజగోవింద స్తోత్రంలోని -- "గేయం గీతా నామ సహస్రం" -- అనే సందేశ వాక్యం ఈ రెండింటికి గల అనూచానమయిన సంబంధాన్ని, సమన్వయాన్ని ఉదాత్తంగా ప్రబోధిస్తున్నది.

ధర్మాలన్నింటిలోనూ ఉత్తమ ధర్మం, జపము లన్నిటిలోకీ ఉత్కృష్టమైన జపమూ -- ఐన సహస్రనామ స్తవాన్ని భీష్మాచార్యుడు ప్రవచిస్తూవుండగా, యుధిష్ఠిరునితోపాటు ఆ సమయంలో అచ్చట చేరిన అనేకులు విన్నారు. అలా విన్నవారిలో గీతోపనిషత్తును ఉపదేశించిన శ్రీకృష్ణుడూ, అవధరించిన అర్జునుడూ ఉండటం విశేషం!

జగత్ప్రభువైన భగవానుడు, ఆ సందర్భంలో కురుపితామహుడు పలికిన పలుకులకు 'స్వయంసాక్షి'గా నెలకొని ఉండి, అందుకు తన ఆమోదాన్ని -- చిఱునగవు చెలువొందే మౌనముద్రతో -- సుందరంగా సూచించినాడు. ఈ అపూర్వ సన్నివేశం సహస్రనామ స్తోత్రంయొక్క విశిష్టతకు అద్వితీయమైన నిదర్శనం! ఒక్కమాటలో, శ్రీ విష్ణు సహస్రనామస్తవం స్మరణమాత్రంచేత సమస్తజీవులను తరింపజేసే మహిమతో విలసిల్లుతూ, భారతీయ భక్తివాఙ్మయంలో మణిమకుటంవలె ప్రకాశిస్తూవుంది.

శ్రీనివాసుని దివ్యానుగ్రహంతో తిరుమల తిరుపతి దేవస్థానంవారు తొలుతనుండీ భగవద్గీత, సహస్రనామాలు, వేర్వేఱు సూక్తాలు, వివిధ స్తోత్రాలు -- మొదలయిన ప్రశస్తకృతులను పాఠకుల సౌకర్యం నిమిత్తం

-- ప్రసిద్ధ విద్వాంసులు సమకూర్చిన సముచిత వివరణలతో -- ఆయా భాషల్లో ప్రచురిస్తూవున్నారు.

ఆ క్రమంలో బహుభాషాకోవిదులు, శ్రీమద్రామాయణోపాసకులు, విద్వత్కవిపుంగవులు, సుగృహీతనామధేయులు డా॥ ఇలపావులూరి పాండురంగరావుగారు తెలుగులో రచించిన - 'నామనవనీత' వ్యాఖ్యతోగూడిన - ఈ "విష్ణుసహస్రనామ"కృతి విశిష్టమైంది. సర్వేశ్వరుణ్ణి ఆరాధించేవారికి 'మెలకువ, నిలుకడ -- రెండు లక్షణాలు అవసరం' -- అనే ఇందలి మాట ముఖ్యంగా ఆస్తిక జనావళిని ఇతోధికంగా ప్రోత్సాహించే బంగారుబాట!

1978లో 'ప్రాగ్భారతి' ప్రకటించిన ఈ కృతిని గైకొని, తిరుమల, తిరుపతి దేవస్థానములు 1984లో తమ 171వ ధార్మిక ప్రచురణగా ప్రచురించి వెలువరించారు. అనతికాలంలోనే ప్రతులు చెల్లిపోయినందున, ఈ పుస్తకం ఇపుడు పునర్ముద్రితమైంది.

కార్యనిర్వహణాధికారి.
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# అవతారిక

"గేయం గీతా నామసహస్రం" అన్న శంకరభగవత్పాదుల సందేశ వాక్యం భగవద్గీతకు, విష్ణు సహస్రనామాలకు భారతీయ భక్తివాఙ్మయంలో అసమానమైన ప్రాధాన్యాన్ని సూచిస్తూ, ఈ రెండు గ్రంథాలకు ఏదో ఒక సామాన్యసూత్రాన్ని నిరూపిస్తుంది. గానానికి గీత, ధ్యానానికి సహస్రనామం. శ్రీనాథుని చిరంతన చిద్విలాసాన్ని శ్రేష్ఠంగా భావించి, మూఢమతులనేకాక మహామేధావులనుకూడా ప్రబోధించిన ఆచార్యవర్యుల ఆర్షోక్తిలో ఉన్న ఆంతర్యం గ్రహిస్తే, ఈ రెండు గ్రంథాల ప్రాశస్త్యం పూర్తిగా బోధపడుతుంది.

భగవద్గీతలు, సహస్రనామాలు -- రెండూ వ్యాసభారతంలోవే. భీష్మ పర్వంలో భారతయుద్ధానికి పూర్వరంగంగా గీతోపదేశం జరిగితే, అనుశాసనపర్వంలో భారతయుద్ధం ముగిసిన తర్వాత, సహస్రనామ సంకీర్తనం జరిగింది. భగవంతుని బాంధవ్యం, సఖ్యం, సౌహార్దమే కాక, అతని సారథ్యంకూడా సంపాదించుకొన్న ధన్యజీవి ధనంజయుడు. అతడు మమతకు లోబడి జవసత్వాలను కోల్పోతున్న సమయంలో, అతనిలో కర్మపరాయణత్వాన్ని, ధర్మనిరతిని, సమదృష్టిని, సమరావేశాన్ని కల్పించేందుకు సాక్షాత్ కృష్ణపరమాత్మ ప్రసాదించిన భవ్యసందేశం భగవద్గీత. ధర్మయుద్ధం జయప్రదంగా కొనసాగిన తర్వాత, ధర్మనందనుడు కోరగా పరమశాంతినిధానుడైన శాంతనవుడు (భీష్మాచార్యులు) ధర్మజిజ్ఞాసకు సమాధానంగా వినిపించిన దివ్యనామ సహస్రం -- శ్రీ విష్ణు సహస్రనామం.

ధర్మసమ్మూఢ చేతస్కుడయిన అర్జునుని అజ్ఞానాన్ని పోగొట్టి కర్మసాధక మైన జ్ఞానాన్ని ప్రసాదించేందుకు గీతామృతం కురిసింది. వివేకవంతుడైన ధర్మరాజు మనస్సులో ఉదయించిన సంశయాలను పోగొట్టి సచ్చిదానంద మయుడైన సనాతన సారథి లీలలను, విభూతిని, జ్యోతిని, ప్రీతిని వెయ్యినోళ్ల

కొనియాడి ప్రపంచానికి శాంతిని ప్రసాదించేందుకు నామామృతం వెలసింది. గీత చెప్పింది పరమాత్ముడు. విన్నది పార్థుడు. సహస్రం వివరించింది శాంతమూర్తి భీష్ముడు. విని అర్థం చేసుకొన్నది ధర్మరాజు. తమ్ముణ్ణి దైవమే అనుగ్రహిస్తే, అన్నయ్యకు ఆచార్యుని ఆశీస్సులు లభించాయి. చిన్నవాడికి చెప్పటంలో చిన్న చిన్న మాటల్లో గొప్ప గొప్ప రహస్యాలను శాస్త్రపద్ధతిలో వివరించవలసి వచ్చింది కృష్ణునికి. అన్నీ తెలిసిన అన్నగారికి పొడి పొడి మాటల్లో పరిపూర్ణమైన జ్ఞానాన్ని పొదిగి ముగించాడు భీష్ముడు. గీత శాసనమయితే సహస్రనామం అనుశాసనం. భీష్మపర్వంలో భగవద్గీత వెలయటం, ఆ భీష్ముని గీత అనుశాసనపర్వంలో అవతరించటం, గమనించదగిన విషయం.

మరో విషయం ముఖ్యంగా గమనించాలి. గీతోపదేశం ఎంత అశాంతమైన వాతావరణంలో జరిగిందో, నామ సందేశం అంత ప్రశాంత వాతావరణంలో వెలువడింది. కాని యీ శాంతికి, అశాంతికి వ్యక్తుల మనస్తత్త్వాలే హేతువులు కాని, పరిస్థితులు కావు. పరమాత్మ సారథ్యంతో పార్థునిరథం కురుక్షేత్రంలో ప్రవేశిస్తుంది. ఉన్నట్టుండి పార్థుని మనస్సును మహామోహం ఆవరిస్తుంది. ఇంకా యుద్ధం ఆరంభం కాలేదు. అశాంతికి ముందు కనిపించే నిస్తబ్ధ వాతావరణంలో కృష్ణుడు గీతోపదేశం ఆరంభిస్తాడు. తీరికగా ఓపికగా చెప్పిందే చెపుతూ, సకల వేదాంతసారాన్ని కృష్ణుడు గంటన్నరలో కుదించి చెప్తాడు. చెప్పిన మాటలపై నమ్మకం కుదురని పార్థునికి తన విశ్వరూపం చూపిస్తాడు. యుద్ధభూమిలో యోగ రహస్యాలను వివరిస్తాడు. చివరకు యుద్ధం జరిపిస్తాడు. యుద్ధకాలమంతా అశాంతితో గడుస్తుంది. ఈ అశాంతికి చివర ధర్మరాజు భీష్ముణ్ణి సమీపించి, అనుశాసన విధానాన్ని ధర్మపరంగా తెలుసుకోవలెనని అనేక సందేహాలను అడుగుతాడు. తనంతట తాను కోరుకొన్న మరణంకోసం ఎదురుచూస్తున్న భీష్ముడు, శత్రువర్గంలో ప్రధానుడైనప్పటికీ తనకు ఆత్మీయుడయిన ధర్మరాజు అడిగిన ప్రతిప్రశ్నకు సమాధానం చెప్తాడు. అన్నిటికి సారాంశంగా చివరకు భగవన్నామాలను వినిపిస్తాడు. గీతాచార్యునికి ఉన్నంత తీరిక భీష్మాచార్యునికి లేదు. పార్థునికి చెప్పినంత వివరంగా అతని అన్నయ్యకు చెప్పవలసిన

అవసరంకూడా లేదు. అందువల్లనే భగవంతుని దివ్యనామాలలోనే రాజులకు, ప్రజలకు, పాలకులకు, పాలితులకు, పండితులకు, పామరులకు, సాధులకు, సాధకులకు, సిద్ధులకు, ప్రబుద్ధులకు అందరికీ వారి వారి సంస్కారాన్నిబట్టి బోధపడేరీతిలో సకలాగమ సారాన్ని అందిస్తాడు -- ఆధ్యాత్మిక రంగంలో ఆరితేరిన ఆచార్యుడు. ఈ వెయ్యినామాలను పరిశీలించి పఠిస్తేవాలు -- తెలియవలసినదల్లా తెలిసిపోతుంది. పరతత్త్వం కరతలామలకం అవుతుంది.

భగవద్గీతకు, సహస్రనామాలకు కొంత పూర్వాపర సంబంధంకూడా ఉన్నట్టు తోస్తుంది. ఏడువందల శ్లోకాలలో గీతార్థం వివరించిన తర్వాత, చివరి మాటగా గీతాచార్యుడు చెప్పిన సంహో "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" -- అన్ని ధర్మాలను త్యజించి నన్ను భజించవలసినది అని. సరిగా ఇదే మాట ధర్మరాజు భీష్ముణ్ణి అడిగిన ప్రశ్నలో వినిపిస్తుంది. "కో ధర్మః సర్వధర్మాణాం భవతః పరమో మతః" -- మీ అభిప్రాయాన్ని అనుసరించి అన్ని ధర్మాలను మించిన పరమధర్మం ఏమిటి? అని ధర్మరాజు ప్రశ్నిస్తాడు. ప్రపంచంలోని సకలధర్మాల తత్త్వాన్ని నిర్విశేషంగా పరిశీలించిన తర్వాత ధర్మనందను డడిగిన ప్రశ్న ఇది. కాబట్టి గీత చివర సూచించిన ధర్మ సారమే సహస్రనామంలో సంకీర్తింపబడిన సత్యసారం. జన్మించిన ప్రతిజీవికి జన్మ సంసరణ బంధంనుండి ముక్తిని ప్రసాదించే మూలసూత్రంకోసం శాసనభారాన్ని వహించబోతున్న ధర్మరాజు అన్వేషిస్తాడు.

ఈ మూలసూత్రం గీతలో విశ్వరూపంలో గోచరిస్తుంది. అదే సహస్రంలో నామరూపాన్ని ధరించి విశ్వంగా పరిణమిస్తుంది. సహస్రనామాల్లో మొట్టమొదటినామం 'విశ్వం' కావటం గమనించవలసిన విషయం. భగవత్ తత్త్వం ఎక్కడ ఏ రూపంలో ఎలా వెలసిందో గీతలోని విభూతి వివరిస్తుంది. ఆ విశ్వ విభూతిని సహస్రనామం ప్రత్యక్షరంలో సాక్షాత్కరించుకుంటుంది. ప్రతినామం విశ్వరూపంలోని ఒకానొక భాగం. అన్నింటి సమగ్రరూపమే పార్థుడు దివ్య చక్షువులతో తనివిదీర చూచి తరించిన అజస్రరూపం. విశ్వ రూపం చూచిన అర్జునుడు ఆనందంతో పొంగిపోయినాడు. ఆనందాతి-

లేకంవల్ల అతనికి నోట మాట రాలేదు. ఏమేమో చెప్పాలనుకున్నాడు. చివరకు ఏమీ చెప్పలేకపోయినాడు. ప్రీతికీ భీతికీ మధ్య చిక్కుకొనిపోయిన అనుభూతికి భవభూతి లభించిందే కాని, వాగ్విభూతి అందలేదు. ఈ పని వాచస్పతి, ఉదార ధీశాలి అయిన భీష్మాచార్యుడు నామసంకీర్తనద్వారా సాధించాడు. కాబట్టి గీతార్థశాసనం సాధించ లేని పనిని నామానుశాసనం సాధించింది. అక్కడ రూపం ప్రధానమయితే, ఇక్కడ నామం నిధాన మయింది. ఇదే ఈ రెండింటికీ సంధానం.

గీతకంటె సహస్రనామం సులభమైన తరణోపాయాన్ని సూచిస్తుంది. భగవద్గీతలోని ప్రతిశ్లోకం, ప్రతిపదం జాగ్రత్తగా పరిశీలించి బోధపరచుకొని, కార్యరూపంలో దాన్ని అనుసరిస్తేనే గీతాధ్యయనానికి నిజమైన ప్రయోజనం చేకూరుతుంది. కాని సహస్రనామం స్మరణమాత్రం చేత తరింపజేస్తుంది.

యస్య స్మరణమాత్రేణ జన్మ సంసార బంధనాత్,
విముచ్యతే నమస్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే.

ఎక్కడ తలుచుకుంటే అక్కడ ప్రభవించే విష్ణుమూర్తిని స్మరిస్తే చాలట. జన్మ సంసార బంధం తొలగిపోతుందట. 'ఇది నిజమా?, అని ఆస్తికులకుకూడా అప్పుడప్పుడు సందేహం కలగవచ్చు. స్మరించి-నంతమాత్రంచేత తరించగలిగితే అందరూ ఆ మాత్రం పని చెయ్యలేరా? చెయ్యగలరు. కాని మనసార చెయ్యలేరు. అలా కొద్దిమందే చెయ్యగలరు.

"చేతులారంగ శివుని పూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని"

అని పోతన చెప్పిన సత్యనిష్ఠ, దయార్ద్రత, హృదయార్ద్రత అందరికీ సాధ్యం కావు. కనుకనే 'వెయ్యి మందిలో ఎవరో ఒకరు ప్రయత్నిస్తారు. అలా ప్రయత్నించిన వాళ్ళలో కూడా నూటికో, కోటికో ఎవరికో ధన్యజీవికి పరతత్త్వం గోచరిస్తుంది' -- అని గీత హెచ్చరిస్తుంది. మనసు కుదిరి, హృదయపూర్వకంగా నోరు విప్పి, తనివిదీర నామసంకీర్తన చేస్తే జన్మ తప్పక తరిస్తుంది. తరించేందుకు మరో మార్గంకూడా లేదు. కృతయుగంలో

ధ్యానం, త్రేతాయుగంలో యజ్ఞ యాగాదులు, ద్వాపరయుగంలో అర్చన, కలియుగంలో కేశవ నామ సంకీర్తన తరణోపాయాలని విష్ణుపురాణం చెపుతుంది. నవవిధ భక్తిలోని మొదటి మూడు మార్గాలు -- శ్రవణం, కీర్తనం, స్మరణం -- కూడా నామ మహిమనే చాటి చెపుతాయి. వీటిలో మూడవ మార్గమయిన స్మరణాన్ని గురించి చెపుతూ, 'విష్ణోః స్మరణం' అని సూటిగా విష్ణు సహస్రనామాలనే సూచిస్తుంది భాగవత మహాపురాణం.

ఇలా నామరూపాలను స్మరించి తరించిన మహానుభావులెందరో ఉన్నారు. వారిలో ఒకరయిన త్యాగయ్య 'రామనామమే మేలు, రామ చింతనే చాలు'నని గానంచేసి ఈ పరమసత్యాన్ని నిరూపించాడు. పరాత్పరుని నామరూపాలను ప్రత్యక్షంగా స్మరించి సేవించి తరించిన -- పవమాన సుతుడు పట్టిన పాదారవిందాలకు నిత్యజయమంగళం -- కోరిన నామజీవి త్యాగరాజు. అలాగే ఒక్క అయోధ్యను తరింపజేసిన రాముడికంటె ప్రపంచాన్ని రసాప్లావితం చేసిన రామనామం శ్రేష్ఠమైనదని గోస్వామి తులసీ దాసు భావించారు. రామనామంలోని రెండు అక్షరాలు అఖిల లోకానికి ఆశ్రయమిచ్చే అద్భుతమైన అంకద్వయమని సూరదాసు సూచిస్తాడు. ఇలా నారదాదుల దగ్గరినుండి గానం ద్వారా జ్ఞానాన్ని ప్రబోధించిన తపస్సంపన్నులందరూ నామమహిమను కొనియాడినవారే.

ఒకవిధంగా చూస్తే భగవన్నామ సంస్మరణలో అంతరాంతరాలలో ఒదిగి యున్న అక్షర పరబ్రహ్మను ఆరాధించటమే జరుగుతుంది. 'తదంత రస్య సర్వస్య తదుసర్వస్యాస్య బాహ్యతః' -- అన్న శ్రుతివాక్యాన్ని అనుసరించి మనకు బయట కనిపించే బాహ్యవిభూతి అంతా మనలోని అక్షరభారతిలో ఇమిడి ఉన్నది. ఈ రహస్యం తెలిసిన పతంజలి, పరమాత్మను పిలిచేందుకు ప్రణవం సంబోధన అంటాడు. 'ఓం' అని పిలిస్తే పరమాత్ముడు పలుకుతాడట. ఎంత గొప్ప రహస్యం ఎంత సులువుగా వివరించాడు. నిజానికి మనలోనున్న పరావాక్కు పశ్యంతీ మధ్యమావస్థలను దాటి, వాగ్వైఖరిగా వెలువడుతున్నప్పుడు మనలోని దివ్యత్వమే అక్షరరూపంలో ఆవిర్భవిస్తున్న దన్నమాట. ఒక్కొక్క అక్షరం ఒక్కొక్క దేవతాస్వరూపం. ఒక్కొక్క మాట

మంత్రాల మూట. ఒక్కొక్క వాక్యం ఒక రసాత్మకమైన కావ్యం. మామూలు మనుష్యులు పలికే పలుకుల్లోనే ఇంత ప్రాశస్త్యం ఉన్నప్పుడు, జీవితమంతా బ్రహ్మ జిజ్ఞాసకు వినియోగించిన మహర్షులు, బ్రహ్మర్షులు పలికిన యీ నామాల్లో మరి యెంత మాహాత్మ్యం ఉండాలి? సహస్రనామంలోని ప్రతి నామం సకల సారస్వత సంపదకు మూలమైన ప్రణవంచేసే మందహాసం, పుష్పహాసం. దానిలోని పరమార్థాన్ని అవగాహన చేసుకునేందుకు నిర్మలమైన మనస్సు కావాలి. ఆర్ద్రమైన హృదయం కావాలి. అనన్యమైన భక్తి ప్రతిపత్తి కావాలి. అన్నింటిని మించి ఆదిదేవుని అనుగ్రహం కావాలి. అమోఘమైన మేధాశక్తికి, అనంతమైన శ్రుతివిభూతికి కూడా అందని ఆంతర్యం, అందం, ఆనందం -- ఈ సహస్రనామాల్లోని ప్రతినామంలో, ప్రత్యక్షరంలో, ప్రతి హల్లులో, పొల్లులో పొంగిపొరలి తొంగిచూస్తుంది. ఆ మాటలు మననోట పలికితే నాలుక మనకు స్వాధీన మవుతుంది. నాలుకను జయిస్తే నలుమూలలు జయించినట్టే. 'జితం సర్వం జితే రసే.' రసస్వరూపిణి వాణి. ఆమె అనుగ్రహం లేనిదే మనకు ఏ రహస్యం బోధపడదు.

సహస్రనామంలోని ప్రతినామానికి అర్థం తెలియకపోయినా, స్పష్టంగా ఉచ్చరించగలిగితే చాలు. స్పష్టాక్షరమైన పలుకే మంత్రం. దీనికి అధీనులే దేవతలు. అందుకనే మెలకువగా, అప్రమత్తతతో, సతతోత్థితులై నామసంస్మరణ చెయ్యాలంటాడు భీష్ముడు.

జగత్ప్రభుం దేవదేవం అనంతం పురుషోత్తమమ్,
స్తువ న్నామ సహస్రేణ పురుషః సతతోత్థితః.
తమేవ చార్చయన్నిత్యం భక్త్యా పురుషమవ్యయమ్,
ధ్యాయన్ స్తువన్ నమస్యంశ్చ యజమాన స్తమేవ చ.
అనాదినిధనం విష్ణుం సర్వలోక మహేశ్వరమ్,
లోకాధ్యక్షం స్తువన్నిత్యం సర్వదుఃఖాతిగో భవేత్.

ఈ మూడు శ్లోకాల్లో సహస్రనామాలను సేవించే విధానం చక్కగా వివరించబడింది. 'ప్రపంచానికి ప్రభువు, దేవతలకు పరదేవత అయిన పురు

స్తోత్రముని అనంత దివ్యవిభూతిని ప్రతి పురుషుడు, ప్రతిజీవి మెలకువతో స్తుతించాలి' అని మొదటి శ్లోకం చెపుతుంది. రెండవశ్లోకంలో అర్చన, ధ్యానం, స్తుతి, నమస్కృతి, యజ్ఞం -- అనే ఐదు విధానాలు చెప్పబడ్డాయి. ఎవరికి ఏ విధానం కుదిరితే వారు అలా సేవించవచ్చు. స్తోత్ర పాఠం చేస్తే స్తుతి అవుతుంది. మౌనంగా చదువుకుని విశ్వరూపాన్ని ధ్యానిస్తే అది ధ్యానయోగం అవుతుంది. ఒక్కొక్క నామాన్ని వేరువేరుగా ఓంకారంతో ఆరంభించి 'నమః' అని ముగిస్తూ పూలతోనో, అక్షతలతోనో అర్పిస్తే అది అర్చన అవుతుంది. పదిమంది కలిసి సహస్రనామ హోమం చేస్తే అది యజ్ఞ మవుతుంది. ఎలా చేసినా గమ్యం, ఆరాధ్యం ఒకటే. ఆద్యంతములు లేని సర్వేశ్వరుడు అన్ని లోకాలకు అధ్యక్షుడు. అన్ని శోకాలకు అంతకుడు. అతన్ని ఆరాధించేందుకు అందరూ అర్హులే. కాని మెలకువ, నిలకడ- రెండు లక్షణాలు అవసరం. 'సతతోత్థితః' అన్న మాటలో ఈ మెలకువ ఏ క్షణమో కాకుండా, నిరంతరం ఉండాలనే భావం సూచింపబడుతున్నది. మేల్కొన్న సమయంలోనేకాక, నిద్రపోయేటప్పుడు కూడా ఆ ప్రభువును గురించే కలలు కనాలి. నిద్రపోయేది శరీరం. లోపలి తైజసాకారం సర్వకాల సర్వావస్థలలో మెలకువగానే ఉంటుంది. సహస్రనామం చదివే సమయంలో ఈ మెలకువ ప్రత్యేకంగా అవసరమవుతుంది. లేకుంటే భూతాత్మ పూతాత్మ కావచ్చు. మహాప్రాణం అల్పప్రాణం కావచ్చు. సంయుక్తం వియుక్తమై, ప్రాంశువు పాంసువు కావచ్చు. ప్రమాదంవల్ల అవ్యయుడు అవ్యయుదు కావచ్చు. అనుగ్రహం అనుగ్రహించకపోతే అమరప్రభువు మరప్రభువు కావచ్చు. సహస్రనామాల్లో చాలవరకు అందరికీ చిరపరిచిత- ములైన నామాలే ఉన్నాయి. కాని స్థావిష్ఠః, స్థాంగుః, శిపివిష్టః, ఋద్ధః, మహర్ధిః, అక్షోభ్యః, సర్వవాగీశ్వరేశ్వరః -- లాంటి విశిష్టనామాలు కూడా ఉన్నాయి. ఇలాంటిచోట చాలా మెలకువగా ప్రవర్తించాలి. అర్థం తెలిసి చదివితే ఏ పొరపాటూ రాదు. కాని అర్థం తెలియకపోయినా స్పష్టంగా ఉచ్చరించగలిగితే సాధించవలసినది సాధించినట్టే. ఈ మెలకువకు ఆధారం నిలకడ. దీన్నే రెండవ శ్లోకంలో 'భక్త్యా' అన్న పదం వివరిస్తుంది. భక్తి

ఉంటే ఉచ్చారణశక్తి అదే లభిస్తుంది. ప్రారంభంలో అందరికీ అన్ని నామాలు సులభంగా పలకకపోవచ్చు. కాని తెలిసిన వాళ్ళ సాంగత్యంతో నిలకడగా సాధిస్తే ఈ మెలకువ అవలీలగా సిద్ధిస్తుంది. అదే గురు కటాక్షం. ఉపదేశ పరమావధి. అందరికీ గురువు జగద్గురువు వాసుదేవుడే. అతని అనుగ్రహంవల్ల అన్నింటినీ సాధించవచ్చు.

సకలధర్మ సర్వస్వమై సకల లోకాలను పాలించే మహత్తత్త్వమే సహస్రనామంలోని ఆరాధ్యదైవం.

బ్రహ్మణ్యం సర్వధర్మజ్ఞం లోకానాం కీర్తివర్ధనమ్,
లోకనాథం మహద్ భూతం సర్వభూత భవోద్భవమ్.

"ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు" -- అని భాగవతోత్తముడు భావించిన పరతత్త్వమే సహస్రనామం. అందులోనే బ్రహ్మ తత్త్వముంది. అదే సకల ధర్మసారం. లోకాలకు, లోకేశులకు, సకలలోక నివాసులకు ఆ లోకాన్ని ప్రసాదించే లోకోత్తర లావణ్యం అందులో ఇమిడి ఉంది. కనుకనే అది అన్ని ధర్మములకు మిన్న అని భీష్ముడు ఘంటాపథంగా చెబుతాడు.

ఏష మే సర్వధర్మాణాం ధర్మోఽధికతమో మతః,
యద్ భక్త్యా పుండరీకాక్షం స్తవై రర్చేన్నరః సదా.

భక్తితో స్తుతించటం, భక్తితో అర్చించటం ప్రధానం. ఏ స్థితిలో ఉన్నా పుండరీకాక్షుణ్ణి స్మరిస్తే బాహ్యాభ్యంతరాలు పవిత్రం అవుతాయని స్మృతులు చెపుతాయి. అలా భక్తితో భగవన్నామాన్ని స్మరిస్తే అలౌకికమైన దివ్యతేజస్సు, అసాధారణమైన తపశ్శక్తి లభిస్తుంది. ఈ సహస్రనామాల్లో ప్రతిపాద్యమైన పరతత్త్వమే పరబ్రహ్మతత్త్వం. దానిని మించిన తత్త్వం మరొకటిలేదు.

పరమం యో మహత్తేజః పరమం యో మహత్తపః,
పరమం యో మహద్ బ్రహ్మ పరమం యః పరాయణమ్.

పవిత్రతకు ప్రమాణం, మాంగళ్యానికి నిదర్శనం, దేవతలకు జీవనం, ప్రాణికోటికి ప్రాణం -- అయిన పరమాత్మ యీ సహస్రనామాలలో నెలకొన్న పరదైవం.

**పవిత్రాణాం పవిత్రం యో మంగళానాం చ మంగళమ్,**
**దైవతం దేవతానాం చ భూతానాం యోఽవ్యయః పితా.**

సకల జీవకోటి నశించినా జీవనదాతయైన జగత్పిత అక్షయ రూపుడై ఉంటాడు. సృష్ట్యాదిని సచరాచర జగత్తు అతనినుండే ఉదయిస్తుంది. ప్రళయకాలంలో ప్రపంచమంతా అతనిలోనే లయిస్తుంది.

**యతః సర్వాణి భూతాని భవం త్యాదియుగాగమే,**
**యస్మిం శ్చ ప్రళయం యాంతి పునరేవ యుగక్షయే.**

అలాంటి లోకనాథుని నామాలు పాపాలను పారద్రోలి, భయాన్ని పోగొడుతాయి. ఈ వెయ్యి నామాలు మహావిష్ణువు గుణగణాలను వేనోళ్ళ కొనియాడే విఖ్యాత పదాలు. మహర్షులు కీర్తించిన మహిత మంత్రాలు. ఈ నామాలను మానవమాత్రుల మంచికోసం భీష్ముడు ఒక వరుసలో పూసగ్రుచ్చినట్లు వివరిస్తాడు. ఇవి క్రొత్తవి కావట. పరమ ఋషులు పరి పరి విధాల భావించి పాడుకొన్నవట. అంటే ఈ సహస్రనామాలకు వేదప్రామాణ్యం, శ్రుతిగౌరవం ఉన్నదని సూచ్యాసూచ్యంగా ధ్వన్యాత్మకంగా చెప్పట మయింది.

**తస్య లోకప్రధానస్య జగన్నాథస్య భూపతే!**
**విష్ణో ర్నామసహస్రం మే శృణు పాపభయాపహమ్.**
**యాని నామాని గౌణాని విఖ్యాతాని మహాత్మనః,**
**ఋషిభిః పరిగీతాని తాని వక్ష్యామి భూతయే.**

ఇందులో 'భూతయే' అనే పదం గీతలోని విభూతికి అనుభూతిని సమకూర్చుతుంది. భగవత్తత్త్వం ఎక్కడెక్కడ ఏ రూపంలో ఉంటుందో వివరించిన విభూతియోగానికి, సహస్రనామంలోని ప్రతినామం అనుబంధం సాధిస్తుంది. ప్రతినామంలో భగవదంశ ఏదో ఒకరూపంలో ఉంది. భక్తితో, నిష్ఠతో, నిలకడతో, మెలకువతో ఈ నామసంకీర్తనం చేస్తే ఈ రహస్యం గోచరిస్తుంది.

పంచమ వేదమని ప్రసిద్ధిచెందిన భారత సంహితలో లక్షశ్లోకాలు ఉన్నాయి. అందుకనే దానికి శతసహస్ర సంహిత అని పేరు. ఇంత పెద్ద గ్రంథం చదివేందుకు తీరిక లేనివాళ్ళకు సూక్ష్మంలో మోక్షంగా సులభ సూత్రంగా భారతసావిత్రిసారాన్ని అందజేస్తుంది -- సహస్రనామం. ఇందులోని ప్రతినామం నూరు శ్లోకాలకు సారం. లక్షశ్లోకాల సారం వెయ్యి నామాల్లో ఇమిడ్చి పొడి పొడి మాటల్లో వివరించాడు భూరిదక్షిణుడైన భీష్ముడు. ఇందులో కథలు లేవు. కల్పనలులేవు. సంభాషణలు లేవు. సన్నివేశాలు లేవు. తర్కాలు లేవు. తార్కాణాలు లేవు. కాని మాచాయగా భారత సర్వస్వమంతా ఈ దివ్యనామ సహస్రంలో ప్రతిబింబించి ఉంది. ఈ విషయం జాగ్రత్తగా పరిశీలిస్తేనేగాని పూర్తిగా బోధపడదు. నిజానికి సహస్రనామాల్లోని ఏ నామానికి కూడా మామూలుగా నిఘంటువులు చెప్పే అర్థం వర్తించదు. ఋషులు కీర్తించిన నామాలు కాబట్టి, వాటిలోని ప్రతిఅక్షరం సార్థకమయి ఉంటుంది. మనం పదాలకు అర్థం చెప్పకోగలమే కాని, అక్షరాలకు సార్థక్యం సమకూర్చగల సామర్థ్యం మనకు లేదు కదా! అయినా సర్వవాగీశ్వరేశ్వరుని అనుగ్రహబలంతో ఆలోచించి, తరిచి తరిచి సాధిస్తే, నిగూఢమైన పరమార్థం బోధపడకపోదు. ధాతు ప్రసాదం దీనికి అక్షరాలా అవసరం. ప్రతి పదార్థానికి ధాతువు మూలం. ఆ ధాతువును లోతుగా పరిశీలించి చూస్తే ప్రతి నామంలోని రహస్యం బోధపడుతుంది. అప్పుడుగాని ఇది భారత సారమే కాక భారతీసారమనే విషయం తెలియదు. నిజానికి సహస్రనామం సకలాగమసారం. వేదసారం ఉపనిషత్తులద్వారా, గీతద్వారా సహస్రనామంలో చక్కగా చోటు చేసుకుంది.

భారతయుద్ధంలో భీష్ముడెంత ప్రధానుడో, భారత సంహితలో సహస్ర నామం అంత ప్రధానమయింది. భీష్మపర్వంతోనే యుద్ధం ఆరంభ మవుతుంది. ఇరువైపుల సేనలు గుమికూడిన సమయంలో దుర్యోధనుడు ద్రోణాచార్యుని సమీపించి, తన బలగాన్నంతా ఒక్కసారి స్మరించి, అందరూ కలిసి భీష్మాచార్యులను రక్షించాలి -- అని సారగర్భితంగా అంటాడు. భీష్ముడు మృత్యుంజయుడు. కాలాన్ని జయించిన కాలజ్ఞుడు. తన కోరిక మీదనే మరణించే వరం పొందిన మహామనస్వి. అతడు బ్రతికితే చాలు,

కౌరవులు జయించినట్లే -- అని దుర్యోధనుని దురాశ. కౌరవులపక్షం చేరి పోరాడిన ఆచార్యుడు, చివరి క్షణాల్లో పాండవులలో పెద్ద అయిన ధర్మరాజుకు ధర్మం బోధిస్తాడు. కౌరవులకు శరీరం, పాండవులకు ఆత్మ అంకితంచేసి, ప్రపంచానికి దివ్యనామ సహస్రం అందించిన అమరజీవి భీష్ముడు. మొత్తం కౌరవసేనలో భీష్ముడొక్కడు దక్కితే చాలునని దుర్యోధనుడు భావించినట్లే, సమస్త భారత సంహితలో సహస్రనామం మిగిలితే చాలునని భావించే భావుకు లనేకులున్నారు. వ్యాసమహర్షి రచించిన మహాభారతం సుదీర్ఘవృత్తాంతాలతో కూడిన ఒక దీర్ఘ వృత్తం (ఎలిప్స్). దానికి రెండు బృహత్ కేంద్రాలు -- భగవద్గీత, సహస్రనామం. వీటిలో వేటికవే భారతసారాన్ని అందిస్తాయి. ఆ రెంటిలోకూడా ఒకదాని కింకొకటి అనుబంధం, అణుభాష్యం, అనువృత్తం. 'భారతంలో లేనిది భారతదేశంలోనే లేదు' -- (యన్న భారతే. తన్న భారతే) అన్న నానుడి గీతకు, సహస్రనామాలకు పూర్తిగా వర్తిస్తుంది. ఒకటి గీతామృతం, మరొకటి నామామృతం.

స్థూలంగా చూస్తే సహస్రనామాలలో ఒక వరుస, క్రమం, పూర్వాపరసంబంధం, అన్వయం ఉన్నట్టు కనిపించదు. గీతలో 18 అధ్యాయాలు ఉన్నాయి. ఒక్కొక్క అధ్యాయానికి ఒక్కొక్క పేరుకూడా ఉంది. ఒకచోట సాంఖ్యం, మరోచోట జ్ఞానం, వేరేచోట భక్తి -- ఇలా విషయ ప్రాధాన్యం సులువుగా తెలిసిపోతుంది. కాని సహస్రనామాల్లో అలాంటి అనుక్రమణిక లేనట్టు తోస్తుంది. కాని సూక్ష్మంగా పరిశీలిస్తే వేరు వేరు నామాలకు మధ్య, ఏదో వివేకసూత్రం ఒకటి ఉన్నట్టు తెలుస్తుంది. ప్రణవంతో ప్రారంభించిన సహస్రనామంలో ప్రప్రథమంగా 'విశ్వమ్' అన్న దివ్యనామం వినిపిస్తుంది. పేరు కిది విష్ణుసహస్రనామమే అయినా, ముందు విశ్వ నామ సంస్మరణ జరుగుతుంది. ఆ తర్వాతనే విష్ణువు ప్రసక్తి వస్తుంది. విష్ణువుకంటె విశ్వమే ప్రధానం. ఎందుకంటే విశ్వం విష్ణువు సృష్టించింది. సృష్టికర్తకు తనసృష్టిమీద, సంతతిమీద, సంస్కృతిమీద ఉన్నంత మమకారం తనమీద ఉండదు. విశ్వమంటే ప్రపంచమనే అర్థమేకాక, సర్వస్వం అనే సర్వనామార్థం కూడా ఉంది. విశ్వం -- అంటే ఈ సర్వస్వం సర్వేశ్వరుని సంపద;

దీనికే విష్ణువని పేరు. ఇదంతా ప్రణవం నుంచి ప్రభవించి, ప్రణవంలో లయించిపోతుందని సూచించేందుకు సహస్రనామంలో ఆద్యంతాలు ప్రణవ సమ్మితంగా ఉన్నాయి. చివరి నామం -- సర్వప్రహరణాయుధః -- ప్రణవంనుంచి ప్రభవించి, విశ్వరూపంలో వెలసిన విష్ణుతత్త్వం అన్నింటికి శ్రీరామ రక్షగా అందరికీ తోడ్పడుతుందని అఖిల జగత్తుకు అభయం ఇస్తుంది. ప్రహరణ శబ్దంలో శిక్షించటం, రక్షించటం -- రెండూ ఉన్నాయి. అలాగే మొదటినామం - విశ్వంలో సృష్టి స్థితి లయాలు మూడూ ధ్వనిస్తాయి. ఇవన్నీ ఓంకారం నుంచి ఉదయించినవే. ఈ నామాలన్నీ ఓంకారానికి మారుపేర్లు; వేరు వేరు రూపాలు. ఏ రూపంలో భావించినా, ఏ నామంతో స్మరించినా ఒకేతత్త్వం -- విశ్వతత్త్వం -- ప్రణవ సంపుటిలో ప్రత్యక్ష మవుతుంది. ఈ విశ్వజనీనమైన విశాలదృక్పథం సహస్రనామాల ఆద్యంతాలలో చక్కగా గోచరిస్తుంది. ఈ నామసహస్రం ఒక్క విష్ణువుకు సంబంధించిందే కాదు, ఏ రూపంలో మనం పరమాత్మను ధ్యానించ తలచితే ఆ రూపమే యీ నామాల్లో కనిపిస్తుంది. అది విశ్వ నామ సహస్రం. అందులో ఈశ్వరుడు, ఈశానుడు, నరసింహుడు, వామనుడు, శివుడు, శంభువు, కృష్ణుడు, రాముడు, హిరణ్యగర్భుడు, పద్మగర్భుడు, శ్రీగర్భుడు, నరుడు, నారాయణుడు, ఇంద్రుడు, ఉపేంద్రుడు, మహేంద్రుడు, శ్రీమంతుడు, శ్రీనివాసుడు, శ్రీకరుడు, శ్రీధరుడు, ధీరుడు, వీరుడు, శూరుడు, శౌరి, ఆదిదేవుడు, మహాదేవుడు, దేవేశుడు, విశ్వమూర్తి, మహామూర్తి, దీప్తమూర్తి, అమూర్తి, యముడు, నియముడు, అనియముడు, నియంత, ధాత, విధాత, సంధాత -- అందరూ అక్కడక్కడ ప్రత్యక్ష మవుతారు. పరమాత్మ యిందులో పూతాత్మగా, భూతాత్మగా, అమేయాత్మగా, నివృత్తాత్మగా, విజితాత్మగా, విధేయాత్మగా, ఏకాత్మగా, అనేకాత్మగా, అనంతాత్మగా, సర్వాత్మగా దర్శనమిస్తాడు. పురుషోత్తముని అవతారాలే కాక, మహా పురుషుల పేర్లుకూడా ఇందులో వినిపిస్తాయి. వర్ధమానః, మహావీరః, సిద్ధార్థః, అశోకః, గురుః, గురుతమః, ఈశః -- ఇలాంటి నామాలు వచ్చినప్పుడు ప్రస్తుతం ప్రపంచంలోవున్న వివిధమతాలను ఆనాడే ఆర్షదృష్టితో ఆచార్యులవారు భావించి పలికారేమోనని తోస్తుంది. 'సిద్ధార్థః, సిద్ధ సంకల్పః,

సిద్ధిదః, సిద్ధిసాధనః' -- అని మాటి మాటికి సిద్ధశబ్దాన్ని నొక్కి చెప్తూ ఉంటే, శుద్ధ బుద్ధ స్వరూపం కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది. అలాగే మహావీర నామంలో జైనమతం, గురువాచకమైన నామాల్లో సిక్కుమతస్థుల గురుభావం కుదురుతుంది. ఈ దృష్టితో చూస్తే, సహస్రనామంలో సర్వ మత సమన్వయంకూడా గోచరిస్తుంది. అది నవీన భావన కావచ్చు. కాని, సనాతన మనేది ఎంత ప్రాచీనమో అంత నవీనం. ప్రణవశబ్దానికికూడా ప్రాచీనమని, నవీనమని రెండువిధాలా అర్థం చెప్పకోవచ్చు. ప్రణ, వం -- అంటే ప్రాచీనమవుతుంది. ప్ర, నవం -- అంటే నవీన మవుతుంది. ప్రాచీన తమమయి కూడా చిర నవీనమయిన ప్రణవంతో ప్రారంభించి, ప్రణవంతో ముగిసిన యీ సహస్రనామస్తోత్రంకూడా అలాంటిదే.

ఆద్యంతాలలో ఇంత అద్భుతమైన సమన్వయం సమకూర్చుకున్న ఈ స్తోత్రరాజంలో వేరు వేరు నామాలకు మాత్రం అన్వయం ఎందుకుండదు? ఆలోచించి అవగాహన చేసుకోవాలి. ఉదాహరణకు మొదటి శ్లోకంలోని మొదటి చరణంలో, మాండూక్యోపనిషత్తు ముక్తసరిగా ఇమిడి పోయింది. విశ్వం, విష్ణుః, వషట్కారః -- అనే మూడునామాల్లో సృష్టి, స్థితి, లయాలు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, భూత, వర్తమాన, భవిష్యత్కాలాలు, జాగ్రత్, స్వప్న, సుషుప్త్యవస్థలు, అకార - ఉకార - మకారాలు -- ఇలా ఎన్నో త్రిజటలు జడవిప్పేకొద్దీ బయటపడుతాయి. వీటి కన్నిటికీ అతీతమయిన తురీయదశను సూచిస్తుంది -- ఈ చరణంలోని చివరి నామం - భూత భవ్యభవత్ప్రభుః. ఇలా ప్రత్యేక చరణాన్ని చర్వణ చేసుకుంటూపోతే విశ్వ రహస్యాలను వివరించే విపులగాథలు వినిపిస్తాయి.

మచ్చుకు మరో ఉదాహరణ. స్కందః, స్కందధరో, ధుర్యో -- అని ఒకచోట మూడునామాలు వినిపిస్తాయి. స్థూలదృష్టికి స్కందనామం కుమారస్వామికి సంబంధించింది. ఆదిత్యహృదయంలోకూడా స్కందనామం సూర్యపరంగా వాడటం జరిగింది. ఇక్కడ విష్ణుపరంగా వచ్చింది. అసలు స్కందశబ్దానికి 'క్రిందికి జారటం' అని అర్థం. ఎక్కడనో చిక్కని చోట చక్కగా కాలక్షేపం చేస్తున్న 'రమావినోది' ఎందుకో క్రిందికి దిగివస్తాడు. అలా దిగివచ్చి

ప్రాణికోటికి చేయూత యిస్తాడు. పట్టుతెలిసినవాడు కాబట్టి, జారిన జీవులు దిగజారిపోకుండా పట్టుకుంటాడు. పడిపోతామని భయపడే పసిపిల్లలను జారుడుబండమీద పెద్దవాళ్లు చేయిపట్టుకొని ఆడించినట్లుగా, భగవంతుడు భక్తులకు చేయూత యిచ్చేందుకు, స్కందుడవుతాడు, స్కందధరుడుకూడా అవుతాడు. అస లతడు ధుర్యుడు. కీలకం తనచేతిలో పెట్టుకున్న దిట్ట. ఇలా ఒక చక్కని భావం ఈ మూడునామాల్లో ఒదిగిఉంది. ఓర్పుతో, నేర్పుతో ఆలోచిస్తే ఇలాంటి భావాలు సహస్రనామంలోని ప్రతిశ్లోకంలో, ప్రతి చరణంలో స్ఫురిస్తాయి.

ఇలాగే 'అమానీ, మానదో, మాన్యః' అని మూడునామాలు వరుసగా వినిపిస్తాయి. అతనికి అభిమానం లేదట. కాని ఇతరులకు ఇయ్యవలసిన గౌరవం, చూపవలసిన ఆదరం ఏమాత్రం లోటులేకుండా చూపుతాడట. అందువల్లనే ప్రపంచం అతన్ని గౌరవిస్తుందట. కీర్తికండూతితో బాధపడే పండితులకు, పామరులకు ఈ మూడు నామాలు ఎంత అమోఘమైన సందేశాన్ని అందిస్తాయో ఊహించవచ్చు.

ఒకచోట 'సువ్రతః, సుముఖః, సూక్ష్మః, సుఘోషః, సుఖదః, సుహృత్' -- అని ఒక్క గుక్కలో ఆరు సూక్తులు వస్తాయి. ఇవన్ని యెందుకు చెప్పినట్లు? అర్థం తెలియకుండా ఊరక చదువుకున్నా యీ ఆరు నామాలు నోటపలికేసరికి, లోపలి దుర్గంధం పోయి సాధకులకు వాచవి అంటే ఏమిటో బోధపడుతుంది. అర్థం తెలుసుకునేందుకు ప్రయ-త్నిస్తే ఇందులో లోక పాలకులకు, ప్రజా పరిపాలకులకు కావలసిన లక్షణాలు సూత్రప్రాయంగా కనిపిస్తాయి. ముందు మన సంకల్పం మంచిదై ఉండాలి, గట్టిగాకూడా ఉండాలి. అదే దృఢవ్రతునిలోని సువ్రతత్వం. అంత టితో చాలదు. మనస్సులోని సంకల్పానికి ఇతరుల ఆమోదం, అనుకూలత అవసరం. అందరినీ 'సుముఖం' చేసుకోవాలి. ఆ తర్వాత ఆ సంకల్పంలోని సాధక బాధకాలను 'సూక్ష్మం'గా పరిశీలించి పరామర్శించుకోవాలి. అప్పుడు తన సిద్ధాంతాన్ని తగినమాటల్లో అందరికీ నచ్చే విధంగా చెప్పాలి. అదే సుఘోషత్వం. అలా మనస్సులోని సంకల్పం జనామోదాన్ని పొంది ప్రజలలో

పలుకుబడికి వస్తే అందరికీ 'సుఖప్రద' మవుతుంది. అందరూ సౌహార్దంతో దాన్ని అంగీకరిస్తారు. ఏ సంకల్పానికైనా చరమలక్ష్యం సుహృత్ ప్రాప్తి. మంచి హృదయం మంచి పనిని సాధించగలుగుతుంది. నిత్యజీవితంలో అనుక్షణం స్మరించవలసిన సందేశం ఈ ఆరు నామాల్లో ఆచార్యులు మన కందించారు.

ఇలాంటి పూర్వాపర సంబంధమే కాక, కొన్ని నామాలు అక్షర కుసుమాలతో మాలలు గ్రుచ్చినట్లు వినేందుకు వీనుల విందుగా ఉంటాయి. వేదో వేదవిదవ్యంగో వేదాంగో వేదవిత్ కవిః, కరణం కారణం కర్తా వికర్తా గహనో గుహః, బ్రహ్మణ్యో బ్రహ్మకృద్ బ్రహ్మో బ్రహ్మ బ్రహ్మ వివర్ధనః, మహాక్రమో మహాకర్మా మహాతేజా మహోరగః, దుర్లభో దుర్గమో దుర్గో దురావాసో దురారిహా -- ఇలాంటివి నామ కుసుమహారాలకు మచ్చుతునకలు. అర్థం తెలియకపోయినా అనిర్వచనీయమైన ఆనందాన్ని అందించే అక్షర సంపద వీటిలో ఉంది. ఇలాంటి నామ సముచ్చయంలోనే ఒక చోట శ్రీసూక్తం వినిపిస్తుంది.

శ్రీవత్సవక్షాః శ్రీవాసః శ్రీపతిః శ్రీమతాం వరః,
శ్రీదః శ్రీశః శ్రీనివాసః శ్రీనిధిః శ్రీవిభావనః.
శ్రీధరః శ్రీకరః శ్రేయః శ్రీమాన్ లోకత్రయాశ్రయః.

ఈ చతుర్దశ (14) నామాలను ఉచ్చరించే సమయంలో మన మనస్సు చతుర్దశభువనాల్లో సంచరిస్తున్నట్లు తోస్తుంది. మూడు లోకాలకు ఆశ్రయం ఇచ్చే శ్రీతత్త్వం ప్రణవహాసంలో మిళితమై లోకోత్తర లావణ్యం పంచి పెట్టుతున్నట్టు భాసిస్తుంది. ఆశ్రయవాచకమైన శ్రీ (శ్రి) ధాతువును చర్వణ చేయగా వచ్చిన నామ రసాయనం ఇది. ఈ మూడు చరణాల్లో మూడు లోకాలు సంచరిస్తుంటాయి.

సహస్రనామంలోని కొన్ని నామాలు కొంచెం విచిత్రంగాకూడా ఉంటాయి. మామూలుగా మనం విని వినిపించే మాటలకు అవి కొంచెం దూరంగా ఉంటాయి. ఉదాహరణకు 'శిపివిష్ట' నామం ఉంది.

భగవంతుడు శిపివిష్టుడట. అంటే మామూలుభాషలో ఏమీ బోధపడదు. 'శి' అంటే నీరు. నీటిని త్రాగేవి 'శిపులు'. వాటిలో ప్రవేశించినవాడు 'శిపివిష్టుదు'. అంటే - నీటిని త్రాగే జీవరాశిలో నివసించే సర్వాంతర్యామి అన్నమాట. కాని దీనికి 'శిపివిష్ట' నామం వాడి అల్పజ్ఞులను కష్టపెట్టవలసిన అవసరం ఏమిటి? దానికి విశిష్టమైన ప్రయోజనం ఉండితీరాలి.'శిపి' శబ్దం నీరు త్రాగే జీవరాశికే కాక, ఆ పనిచేసే మరే పదార్థాని కయినా వర్తిస్తుంది. సూక్ష్మంగా పరిశీలించి చూస్తే 'శిపివిష్ట' నామం తర్వాత 'ప్రకాశనః' అనే నామం ఉంది. దానికి దీనికి ఏదో అనుబంధం ఉంది. నీటిని ప్రాణికోటి ఎప్పుడోకాని త్రాగదు. కాని, సర్వకాల సర్వావస్థలయందు నీటిని సేవించేవి కాంతికిరణాలు. సూర్యుదు తన కిరణాలతో నిరంతరం నీటిని పీల్చుకొని, ఆ కిరణాలద్వారానే నీటిని కురిపిస్తాదు. కాబట్టి 'శిపి' శబ్దానికి ఇక్కడ కిరణ జాలమనేది ప్రధానమైన అర్థం. అనుషంగికంగా అనేకములయిన అర్థాలు చెప్పుకోవచ్చు. అర్థం చేసుకునే వారి సామర్థ్య సంస్కారాలను బట్టి పలు భావాలను వెలయించే 'నానా రుచిరార్థ సూక్తి నిధులు' ఇలాంటి విశిష్ట నామాలు. ఇలాంటివి సహస్రనామాల్లో కొల్లలుగా ఉన్నాయి. వీటిని భక్తి భావంతో ఎవరైనా సంస్కారులు పరిశీలించి వివరిస్తే, అది వాక్ప్రపంచానికి మహోపకార మవుతుంది.

కొన్ని నామాలు మాటిమాటికి వస్తాయి. అది పునరుక్తిగా భావించ రాదు. ఒకేనామం సందర్భాన్ని అనుసరించి వేరువేరు అర్థాలను స్ఫురింప జేస్తుంది. 'శ్రీమాన్' అనే నామం నాలుగు సార్లు వస్తుంది. కేశవనామం, విష్ణునామం, ఆదిత్యనామం -- రెండు మూడు పర్యాయాలు వస్తాయి. వాటికి ఆ యా సందర్భాలనుబట్టి వేరు వేరు అర్థాలు చెప్పుకోవాలి. 'వసుప్రదః' అనే నామం ఒకే శ్లోకంలో మొదటి చరణం చివర, రెండవ చరణం మొదట ప్రక్క ప్రక్కనే వస్తాయి. ఇది పునరుక్తి కాదని యీ సందర్భంలో స్పష్టంగా తెలుస్తుంది. ఈ శ్లోకం మనోజవంతో మొదలయి, హవిస్సుతో ఆగి పోతుంది. ఈ రెండింటికి మధ్య వసుప్రదుడు రెండుసార్లు ప్రత్యక్షమవుతాడు. ఈ వసుప్రదుడిచ్చే వసువులుకూడా రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి మనోజవానికి సంబంధించినది. రెండవది హవిస్సుకు

సంబంధించినది. ఒకటి ఐహికం; రెండవది ఆముష్మికం. ఒకటి చలం; రెండవది అచలం. ఇలాగే చర్విత చర్వణంగా గోచరించే నామాలను బోధపరచుకోవాలి.

కొన్ని నామాలు వ్యతిరేకార్థాలను స్ఫురింపజేసేవిగా కూడా ఉన్నాయి. అసలు భగవత్తత్త్వమే పరస్పర విరోధకమైన పదార్థాల సమ్మేళనం. కాబట్టి, ఈ నామాల కన్నిటికీ అన్వయం కుదురుతుంది. పరమేశ్వరుడు ఈశుడు-అనీశుడు, అశోకుడు-విశోకుడు, అక్షరుడు-విక్షరుడు, కర్త-వికర్త, అణువు-బృహత్తు, కృశుడు-స్థూలుడు, వ్యక్తుడు-అవ్యక్తుడు, క్షరుడు-అక్షరుడు, అర్థుడు-అనర్థుడు, నిమిషుడు-అనిమిషుడు. దేహబుద్ధితో చూచినప్పుడు సత్తుగా గోచరించినది, ఆత్మబుద్ధికి అసత్తుగా మారవచ్చు. పరమాత్మ సర్వసముడు, సమయజ్ఞుడు.

సహస్ర నామాంకితుడైన సర్వేశ్వరునికి దేవతల పేర్లు, మనుష్యుల పేర్లు, గుణగణాలపేర్లు, చెట్లపేర్లు, గుట్టలపేర్లు, జంతువులపేర్లు, పంచ భూతాలపేర్లు -- అన్నీ వర్తిస్తాయి. "స సర్వనామా, స హి విశ్వ రూపః", అన్నట్టు అన్ని రూపాలు ఆయనవే. అన్నినామాలు ఆయనవే. ప్రాణంలో, ప్రణవంలో, అనలంలో, అనిలంలో, నిమిషంలో, అహస్సులో, వత్సరంలో, సంవత్సరంలో, ఋతువులో, క్రతువులో, వసువులో, వాయువులో, అన్నంలో, అన్నాదునిలో, వేదంలో, వేదాంగంలో, వేదవిదునిలో, వేదవేద్యునిలో, స్వాంగంలో, స్వాంగంలో, రవిలో, కవిలో, హవిలో, ఓజస్సులో, తేజస్సులో, ద్యుతిలో, శ్రుతిలో -- అంతటా తన అనంత విభూతిని వెదజల్లుతూ ఉండే సహస్రనేత్రుడు సహస్రనామాల్లో సహస్రధా సహస్ర ధారగా సాక్షాత్కరిస్తాడు. కాని దివ్యనామసహస్రంలో ఈ దివ్య తేజస్సును చూచేందుకు చర్మచక్షువులు చాలవు. దివ్యదృష్టి కావాలి.

ఈ దివ్యదృష్టితో చూస్తే, ప్రపంచమంతా, పరమాత్మస్వరూపంగా కనిపిస్తుంది. జడ చేతన భేదం నశిస్తుంది. మఱ్ఱిచెట్టులో మహేశ్వరుడు, అత్తిచెట్టులో ఆదిదేవుడు, రావిచెట్టులో రామచంద్రుడు కనిపిస్తారు. ఈ దృష్టి మనకు లభించేందుకే న్యగ్రోధం (మఱ్ఱి), ఉదుంబరం (అత్తి), అశ్వత్థం

(రావి) -- అనే మాటలు మన నోట పలకాలి. గుబురు గుబురుగా పెరిగిన మఱ్ఱి చెట్టు తన ఊడలతో తిరిగి భూగర్భాన్ని పరిశోధిస్తుంది. అందువల్ల అది న్యగ్రోధ మయింది. పైకి పెరిగి క్రిందికి జారటం మళ్లీ క్రిందినుంచి పైకి పెరగటం దీనిలోని విశేషం. అలాగే ఉదుంబరం, అశ్వత్థంకూడా ఆ చెట్లలోని రహస్యాలను వివరించే విశిష్టనామాలు. ఆకాశంలోని అలోకాన్ని అవలోకించి పులకరించే అత్తిచెట్టు, ఆకుల గలగలలలో కమ్మని కలలు కనే రావిచెట్టు భావించగల ప్రతిప్రాణికి పరిపరిభావాలను స్ఫురింప జేయగలవు.

సాత్త్వికభావంతో నిర్మలమైన మనస్సుతో శుద్ధమైన వాక్కుతో - త్రికరణ శుద్ధిగా సహస్రనామ సంస్మరణ చేస్తే క్రమంగా ఇలాంటి దృష్టి లభిస్తుంది. సహస్రనామ సంకీర్తనం చేసిన తర్వాత భీష్ముడు ధర్మరాజుకు ఒక ధ్యానశ్లోకం చెప్తాడు. దానిలో శివ కేశవ నామరూపాలు చక్కగా గోచరిస్తాయి:

సహస్రనామాయ నమ శ్శివాయ
సహస్రరూపాయ జనార్దనాయ

సహస్రనామం స్తోత్రంగా స్తుతించినా, అక్షతలతో అర్చించినా, మానసికంగా జపించినా, కనీసం ఇతరులు చదువుతూ ఉంటే విన్నా ఆపాత మధురంగా అలౌకికమైన ఆనందం లభిస్తుంది. వాక్శుద్ధి, చిత్తశుద్ధి, బాహ్య శుద్ధి సిద్ధిస్తాయి. పూర్తిస్తోత్రం చదివేందుకు 18 నిమిషాలు పడుతుంది. ఆ మాత్రం సమయం సమయజ్ఞుని స్మరించేందుకు వినియోగించటమే, ఒక మహాయజ్ఞం.

నమోఽస్త్వనంతాయ సహస్రమూర్తయే
సహస్ర పాదాక్షి శిరోరు బాహవే,
సహస్రనామ్నే పురుషాయ శాశ్వతే
సహస్ర కోటీ యుగధారిణే నమః.

ఓం

**శాంతి శాంతిః శాంతిః**

శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం
విశ్వాధారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగమ్,
లక్ష్మీకాంతం కమలనయనం యోగిభిర్ధ్యానగమ్యం
వందే విష్ణుం భవ భయ హరం సర్వలోకైకనాథమ్.



ఓం

# శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రమ్

విశ్వం విష్ణు ర్వషట్ కారో భూతభవ్యభవత్ ప్రభుః,
భూతకృద్ భూతభృద్ భావో భూతాత్మా భూతభావనః. 1

పూతాత్మా పరమాత్మా చ ముక్తానాం పరమా గతిః,
అవ్యయః పురుషః సాక్షీ క్షేత్రజ్ఞోఽక్షర ఏవ చ. 2

యోగో యోగవిదాం నేతా ప్రధానపురుషేశ్వరః,
నారసింహవపుః శ్రీమాన్ కేశవః పురుషోత్తమః. 3

సర్వః శర్వః శివః స్థాణుర్ భూతాదిర్ నిధి రవ్యయః,
సంభవో భావనో భర్తా ప్రభవః ప్రభు రీశ్వరః. 4

స్వయంభూః శంభు రాదిత్యః పుష్కరాక్షో మహాస్వనః,
అనాదినిధనో ధాతా విధాతా ధాతురుత్తమః. 5

అప్రమేయో హృషీకేశః పద్మనాభోఽమరప్రభుః,
విశ్వకర్మా మనుస్ త్వష్టా స్థవిష్ఠః స్థవిరో ధ్రువః. 6

అగ్రాహ్యః శాశ్వతః కృష్ణో లోహితాక్షః ప్రతర్దనః,
ప్రభూతస్ త్రికకుబ్ధామ పవిత్రం మంగళం పరమ్. 7

ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః,
హిరణ్యగర్భో భూగర్భో మాధవో మధుసూదనః. 8

ఈశ్వరో విక్రమీ ధన్వీ మేధావీ విక్రమః క్రమః,
అనుత్తమో దురాధర్షః కృతజ్ఞః కృతి రాత్మవాన్. 9

సురేశః శరణం శర్మ విశ్వరేతాః ప్రజాభవః,
అహః సంవత్సరో వ్యాళః ప్రత్యయః సర్వదర్శనః. 10

అజః సర్వేశ్వరః సిద్ధః సిద్ధిః సర్వాది రచ్యుతః,
వృషాకపి రమేయాత్మా సర్వయోగ వినిస్సృతః. 11

వసుర్ వసుమనాః సత్యః సమాత్మాఽసంమితః సమః,
అమోఘః పుండరీకాక్షో వృషకర్మా వృషాకృతిః. 12

రుద్రో బహుశిరా బభ్రుర్ విశ్వయోనిః శుచిశ్రవాః,
అమృతః శాశ్వతస్థాణుర్ వరారోహో మహాతపాః. 13

సర్వగః సర్వవిద్ భానుర్ విష్వక్సేనో జనార్దనః,
వేదో వేదవి దవ్యంగో వేదాంగో వేదవిత్ కవిః. 14

లోకాధ్యక్షః సురాధ్యక్షో ధర్మాధ్యక్షః కృతాకృతః,
చతురాత్మా చతుర్వ్యూహ శ్చతుర్దంష్ట్ర శ్చతుర్భుజః. 15

భ్రాజిష్ణుర్ భోజనం భోక్తా సహిష్ణుర్ జగదాదిజః,
అనఘో విజయో జేతా విశ్వయోనిః పునర్వసుః. 16

ఉపేంద్రో వామనః ప్రాంశు రమోఘః శుచి రూర్జితః,
అతీంద్రః సంగ్రహః సర్గో ధృతాత్మా నియమో యమః. 17

వేద్యో వైద్యః సదాయోగీ వీరహా మాధవో మధుః,
అతీంద్రియో మహామాయో మహోత్సాహో మహాబలః. 18

మహాబుద్ధిర్ మహావీర్యో మహాశక్తిర్ మహాద్యుతిః,
అనిర్దేశ్యవపుః శ్రీమాన్ అమేయాత్మా మహాద్రిధృక్. 19

మహేష్వాసో మహీభర్తా శ్రీనివాసః సతాం గతిః,
అనిరుద్ధః సురానందో గోవిందో గోవిదాం పతిః. 20

మరీచిర్ దమనో హంసః సుపర్ణో భుజగోత్తమః,
హిరణ్యనాభః సుతపాః పద్మనాభః ప్రజాపతిః. 21

అమృత్యుః సర్వదృక్ సింహః సంధాతా సంధిమాన్ స్థిరః,
అజో దుర్మర్షణః శాస్తా విశ్రుతాత్మా సురారిహా. 22

గురుర్ గురుతమో ధామ సత్యః సత్యపరాక్రమః,
నిమిషోఽనిమిషః స్రగ్వీ వాచస్పతి రుదారధీః. 23

అగ్రణీర్ గ్రామణీః శ్రీమాన్ న్యాయో నేతా సమీరణః,
సహస్రమూర్ధా విశ్వాత్మా సహస్రాక్షః సహస్రపాత్. 24

ఆవర్తనో నివృత్తాత్మా సంవృతః సంప్రమర్దనః,
అహః సంవర్తకో వహ్ని రనిలో ధరణీధరః. 25

సుప్రసాదః ప్రసన్నాత్మా విశ్వధృగ్ విశ్వభుగ్ విభుః,
సత్కర్తా సత్కృతః సాధుర్ జహ్నుర్ నారాయణో నరః. 26

అసంఖ్యేయోఽప్రమేయాత్మా విశిష్టః శిష్టకృచ్ఛుచిః,
సిద్ధార్థః సిద్ధసంకల్పః సిద్ధిదః సిద్ధిసాధనః. 27

వృషాహీ వృషభో విష్ణుర్ వృషపర్వా వృషోదరః,
వర్ధనో వర్ధమానశ్చ వివిక్తః శ్రుతిసాగరః. 28

సుభుజో దుర్ధరో వాగ్మీ మహేంద్రో వసుదో వసుః,
నైకరూపో బృహద్రూపః శిపివిష్టః ప్రకాశనః. 29

ఓజస్తేజోద్యుతిధరః ప్రకాశాత్మా ప్రతాపనః,
ఋద్ధః స్పష్టాక్షరో మంత్ర శ్చంద్రాంశుర్ భాస్కరద్యుతిః. 30

అమృతాంశూద్భవో భానుః శశబిందుః సురేశ్వరః,
ఔషధం జగతః సేతుః సత్యధర్మ పరాక్రమః. 31

భూతభవ్యభవన్నాథః పవనః పావనోఽనలః,
కామహా కామకృత్ కాంతః కామః కామప్రదః ప్రభుః. 32

యుగాదికృద్ యుగావర్తో నైకమాయో మహాశనః,
అదృశ్యో వ్యక్తరూపశ్చ సహస్రజి దనంతజిత్. 33

ఇష్టో విశిష్టః శిష్టేష్టః శిఖండీ నహుషో వృషః,
క్రోధహా క్రోధకృత్ కర్తా విశ్వబాహుర్ మహీధరః. 34

అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవానుజః,
అపాంనిధి రధిష్ఠానం అప్రమత్తః ప్రతిష్ఠితః. 35

స్కందః స్కందధరో ధుర్యో వరదో వాయువాహనః,
వాసుదేవో బృహద్భాను రాదిదేవః పురందరః. 36

అశోక స్తారణ స్తారః శూరః శౌరిర్ జనేశ్వరః,
అనుకూలః శతావర్తః పద్మీ పద్మనిభేక్షణః. 37

పద్మనాభో ఽరవిందాక్షః పద్మగర్భః శరీరభృత్,
మహర్ధిర్ ఋద్ధో వృద్ధాత్మా మహాక్షో గరుడధ్వజః. 38

అతులః శరభో భీమః సమయజ్ఞో హవిర్ హరిః,
సర్వలక్షణలక్షణ్యో లక్ష్మీవాన్ సమితింజయః. 39

విక్షరో రోహితో మార్గో హేతుర్ దామోదరః సహః,
మహీధరో మహాభాగో వేగవా నమితాశనః. 40

ఉద్భవః క్షోభణో దేవః శ్రీగర్భః పరమేశ్వరః,
కరణం కారణం కర్తా వికర్తా గహనో గుహః. 41

వ్యవసాయో వ్యవస్థానః సంస్థానః స్థానదో ధ్రువః,
పరర్ధిః పరమస్పష్టస్ తుష్టః పుష్టః శుభేక్షణః. 42

రామో విరామో విరతో మార్గో నేయో నయోఽనయః,
వీరః శక్తిమతాం శ్రేష్ఠో ధర్మో ధర్మవిదుత్తమః. 43

వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః,
హిరణ్యగర్భః శత్రుఘ్నో వ్యాప్తో వాయు రధోక్షజః. 44

ఋతుః సుదర్శనః కాలః పరమేష్ఠీ పరిగ్రహః,
ఉగ్రః సంవత్సరో దక్షో విశ్రామో విశ్వదక్షిణః. 45

విస్తారః స్థావరః స్థాణుః ప్రమాణం బీజమవ్యయమ్,
అర్థోఽనర్థో మహాకోశో మహాభోగో మహాధనః. 46

అనిర్విణ్ణః స్థవిష్ఠోఽభూర్ ధర్మయూపో మహామఖః,
నక్షత్రనేమిర్ నక్షత్రీ క్షమః క్షామః సమీహనః. 47

యజ్ఞ ఇజ్యో మహేజ్యశ్చ క్రతుః సత్త్రం సతాం గతిః,
సర్వదర్శీ విముక్తాత్మా సర్వజ్ఞో జ్ఞానముత్తమమ్. 48

సువ్రతః సుముఖః సూక్ష్మః సుఘోషః సుఖదః సుహృత్,
మనోహరో జితక్రోధో వీరబాహుర్ విదారణః. 49

స్వాపనః స్వవశో వ్యాపీ నైకాత్మా నైకకర్మకృత్,
వత్సరో వత్సలో వత్సీ రత్నగర్భో ధనేశ్వరః. 50

ధర్మగుబ్ ధర్మకృద్ ధర్మీ సదసత్ క్షర మక్షరమ్,
అవిజ్ఞాతా సహస్రాంశుర్ విధాతా కృతలక్షణః. 51

గభస్తినేమిః సత్త్వస్థః సింహో భూతమహేశ్వరః,
ఆదిదేవో మహాదేవో దేవేశో దేవభృద్గురుః. 52

ఉత్తరో గోపతిర్ గోప్తా జ్ఞానగమ్యః పురాతనః,
శరీరభూతభృద్ భోక్తా కపీంద్రో భూరిదక్షిణః. 53

సోమపోఽమృతపః సోమః పురుజిత్ పురుసత్తమః,
వినయో జయః సత్యసంధో దాశార్హః సాత్వతాం పతిః. 54

జీవో వినయితా సాక్షీ ముకుందోఽమితవిక్రమః,
అంభోనిధి రనంతాత్మా మహోదధిశయోఽంతకః. 55

అజో మహార్హః స్వాభావ్యో జితామిత్రః ప్రమోదనః,
ఆనందో నందనో నందః సత్యధర్మా త్రివిక్రమః. 56

మహర్షిః కపిలాచార్యః కృతజ్ఞో మేదినీపతిః,
త్రిపదస్ త్రిదశాధ్యక్షో మహాశృంగః కృతాంతకృత్. 57

మహావరాహో గోవిందః సుషేణః కనకాంగదీ,
గుహ్యో గభీరో గహనో గుప్త శ్చక్రగదాధరః. 58

వేధాః స్వాంగోఽజితః కృష్ణో దృఢః సంకర్షణోఽచ్యుతః,
వరుణో వారుణో వృక్షః పుష్కరాక్షో మహామనాః. 59

భగవాన్ భగహానందీ వనమాలీ హలాయుధః,
ఆదిత్యో జ్యోతిరాదిత్యః సహిష్ణు ర్గతిసత్తమః. 60

సుధన్వా ఖండపరశుర్ దారుణో ద్రవిణప్రదః,
దివఃస్పృక్ సర్వదృగ్వ్యాసో వాచస్పతి రయోనిజః. 61

త్రిసామా సామగః సామ నిర్వాణం భేషజం భిషక్,
సన్న్యాసకృ చ్ఛమః శాంతో నిష్ఠా శాంతిః పరాయణమ్. 62

శుభాంగః శాంతిదః స్రష్టా కుముదః కువలేశయః,
గోహితో గోపతిర్ గోప్తా వృషభాక్షో వృషప్రియః. 63

అనివర్తీ నివృత్తాత్మా సంక్షేప్తా క్షేమకృ చ్ఛివః,
శ్రీవత్సవక్షాః శ్రీవాసః శ్రీపతిః శ్రీమతాంవరః. 64

శ్రీదః శ్రీశః శ్రీనివాసః శ్రీనిధిః శ్రీవిభావనః,
శ్రీధరః శ్రీకరః శ్రేయః శ్రీమాన్ లోకత్రయాశ్రయః. 65

స్వక్షః స్వంగః శతానందో నందిర్ జ్యోతిర్గణేశ్వరః,
విజితాత్మా విధేయాత్మా సత్కీర్తి శ్ఛిన్నసంశయః. 66

ఉదీర్ణః సర్వతశ్చక్షు రనీశః శాశ్వతస్థిరః,
భూశయో భూషణో భూతిర్ విశోకః శోకనాశనః. 67

అర్చిష్మాన్ అర్చితః కుంభో విశుద్ధాత్మా విశోధనః,
అనిరుద్ధోఽప్రతిరథః ప్రద్యుమ్నోఽమితవిక్రమః. 68

కాలనేమినిహా వీరః శౌరిః శూరజనేశ్వరః,
త్రిలోకాత్మా త్రిలోకేశః కేశవః కేశిహా హరిః. 69

కామదేవః కామపాలః కామీ కాంతః కృతాగమః,
అనిర్దేశ్యవపుర్ విష్ణుర్ వీరోఽనంతో ధనంజయః. 70

బ్రహ్మణ్యో బ్రహ్మకృద్ బ్రహ్మా బ్రహ్మ బ్రహ్మవివర్ధనః,
బ్రహ్మవిద్ బ్రాహ్మణో బ్రహ్మీ బ్రహ్మజ్ఞో బ్రాహ్మణప్రియః. 71

మహాక్రమో మహాకర్మా మహాతేజా మహోరగః,
మహాక్రతుర్ మహాయజ్వా మహాయజ్ఞో మహాహవిః. 72

స్తవ్యః స్తవప్రియః స్తోత్రం స్తుతిః స్తోతా రణప్రియః,
పూర్ణః పూరయితా పుణ్యః పుణ్యకీర్తి రనామయః. 73

మనోజవ స్తీర్థకరో వసురేతా వసుప్రదః,
వసుప్రదో వాసుదేవో వసుర్ వసుమనా హవిః. 74

సద్గతిః సత్కృతిః సత్తా సద్భూతిః సత్పరాయణః,
శూరసేనో యదుశ్రేష్ఠః సన్నివాసః సుయామునః. 75

భూతావాసో వాసుదేవః సర్వాసునిలయో ఽనలః,
దర్పహా దర్పదో దృప్తో దుర్ధరోఽథాపరాజితః. 76

విశ్వమూర్తిర్ మహామూర్తిర్ దీప్తమూర్తి రమూర్తిమాన్,
అనేకమూర్తి రవ్యక్తః శతమూర్తిః శతాననః. 77

ఏకో నైకః స్తవః కః కిం యత్ తత్ పదమనుత్తమమ్,
లోకబంధు ర్లోకనాథో మాధవో భక్తవత్సలః. 78

సువర్ణవర్ణో హేమాంగో వరాంగ శ్చందనాంగదీ,
వీరహా విషమః శూన్యో ఘృతాశీ రచల శ్చలః. 79

అమానీ మానదో మాన్యో లోకస్వామీ త్రిలోకధృక్,
సుమేధా మేధజో ధన్యః సత్యమేధా ధరాధరః. 80

తేజోవృషో ద్యుతిధరః సర్వశస్త్రభృతాం వరః,
ప్రగ్రహో నిగ్రహో వ్యగ్రో నైకశృంగో గదాగ్రజః. 81

చతుర్మూర్తి శ్చతుర్బాహు శ్చతుర్వ్యూహ శ్చతుర్గతిః,
చతురాత్మా చతుర్భావ శ్చతుర్వేదవి దేకపాత్. 82

సమావర్తోఽనివృత్తాత్మా దుర్జయో దురతిక్రమః,
దుర్లభో దుర్గమో దుర్గో దురావాసో దురారిహా. 83

శుభాంగో లోకసారంగః సుతంతుస్ తంతువర్ధనః,
ఇంద్రకర్మా మహాకర్మా కృతకర్మా కృతాగమః. 84

ఉద్భవః సుందరః సుందో రత్ననాభః సులోచనః,
అర్కో వాజసనః శృంగీ జయంతః సర్వవిజ్జయీ. 85

సువర్ణబిందు రక్షోభ్యః సర్వవాగీశ్వరేశ్వరః,
మహాహ్రదో మహాగర్తో మహాభూతో మహానిధిః. 86

కుముదః కుందరః కుందః పర్జన్యః పావనోఽనిలః,
అమృతాశోఽమృతవపుః సర్వజ్ఞః సర్వతోముఖః. 87

సులభః సువ్రతః సిద్ధః శత్రుజిత్ శత్రుతాపనః,
న్యగ్రోధోదుంబరోఽశ్వత్థ శ్చాణూరాంధ్రనిషూదనః. 88

సహస్రార్చిః సప్తజిహ్వః సప్తైధాః సప్తవాహనః,
అమూర్తి రనఘోఽచింత్యో భయకృద్ భయనాశనః. 89

అణుర్ బృహత్ కృశః స్థూలో గుణభృ న్నిర్గుణో మహాన్,
అధృతః స్వధృతః స్వాస్యః ప్రాగ్వంశో వంశవర్ధనః. 90

భారభృత్ కథితో యోగీ యోగీశః సర్వకామదః,
ఆశ్రమః శ్రమణః క్షామః సుపర్ణో వాయువాహనః. 91

ధనుర్ధరో ధనుర్వేదో దండో దమయితా దమః,
అపరాజితః సర్వసహో నియంతా నియమో యమః. 92

సత్త్వవాన్ సాత్త్వికః సత్యః సత్యధర్మపరాయణః,
అభిప్రాయః ప్రియార్హోఽర్హః ప్రియకృత్ ప్రీతివర్ధనః. 93

విహాయసగతిర్ జ్యోతిః సురుచిర్ హుతభుగ్ విభుః,
రవి ర్విరోచనః సూర్యః సవితా రవిలోచనః. 94

అనంతో హుతభుగ్ భోక్తా సుఖదో నైకజోఽగ్రజః,
అనిర్విణ్ణః సదామర్షీ లోకాధిష్ఠాన మద్భుతః. 95

సనాత్ సనాతనతమః కపిలః కపి రవ్యయః,
స్వస్తిదః స్వస్తికృత్ స్వస్తి స్వస్తిభుక్ స్వస్తిదక్షిణః. 96

అరౌద్రః కుండలీ చక్రీ విక్ర మ్యూర్జితశాసనః,
శబ్దాతిగః శబ్దసహః శిశిరః శర్వరీకరః. 97

అక్రూరః పేశలో దక్షో దక్షిణః క్షమిణాంవరః,
విద్వత్తమో వీతభయః పుణ్యశ్రవణకీర్తనః. 98

ఉత్తారణో దుష్కృతిహా పుణ్యో దుస్స్వప్ననాశనః,
వీరహా రక్షణః సంతో జీవనః పర్యవస్థితః. 99

అనంతరూపోఽనంతశ్రీర్ జితమన్యుర్ భయాపహః,
చతురశ్రో గభీరాత్మా విదిశో వ్యాదిశో దిశః. 100

అనాదిర్ భూర్భువో లక్ష్మీః సువీరో రుచిరాంగదః,
జననో జనజన్మాదిర్ భీమో భీమపరాక్రమః. 101

ఆధారనిలయో ధాతా పుష్పహాసః ప్రజాగరః,
ఊర్ధ్వగః సత్పథాచారః ప్రాణదః ప్రణవః పణః. 102

ప్రమాణం ప్రాణనిలయః ప్రాణభృత్ ప్రాణజీవనః,
తత్త్వం తత్త్వవి దేకాత్మా జన్మమృత్యుజరాతిగః. 103

భూర్భువః స్వస్తరు స్తారః సవితా ప్రపితామహః,
యజ్ఞో యజ్ఞపతిర్ యజ్వా యజ్ఞాంగో యజ్ఞవాహనః. 104

యజ్ఞభృద్ యజ్ఞకృద్ యజ్ఞీ యజ్ఞభుగ్ యజ్ఞసాధనః,
యజ్ఞాంతకృద్ యజ్ఞగుహ్యం అన్న మన్నాద ఏవ చ. 105

ఆత్మయోనిః స్వయంజాతో వైఖానః సామగాయనః,
దేవకీనందనః స్రష్టా క్షితీశః పాపనాశనః. 106

శంఖభృన్ నందకీ చక్రీ శార్ఙ్గధన్వా గదాధరః,
రథాంగపాణి రక్షోభ్యః సర్వప్రహరణాయుధః. 107

సర్వప్రహరణాయుధ ఓం నమ ఇతి. 108

* * *

# నామ నవనీతం

## (శ్రీవిష్ణు సహస్రనామావళికి సారాంశం)

భీష్మాచార్యులు ప్రసాదించిన
దివ్య నామసహస్రావళికి
సామాన్యభాషలో - సరళ భాష్యం

భాష్యంలోని అంకెలు
శ్లోక సంఖ్య ననుసరించి ఉన్నాయి.

# నామ నవనీతం

## (సహస్రనామ సారం)

*

ఓంకారం పరమాత్మకు పర్యాయపదం. ప్రపంచానికి ప్రాణం. మూడు లోకాలకు మూలం. సకల సారస్వత సారం. ఆగమ నిగమాలకు ఆధారం. ఆత్మ పరాయణులకు అక్షయమైన పాథేయం. కర్మయోగులకు కంఠ హారం. భక్తులకు కొంగు బంగారం. ముక్కోటి దేవతలను ముచ్చటగా మూడుమాత్రలలో వెలయించి, మాత్రల కందని తురీయ మాధుర్యంలో పరమవరేణ్యమయిన పదార్థాన్ని ప్రతిపాదించగల ప్రణవ స్వరూపం. నిత్య నూతనం, పరమపురాతనం అయిన యీ ప్రణవమే ప్రపంచం. ప్రపంచమే పరమాత్మ. కాబట్టి పరమాత్మ ప్రణవస్వరూపుడు.

ప్రణవరూపంలో పరమాత్మ ప్రపంచంలో, పంచభూతాల్లో, పంచతన్మాత్రల్లో (శబ్ద స్పర్శ రూప రస గంధాల్లో) ప్రవేశిస్తాడు. పంచ తత్త్వాల్లో ప్రవేశించిన పరతత్త్వం విశ్వమంతటా వ్యాపించి ఉంటుంది. అది లేనిచోటు లేదు. అదే సమస్తం. అదే సర్వస్వం. అదే విశ్వం. ఈ విశ్వాత్మకు లింగభేదం లేదు. పురుషుల్లో పురుషుడు, స్త్రీలలో స్త్రీ, జడ చేతన జగత్తుల్లో, జడ చేతన రూపంలోనే సంచరిస్తూ, అన్నింటిని స్పందింపజేస్తూ, మహానందంలో మునిగి పాలకడలిలో పన్నగశాయియై హాయిగా పరుండికూడా, ప్రపంచమంతటా నిండియున్న ఆ పరాత్పరుడే విశ్వరూపుడు.

అతడే విష్ణువు. విశ్వంలో ప్రవేశించి ప్రాణుల్లో ప్రాణాన్ని ప్రతిష్ఠింపజేసే ప్రభువు. విశ్వవ్యాపకమైన విశ్వాత్మవిభూతి అణు వణువులో తొణికిసలాడుతుంటుంది. ఎక్కడ చూచినా అతని రూపకల్పనమే అతని వాగ్విలాసమే. అతని అఖండ చైతన్యమే. ఇంతటి మక్కువతో, మంచిని

పెంచిన మమకారంతో, మహా శిల్పనైపుణ్యంతో కూర్చి పేర్చిన సృష్టిని చివరకు ఆ లీలామయుడు తనలోనే లీనం చేసుకుంటాడు.

అందుకోసం యజ్ఞ యాగాదుల్లో అతడు వషట్కార స్వరూపుడై హవిస్సును ఆరగిస్తాడు. నిత్యం మనం భుజించే ఆహారంలోని సారాన్ని కూడా ఆ వషట్కారుడే వైశ్వానరరూపంలో గ్రహిస్తాడు. నిజానికి మనం చేసే పనులు, తినే తిండి, ఆచరించే పుణ్యకర్మలు, ఒకరి కిచ్చే దానాలు సాధించే సాధనలు, తపస్సులు -- అన్నీ పరమాత్మకే అంకితం అవుతాయి. తెలిసి అర్పిస్తే అర్చన అవుతుంది. లేకుంటే 'గాలికి ఎగిరే పేలపిండి' అవుతుంది. ఎలాగయినా అంతా బ్రహ్మార్పణమే.

ఇలా సృష్టి స్థితి లయాలకు మూలకందమయిన శ్రీమహావిష్ణువు భూత భవిష్యద్ వర్తమానాలకు ప్రభువు. జరిగినవి, జరుగనున్నవి, జరుగుతున్నవి -- అన్నీ ఆయన సంకల్పం ప్రకారమే జరుగుతుంటాయి. ఆచరించే వ్యక్తి ఆధారం, నిమిత్తం, సాధనం. ఆచరింపజేసే అంతరాత్మ అన్నిటికీ మూలకారణం.

ప్రపంచంలో ప్రభవించే ప్రతిప్రాణికూడా పంచభూతాలకు అధిపతి అయిన విశ్వాత్మచేతిలో తయారయిన ప్రతిరూపమే. ఒకా నొక రూపానికి ఇది ప్రతిరూపం. ఒక బింబానికి ఇది ప్రతిబింబం. ప్రాణంపోసి ప్రాణులను సృష్టించే భూతకృత్తే సకలజీవరాశిని పోషించే భూతభృత్తు కూడా. సృజించిన వాడే భరిస్తాడు. అంతేకాదు, లయించేవరకు తన సంతతిలో ఉదయించే భావసంతతికికూడా అతడే సూత్రధారుడు. భవ్యమైన మానవ జీవితంలో భావానికి చాలా ప్రాధాన్యం ఉంది. మానవుడు భావజీవి. భగవంతుడుకూడా భావనారాయణుడు. నరులకు, నారాయణునికి మధ్య సంధిసూత్రం భావం. తన సృష్టికి తాను వేరు కాకుండా మధ్యలో ఈ అనుబంధాన్ని ఏర్పరచుకొన్నది కూడా ఆ నేర్పరే.

జీవాత్మకు, పరమాత్మకు మధ్యవర్తిగా ప్రవర్తించే యీ భగవత్తత్త్వమే భూతాత్మ. చూచేందుకు, వినేందుకు, ఆనందించేందుకు అతడు కూడా

మనలాంటి మనుష్యుడే. భూతభావనుడే. మనలాంటి భావాలే అతనివి. అతని భావాలే మనవి.

## 2

కాని యీ భావసూత్రం పవిత్రతను సంతరించుకొన్న సమయంలో జీవబ్రహ్మసమైక్యం ఏర్పడుతుంది. పాంచభౌతికమయిన ప్రాణి ప్రారంభంలో భూతాత్మ. తర్వాత సాధనసంపదతో, సంస్కారంతో, సర్వేశ్వరుని అనుగ్రహంతో పవిత్రమైన మనోభావాలతో 'పూతాత్మ'గా మారి చివరకు 'పరమాత్మ'తో సమాను డవుతాడు. బ్రహ్మవిదుదు బ్రహ్మస్వరూపుడే. జ్ఞానికి జ్ఞానగమ్యునికి వ్యత్యాసముండదు. తెలుసుకునేవాడే తెలుసుకొనవలసిన వాడవుతాడు.

అప్పుడు జీవునికి బాహ్యాబంధంనుంచి ముక్తి లభిస్తుంది. ఈ ముక్తికి పరమావధి పరమాత్మలో లయించి పోవటం. అదే ఆత్మ సాయుజ్యం. జీవన్ముక్తులు కోరుకొనే మహావరం, మహాలయం ఇదే.

ఇలా తనలో తనసృష్టిని లయింపజేసుకునే లయగ్రాహి తాను లయించడు. తరగడు. ఈ తరగని తరగతికి చెందిన పరమాత్మ అవ్యయరూపంలో శరీరమనే పురంలో ప్రవేశించి, అన్నింటిని చూస్తూ సాక్షిభూతంగా ఉంటాడు. శరీరంలో నశించేభాగం కొంత ఉంది. నశించనిది కూడా కొంత ఉంది. శరీరం నశించినా అందులో నశించని అవినశ్వర తత్త్వమే అవ్యయం. ఆ తత్త్వం ప్రతి శరీరంలో ఉంది. అదే దేహపురిలో ప్రవేశించి ఉండే పురుష పదార్థం. అన్ని దేహాల్లో ఉన్నది అదే తత్త్వం. కాబట్టి అవ్యయుడైన ఆ పురుషుడు సర్వసాక్షి. పురంలాంటి శరీరమే అతనికి సాధనాస్థలం. పుణ్యక్షేత్రం. కాని, క్షేత్రంలో ఉన్న ఆ సర్వసాక్షికే ఆ క్షేత్రరహస్యం తెలుసు. క్షీణించేది క్షేత్రం. క్షీణించకుండా చూచుకొనేది కూడా క్షేత్రమే. కాబట్టి క్షేత్రరూపంలో ఉన్న శరీరంలో కొంతభాగం క్షరం. మిగిలినది అక్షరం. ఏది క్షరం, ఏది అక్షరం అనే విషయం కూలంకషంగా తెలుసుకొని, అక్షరభారతిని ఆరాధించే వారికి దారిచూపే క్షేత్రజ్ఞుడు ఈ క్షేత్రంలోనే ఉన్నాడు. కాబట్టి ఏ తీర్థయాత్రలకూ, గుళ్ళకూ, గోపురా-

లకూ వెళ్ళవలసిన పనిలేదు. ఈ క్షేత్రాన్ని, ఇందులో ఉన్న క్షేత్రజ్ఞుణ్ణి క్షుణ్ణంగా అవగాహన చేసుకుంటే అన్నింటినీ సాధించినట్టే.

## 3

అదే యోగం. నిజమైన యోగం. సకలయోగాలకు సారం. యోగమంటే రెంటి కలయిక, పొత్తు, తాదాత్మ్యం, సమీకరణం, సమ్మేళనం. క్షేత్ర క్షేత్రజ్ఞుల సమానాధికరణమే శరీరధారి సాధించవలసిన పరమయోగం. ఈ యోగం తెలిసిన యోగవిదులకు దారి చూపినవాడు కూడా పరమేశ్వరుడే. అతడే యోగీశ్వరుడు. యోగవిదులకు నాయకుడు, నేత. ప్రకృతి సృష్టిలో ప్రధానమైన తత్త్వం. పురుషుడు చైతన్యమూర్తి. అతని అధ్వర్యంలో ప్రకృతి సచరాచర జగత్తును సృష్టిస్తుంది. ఈ పరా ప్రకృతికి, పరమ పురుషునికి కూడా మూలకారకుడైన విశ్వేశ్వరుడు ప్రధాన పురుషేశ్వరుడు.

అతడు నరాకృతిలోనే ఉండ నక్కరలేదు. మరో జీవిగాకూడా రూపొందవచ్చు. అతడు నరోత్తముడయిన నారాయణుడు కావచ్చు. నరాంతకమయిన సింహం కావచ్చు. రెంటి సమ్మేళనంకూడా కావచ్చు. ఇదే నారసింహవపువు. శ్రీమంతుడైన భగవంతుడు తన సర్వాంతర్యామిత్వాన్ని నిరూపించేందుకు, భక్తుల మాటను నిలబెట్టేందుకు నరసింహరూపాన్ని కూడా ధరిస్తాడు. ఏ రూపంలో వెలసినా శ్రీ సమేతుడైన భగవంతుడు పురుషోత్తముడే. అతనికే కేశవనామంకూడా ఎక్కువ ప్రచారంలో ఉంది. కిరణజాలంతో, ప్రాణికోటిని బాధించే అసురవర్గాన్ని పారదోలి, సృష్టికర్త అయిన బ్రహ్మదేవునికికూడా అధిపతిగా రాజిల్లే అనంత తేజోరాశి కేశవుడు. కిరణాలు రెండు రకాలు. చూడవలసినదాన్ని చూడనియ్యక కళ్ళకు మిరుమిట్లు గొలిపేవి కొన్ని. అన్నింటిని ఒకచోటనే చూడగల దివ్యశక్తిని ప్రసాదించేవి మరికొన్ని. తొలిరకపు కిరణాలను తొలగించి, మలిరకపు మేలిరకపు కిరణాలను ప్రవర్తింపజేసే ప్రకాశమూర్తి కేశవుడు. అతడే పురుషోత్తముడు -- అతని అనుగ్రహం ఉంటే నరుడు తనలోని పశుత్వాన్ని పోగొట్టుకొని నారాయణుడు కాగలుగుతాడు. ఇదే సహస్రనామ సంయోగం అందించే సందేశం.

## 4

ప్రధానపురుషేశ్వరుడైన పురుషోత్తముడు సర్వాంతర్యామి. అందరిలో అంతటా అన్నివిధాలా వ్యాపించియున్న అఖండ చైతన్యరాశికి అన్ని పేర్లూ వర్తిస్తాయి. ఏ పేరుతో పిలిచినా అతనిని సంబోధించినట్టే అవుతుంది. అన్ని నామాలు అతనివే. అతడు సర్వనాముడు. సర్వుడు. ప్రపంచంలోని సర్వస్వం సర్వేశ్వరుని కళావిలాసం. ఈ సర్వుడే శర్వుడు. సర్వుడు సృష్టి స్థితి లయకారకుడు. శర్వుడు లయకారకుడు. పగటివేళ వెలుగును ప్రసరింపజేసి, రాత్రికి సర్వస్వాన్ని తనలో లయింపజేసుకునే సర్వేశ్వరుడు శివసంకల్పంతో -- ప్రపంచానికి మంచి చెయ్యాలనే సత్సంకల్పంతోనే -- తన ఐశ్వర్యాన్ని ప్రతిప్రాణికి ప్రసాదిస్తాడు. ఈ శివసంకల్పం క్షణంలో ఉదయించి క్షణంలో లయించేది కాదు. స్థిరంగా శాశ్వతంగా 'స్థాణు'వుగా నెలకొని ఉండే ఈ సంకల్పానికి చలనంలేదు. నిశ్చలంగా నిలబడియున్న ఈ స్థాణువు ప్రపంచం-లోని ప్రతి అణువులో ప్రతిబింబించి ఉంటుంది. ఒకే ఒక చైతన్యబిందువు సకల భూతసంఘానికి వేరు వేరుగా చైతన్యాన్ని ప్రసాదిస్తుంది. అన్ని భూతములకు ఆది అవటంవల్ల అందరికీ అనాదికాలంనుండి అక్కడినుండే చైతన్యం లభిస్తున్నది. యుగయుగాలుగా తన చైతన్య నిధిని నిఖిలలోకానికి పంచిపెడుతున్నా ఏమాత్రం తరిగిపోని అక్షయకోశం, అవ్యయనిధి పరమేశ్వ-రునిది. ఈశ్వర సంకల్పానికి సాధ్యంకానిది లేదు. అన్నింటిని సంభవింపజేసే భావనాశీలి కాబట్టి ప్రపంచం అతన్ని శంభవుడని సంభవుడని స్తుతిస్తుంది. అతని మహాసంకల్పంవల్ల సంభవించిందే భవం. దాని కతడు భర్త, ప్రభువు, ఈశ్వరుడు. ఈ భవానికి, భావనకు మూలకారకుడు, తొలివెలుగు కాబట్టి అతనికి ప్రభవుడని పేరు.

## 5

సకల చరాచరసృష్టిని సంభవింపజేసే ప్రభవుణ్ణి ప్రసవించే శక్తి మరే ప్రాణికి లేదు. భవకారకుడైన సంభవుడు తనంతట తానే జన్మిస్తాడు. ఉదయిస్తాడు. అవతరిస్తాడు. కాబట్టి అతణ్ణి స్వయంభువని ప్రపంచం కీర్తి స్తుంది. ప్రపంచంలో మంచిని పెంచేందుకు స్వయంభువు జన్మిస్తాడు.

కాబట్టి అతణ్ణి 'శంభు' అనికూడా అంటారు. మంచినుండి మంచికోసం అవతరించే మంచితనమే శంభువులోని సంభవతత్త్వం. ఈ అవతరణం ప్రతి దినం సూర్యోదయంలో ప్రత్యక్షంగా కనిపిస్తుంది. అదీనమైన దివ్య తేజస్సుతో అరనిముసం ఆలస్యం కాకుండా అహరహం ఆకాశంలో ఉదయించి, అనంతజీవకోటికి ఆలోకం ప్రసాదించే ఆదిత్యుడు సాక్షాద్ విష్ణు స్వరూపుడు. ప్రాణికోటికి ప్రాణశక్తిని ప్రసాదించే ప్రత్యక్షదైవం. విశాలనేత్రాలతో, మారుమూలల్లోకూడా మారుమ్రోగే మహత్తరమైన స్వరసంపదతో ఈ ప్రత్యక్ష దైవం సాక్షాత్కరిస్తాడు. సూర్యోదయం కాగానే సరస్సుల్లోని సరోజాలు విచ్చుకుంటాయి. సంసారంలోని సారాన్ని సంసారులకే పంచిపెట్టి, దానిలోని అందాన్నిమాత్రమే తాను గ్రహించే ప్రభువునేత్రాలు సరస్సులాగా, సరోజాల్లాగా, పుష్కరంగా, పుష్కలంగా కనిపిస్తాయి. అందువల్లనే అతడు పుష్కరాక్షుడు. అతని వాక్కు మహాస్వనం. మామూలు నిస్వనం కాదు. ఎవరు ఎలా వినగలిగితే వారి కలా వినిపించే విలక్షణమైన ధ్వని అతని పదసంపదలో ఉంది.

అతనికి ఆద్యంతాలు లేవు. పుట్టలేదు కాబట్టి, గిట్టటమనే ప్రశ్నే లేదు. అసలు ప్రపంచాన్ని సృష్టించిన ధాతకు జనన నిధనాలు లేవు. అత డనాదినిధనుడు. సృష్టికర్త కాబట్టి ధాత. సృష్టించిన జీవకోటికి జీవనవిధానాన్ని ఏర్పరచటంకూడా అతని విధి. ఈ విధి విధానాలు అతణ్ణి ధాతగా విధాతగా రూపొందించాయి. అతడు ఉత్తమవర్గానికి చెందిన ధాత. అతని సృష్టికి తిరుగు లేదు. అనాది కాలంనుంచి ఇంతమంది ప్రాణులు జన్మిస్తున్నారు. ఒకరిని పోలినవారు మరొకరు ఎక్కడో కనిపిస్తారు. కాని ఎవరి తీరు వారిదే. ఒకరు మరొకరు కారు. ఇంతటి వైవిధ్యంతో తన సృష్టిని కొనసాగించగలిగిన మహాశిల్పి ఉత్తమధాత. ఏదో ఒక ఉత్తమ ధాతుబలంవల్లనే ఈ సృష్టికార్యం సాధ్య మవుతున్నది.

## 6

ఇంతటి అనంతవిభూతిని సృష్టించి అందులో ఒక విలక్షణ జీవిత విధానాన్ని కూర్చిన విధాత ఈ సృష్టితో తనకేమీ సంబంధం లేనట్టు,

ప్రమేయం లేనట్టు అప్రమేయుడై ఉంటాడు. కాని జీవకోటి అనుభవించే ఆనందానికి, ఆమోదానికి, హర్షానికి, హాయికి ఆధారములైన ఇంద్రియాలను తన చెప్పుచేతల్లో పెట్టుకుంటాడు. ఈ యింద్రియ ప్రపంచమే హృషీకం. దీనికి అధిపతి హృషీకేశుడు. సర్వేంద్రియ సంచలనానికి హృషీకేశుడే మూల కారణం. అతని నాభిలో కమలం ఉంది. ఆ కమలమే సృష్టికి మూలం. ప్రపంచంలో పొందదగిన సంపదలు అన్నీ ఆ కమలంలో, పద్మంలోనే ఉన్నాయి. ఆ పద్మం అతని అవయవాలకు కేంద్రమయిన నాభిస్థానంలో ఉంది. కాబట్టి అతడు పద్మనాభుడు. ఈ పద్మం భూలోకానికే కాదు. భువస్సువ ర్మహాలోకాదులకు కూడా మూలం. మర్త్యులకే కాక అమరులకుకూడా ఆ పద్మనాభుడే ప్రభువు.

చిత్ర విచిత్ర నిర్మాణ నైపుణ్యం కలిగిన మహాశిల్పి ఆ విశ్వకర్మ. భూలోకానికి, స్వర్గలోకానికి, ఇతరలోకాలకు నిర్మాణ కార్యక్రమంలో తోడ్పడే సాంకేతిక సారథి సర్వేశ్వరుడు. ఈ నిర్మాణమంతా అతని ఆలోచనల పరిణామమే. ఆలోచనలకు లోచనాలు ప్రసాదించే ఆలోచనా లోచనుడు విశ్వభావనుడు. ఆలోచించే మనస్సును ప్రసాదించే మనువు తన ఆలోచనా శక్తినే మానవులకు సంక్రమింపజేస్తాడు. మంచి మంచి ఆలోచనలు మంచి మంచి పనులకు మూలం. మంచిని సాధించగలిగినంత మేరకు మానవులను పెంచి, అనవసరంగా పెరిగినదాన్ని తగ్గించి, తన సృష్టిని సర్వాంగసుందరంగా, నయన మనోహరంగా తీర్చిదిద్దగల త్వష్ట, వడ్రంగి -- ఆ పరమేశ్వరుడు. సూక్ష్మాతిసూక్ష్మమైన సృష్టికి ఆధారభూతుడైన భూతేశుడు అందరికంటె స్థూలమైనవాడు. ఆకారంలో బృహద్రూపి, స్థవిష్ఠుడు. వ్యవహారంలో దిట్ట, స్థవిరుడు. ఆలోచనలలో గట్టివాడు, దృఢవ్రతుడు. చలించనివాడు, ధ్రువుడు. ధ్రువుడు కదలడు. నక్షత్రమండల మంతా అతనికి ప్రదక్షిణం చేస్తూ పరిభ్రమిస్తుంది. అలాగే విధాత నిలకడగా నిశ్చలంగా ఉంటాడు. ప్రాణికోటి అతని చుట్టూ తిరుగుతుంటుంది. ప్రపంచం అధ్రువం. పరమేశ్వరతత్త్వం ధ్రువం.

## 7

స్థిరంగా, స్థూలంగా, స్పష్టంగా, సర్వాంతర్యామిగా ప్రపంచంలోని ప్రతి అణువులో వ్యాపించి ఉన్నప్పటికీ అతని పట్టు ఎవరికీ తెలియదు. ఎవరికీ పట్టుబడదు. ఇంద్రియములు అతని ఉనికిని గ్రహించలేవు. అందువల్ల అతనిని అగ్రాహ్యుడని అంటారు. కాని నిరంతరం నిఖిల ప్రపంచానికి ఆధారంగా నెలకొని ఉన్నందువల్ల అతడు శాశ్వతుడు. నల్లని రూపున నయన మనో హరంగా ఉండి అందరి దృష్టిని ఆకర్షించే భువనమోహనాకారం గలవాడు కాబట్టి, అతనికి కృష్ణుడని పేరు. అనురాగంతో అరుణకాంతులు విరజిమ్మే అతని కనుదోయి లోహితవర్ణంలో ప్రకాశిస్తుంటాయి. ఈ లోహితాక్షునికి అప్పుడప్పుడు అనురాగంతోపాటు ఆగ్రహంకూడా ఏర్పడవచ్చు. సామ దాన భేదాలతో పని సాగనప్పుడు నాలుగో మార్గాన్ని కూడా అనుసరిస్తాడు. అప్పుడు దయామయుడైన దైవంకూడా ప్రతర్దను డవుతాడు. ముందు మంచి మంచి మాటలతో మంచిని పెంచేందుకు చూస్తాడు. అది సాధ్యం కానప్పుడు దండం ప్రయోగించేందుకు కూడా వెనుదీయడు.

సర్వసమర్థుడయిన సర్వేశ్వరుడు సకల సంపదలకు నిధానుడు. ప్రభూతమైన సాధనసంపత్తి గలవాడు. అతనికి లేని సంపద లేదు. అతడు లేని చోటు లేదు. క్రింద, పైన, మధ్య -- ఎక్కడ చూస్తే అక్కడ ప్రత్యక్షమవటంవల్ల అతడు త్రికకుబ్ధాముడు. ఈ మూడు చోట్లు పవిత్రము లయినవి. పరమేశ్వరుని పావన సాన్నిధ్యంతో సకలం పవిత్ర మవుతుంది. సకలం మంగళకర మవుతుంది. మంగళకరమైన వస్తువులకు మాంగళ్యం ప్రసాదించే పరమాత్మ పరమ మంగళ పవిత్రతలకు పెట్టిన పేరు.

## 8

అందరి ప్రాణములకు అధీశ్వరుడైన 'ఈశ్వరుడు ప్రాణాలకు ప్రాణం వంటివాడు. అతని ప్రాణం మహాప్రాణం. ప్రాణములను పాలించే పరమ ప్రాణం. అదే ఈశానం. ప్రాణములకు కేంద్రస్థానంలో ఉన్న ఈశానుడు ప్రాణికోటికి ప్రాణశక్తిని ప్రసాదిస్తాడు. అతడే అందరికి బహిః

ప్రాణం. అందరిని మించినవాడు. అందరిని పెంచినవాడు. జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు — అతడే ప్రజాపతి. అతనిలో బంగారం ఉంది. రత్నాలున్నాయి. రసనిధు లున్నాయి. మధుధార లున్నాయి. సృష్టికి ముందు ఈ హిరణ్యగర్భుడే భూగర్భుడై మహీతలాన్ని మధువుతో నింపాడు. మధువును చిలికే మాధవి (వసుంధర) అతనికి ప్రియురాలు. మంగళ దేవతయైన మాదేవి(లక్ష్మి) అతని యిల్లాలు. భూదేవికి శ్రీదేవికి ప్రీతిని కూర్చే మాధవుడు మధువులోని మాధుర్యాన్ని సేవిస్తాడు. దానిలోని మాంద్యాన్ని నిషేధిస్తాడు. అందువల్లనే అతడు మధుసూదనుడు.

9

ఈశ్వరుని పరాక్రమం విచిత్రమైనది. కోదండం చేతబట్టుకొని అతడు ప్రపంచమంతటా సంచరిస్తాడు. కాని అతని గమనాన్ని ఎవ్వరూ గమనించలేరు. అతని శాసనం పరమసూక్ష్మమైనది. శాసించినట్టు తెలియకుండా శాసించటం, కదలినట్టు అనిపించకుండానే కదలటం, కోదండం గోచరించకుండానే వినిపించడం -- ఇదీ అతనిలోని వైచిత్రి. అంతుచిక్కని మేధాశక్తిగల మేధావి కనుకనే, అతని విక్రమం, క్రమం ఇలా ఉంటాయి. మేధస్సుకు గోచరించని యీ మేధస్సు పరమేశ్వరుని తేజస్సును ప్రకటిస్తుంది.

పురుషోత్తముడు అందరికంటె ఉత్తముడు. అతనిని మించిన ఉత్తముడు మరి యొకడు లేడు. కనుకనే అతడు అనుత్తముడు. అతనిని అతిశయించే శక్తి ఎవ్వరికీ లేదు. కాబట్టి అతడు దురాధర్షుడు. మనం చేసే పనులన్నీ అతని చెప్పుచేతల్లోనే ఉంటాయి. చేసింది మనమయినా చేయించింది అతడు. అసలైన కృతి, కృతజ్ఞుడు అతడే. మన కృతిత్వాన్ని గుర్తించి దానికి తగిన ప్రతిఫలాన్ని అందజేసే కృతజ్ఞత అతనిలో ఉంది. చిత్రగుప్తుని రూపంలో మనలోనే దాగి ఉండి, మన మంచి చెడ్డలను పరిశీలించి పాపపుణ్యాలకు తూచినట్టు ప్రతిఫలం ముట్టజెప్పే కోశాధ్యక్షుడు భగవంతుడు. అతనికి శరీరంతో, మనస్సుతో ప్రమేయం లేదు. అతనికి ఆత్మతోనే ఆత్మీయత. ఆత్మవంతుడని ప్రసిద్ధిచెందిన పరమాత్మకు ఆత్మ

తత్త్వం పరిపూర్ణంగా తెలుసు. శరీరం కర్మయోగాన్ని సాధిస్తుంది. మనస్సు జ్ఞానయోగంలో ఆరితేరుతుంది. ఆత్మ భక్తితాత్పర్యాలతో పరమాత్మలో లీనమయిపోతుంది. ఈ మూడింటి సమన్వయమే జీవిత పరమావధి.

## 10

పరమేశ్వరుడు మానవకోటికే కాదు. దేవతలకుకూడ ప్రభువు. ఆ సురేశుడే అందరికీ శరణ్యుడు. అందరికీ ఆనందం, సౌఖ్యం, హాయిని పంచి పెట్టటమే ఆ శర్మగారి పని. ప్రపంచమంతా అతని వీర్యంతో నిండి ఉంది. ప్రజ లందరూ ఆయన బిడ్డలే. ప్రతిదినం ఉదయించి, ప్రతిదినం లయించే అహస్సులా ఆయన నిత్యజీవి. నిరంతరం అవిచ్ఛిన్నంగా కొనసాగే సంవత్సరంలా సాగిపోయే జీవనది ఆయన వ్యక్తిత్వం. క్షణం విశ్రాంతిలేకుండా ప్రాణికోటికి తెలియకుండానే వాళ్ళ ప్రాణాలను హరిస్తూ, ఆయుస్సును క్షీణింపజేస్తూ నిర్లిప్తంగా నిరంతరం ముందుకు నడిచే కాలసర్పంలాంటి మహా వ్యాళుడు పరమాత్మ. కాలం దైవసంకల్పాన్ని నెరవేరుస్తుంది. ప్రపంచంలోని ప్రతి సంఘటన కూడా పరమేశ్వరుని సంకల్పంవల్లనే జరుగుతుంది. కాలం అందరికీ కావలసినదే. కాలంతో ప్రమేయం లేనివాడు ఉండడు. కాల రూపంలో ప్రచరించే వ్యాళం అందరిని సమీపిస్తుంది. అందరినీ చూస్తుంది. కాబట్టి, కాలపురుషుదు ప్రత్యయుడు. సర్వదర్శనుదు. విచక్షణలేకుండా అంద-రిని సంహరించే కాలం మీద అందరికీ నమ్మకం ఉంది. ప్రత్యయం ఉంది. గడచిన సమయం ఎంత గడుసుగా గడిచినా, రాబోయే రోజులు మంచిని తెస్తాయనే ఆశ ప్రతిజీవికి ఉంటుంది. అందుకే అతడు జీవిస్తాడు. ఈ జీవన రహస్యం కాలంలోని కీలకం.

## 11

జీవకోటిని జనన మరణ సంసరణంలో సంచరింపజేసే సర్వేశ్వరునికి జనన మనేదే లేదు. అతనికి తల్లిదండ్రులు లేరు. జనన మరణాలు లేవు. అతని ఉనికి స్వయంసిద్ధం. అతడు సిద్ధుడు. సిద్ధి అతనికి సహజం. జన్మలేని అజునికి ఆద్యంతములుకూడా లేవు. అన్నిటికంటె ఆద్యమవి

మనం ఊహించగలిగిన అనాదితత్త్వానికికూడా అతడే ఆద్యుడు. ఈ సర్వాదియైన సర్వేశ్వరుడు దృఢవ్రతుడు. ఆడినమాట తప్పడు. సృష్టి స్థితి లయాలకు కర్తృత్వం వహించిన అతని ధర్మపథానికి మార్పు లేదు. మృతి లేదు. పొరపాటునకూడా అతడు దారి తప్పడు. ధర్మం జయిస్తుంది. ధర్మసంస్థాపనకై భగవంతుడు కంకణం కట్టుకొని ఉంటాడు. న్యాయాన్ని నిలబెట్టేందుకు ఆదివరాహ రూపాన్ని ధరించిన ఆదివిష్ణువు ధర్మాన్ని నమ్ముకున్న వాళ్ళకు కోరినదల్లా ప్రసాదిస్తాడు. ప్రపంచాన్ని ముంచివేసే మున్నీటి ధాటిని అరికట్టిన కరుణాలయుడు, తన అనుగ్రహధారలను ఎలా కురిపిస్తాడో ఊహించటం కష్టం. పరమాత్ముని ఆత్మశక్తి అమేయం. అది మన కల్పనాశక్తికి అతీతమయినది. కాని 'సకల యోగసాధనలకు సారం అతని అనుగ్రహబలం' -- అని మాత్రం చెప్పగలం. ఆత్మ సాయుజ్యమే యోగసాధనకు పరమావధి.

## 12

అష్టవసువుల రూపంలో వసుంధరకు తన సాన్నిధ్య సౌభాగ్యం ప్రసాదించిన ఐశ్వర్యశాలి. మనస్సు కూడా చాలా గొప్పది. అంతర్యామియై అంతట నివసించి, అందరిని కాచియుండే అంతరాత్మ, గొప్పహృదయం కలవాడు, వసు మనస్కుడు. ఆడినమాట తప్పని సత్యమూర్తి. అందరిని సమానంగా చూచి, అందరికీ అనుకూలమైన పనులు చేసి, అందరి అంగీకారంతో అందరిలో సమభావం పెంపొందించే పరమేశ్వరుని పరిపాలనాదక్షత అమోఘ మయినది. తెల్లకలువలవలె వల్లని కనుదోయి విప్పి, ప్రపంచంలోని పాప పుణ్యాలను సమీక్షిస్తాడు. అధర్మాన్ని నిరసిస్తాడు. ధర్మాన్ని నిలబెడతాడు. మంచి మంచి పనులు చేయిస్తాడు. చేస్తాడు. చివరకు తానే మంచిగా రూపొందుతాడు. మంచి అంటేనే భగవంతుడనే భావం మంచివాళ్ళ మనస్సుల్లో ఉదయింపజేస్తాడు.

## 13

కాని, కోపంవల్ల పాపం పరిహరిస్తుందని తోచినప్పుడు తన మూడవకన్ను తెరిచేందుకుకూడా వెనుదీయని రుద్రు డవుతాడు. పడగ లెత్తిన పాములా

లెక్కలేనన్ని తలలతో విజృంభించి అధర్మాన్ని నిర్మూలిస్తాడు. ప్రపంచాన్ని నిలబెడతాడు. అతని చెవులు పాముచెవులు. పావనమైన చెవులు. ఎక్కడ ఏ శబ్దమయినా అతనికి వినిపిస్తుంది. ప్రపంచానికి మూలస్థానంలో ఉండటంవల్ల అతనికి అందరూ సన్నిహితులే. సములే. అతని హృదయం అమృతంతో పొంగి పొరలిపోతూ ఉంటుంది. ఆయన సంతతి అమృత సంతానం. దానికి చావు లేదు. చలనం లేదు. శాశ్వతంగా స్థాణురూపంలో సర్వత్ర వ్యాపించిన మహాతపస్విని నమ్ముకున్న నరకోటికి కోరిన వరాలు లభిస్తాయి. మహోన్నత పదవికూడా మాటమాత్రం ప్రస్తావిస్తే మరుక్షణంలో కరతలామలకం అవుతుంది.

## 14

అతనికి పక్షపాతంలేదు. అందరికీ అతడు సులభుడే. అందరి దగ్గరికీ అతడు వెతుక్కుంటూ వస్తాడు. సూర్యకిరణాలు మారుమూలలను కూడా చొచ్చుకొని ప్రసరించినట్లే ఆయన కరుణ కిరణాలు దశదిశలా దీనులను, హీనులను, యోగులను, సాధులను -- అందరినీ అనుగ్రహిస్తాయి. తనకు తీరకపోతే తన సేనను నలువైపుల సంపించే విష్వక్సేనునికి జనుల ఆర్తిని తీర్చటమే లక్ష్యం. దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించే జనార్దనుని స్మరించినవారికి లాభమే కాని, నష్టముండదు. పురోగమనమే కాని, పరాభవ ముండదు. అతడు వేదమూర్తి. వేద వేద్యుడు. వేదవిదుడు. తానే వేదం. వేదములను సాంగోపాంగముగా, సరహస్యంగా సాధించి శోధించిన వేదవేత్త. ఆయన అవయవములే వివిధ వేదములు. లేనిది సృష్టించి కవయించగల మహాకవి ఆయన. విశ్వమే ఒక మహాకావ్యం. విశ్వకర్మ ఆ కావ్యకర్త.

## 15

లోకానికి, దేవతలకు, ధర్మానికి అతడే అధిపతి. లోకం ప్రజానీకానికి సంబంధించిన జనపక్షం. దేవతలు ఆలోచనలకు, ఆచరణకు సంబంధించిన మేధావులు. ధర్మకర్తలు న్యాయపరిపాలనకు సంబంధించిన నిర్ణయాధికారుల వర్గం. ఇలా ప్రపంచ పరిపాలనకు సంబంధించిన పాలితులకు, పాలకులకు,

పాలనాపద్ధతికి ఆధ్వర్యం వహించిన అఖిలేశ్వరుడు అందరిచేత అన్నిపనులు చేయించే బాధ్యత వహిస్తాడు. లోకపాలకులు, కార్యపాలకులు, న్యాయ పాలకులు ఎవరి విధి వారు సక్రమంగా నిర్వహించేటట్టు చూచే సర్వాధికారి. తాను స్వయంగా ఏమి చేయక పోయినా అన్నీ చేసినట్టే. చేసినా చేయనట్టే. అందువల్ల అతడు కృతాకృతుడు.

ఇంత విచిత్రంగా విశ్వరాజ్యాంగం నడిపించే విశ్వేశ్వరుడు నాలుగు రూపాలలో నాలుగు వ్యూహాలను ఏర్పరచుకొని, నాలుగు కోరలతో నాలుగు భుజాలతో నలుదిక్కుల వ్యాపించి ఉంటాడు. అతనిని తప్పించుకొని వెళ్ళేందుకు వీల్లేదు. జాగ్రదవస్థలో వైశ్వానర రూపంలోను, స్వప్నావ-స్థలో తైజసరూపంలోను, సుషుప్తి(గాఢనిద్ర)లో ప్రాజ్ఞరూపంలోను, ఈ మూడింటికి అతీతమైన తురీయావస్థలో సర్వేశ్వర రూపంలోను పరమాత్మ తన ఆత్మవైభవాన్ని ప్రకటిస్తూ ఉంటాడు. ఒకప్పుడు వాసుదేవునిగా ప్రపంచమంతటా వ్యాపించి ఉంటాడు. మరొకప్పుడు సంకర్షణ రూపంలో సమస్త జీవరాశిని తనవైపు లాగుకొని గంభీరంగా ఉంటాడు. ఒకానొకప్పుడు ప్రద్యుమ్నరూపంలో వెలుగులకు వెలుగుగా నిగనిగలాడుతూ ఉంటాడు. ఒకానొక సమయంలో ఎవరికీ లొంగని అనిరుద్ధ రూపాన్ని ధరిస్తాడు. నాలుగు భుజాలతో పరవాసుదేవుడై భక్తులకు పారవశ్యాన్ని ప్రసాదిస్తాడు. పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి -- అనే నాలుగుచోట్ల అతని మహాస్వనం వినిపిస్తుంది. నలుగురికి నాలుగు రకాలుగా, పదిమందికి పలు విధా-లుగా, ప్రాణికోటికి కోటిరూపాలలో గోచరించే లోకాధ్యక్షుడు అన్ని విధాల చతురుడు.

## 16

లోకానికి వెలుగును ప్రసాదించే లోకేశుడు వెలుగులోనే నివసిస్తాడు. అతడే వెలుగు. అతనిదే వెలుగు. అతడే భుజించే భోక్త. భోక్త భుజించే భోజనం కూడా అతడే. ఆనందాన్ని అందించే అందం, అందంవల్ల లభించే ఆనందం రెండూ అతడే. అతడే ప్రకృతి. అతడే పురుషుడు. అతడే భోజ్యం. అతడే భోక్త.

అందరిని మించినవాడు కాబట్టి అన్నిటిని సమీపించే మహనీయుడు. ప్రపంచానికి మూలకారకుడు. పాపానికి అతనికి పొత్తు కుదరదు. పాపాలను పారద్రోలి పరమ నికృష్టమైన పనులనుకూడా పరమపావన భావనతో స్వీకరించగల ఔదార్యం అతని జయ విజయాలకు ఆధారం. ప్రపంచంలో ప్రతి అణువులో మంచినే చూడగల మనస్వికి పరాజయం ఉండదు. అతనిదే విజయం. అతడు నిజమైన జేత. విశ్వమంతా అతని సంకల్పంనుండే ఉదయిస్తుంది. ఉదయించిన ప్రతి చైతన్యం లయిస్తుంది. కాని లయించిన లావణ్యం మళ్ళీ ఉదయించక మానదు. ఉదయానికి లయానికి మూలం అతడే. మాటి మాటికి ఉదయింపజేసి, చివరకు తనలో లయింప జేసుకునే పునర్వసు తత్త్వం పరమాత్మలో ఉంది.

## 17

సకల చరాచర జగత్తును క్షణంలో తనలో లీనం చేసుకుని, మరు క్షణంలో మళ్ళీ ప్రభవింపజేయగల జగత్ప్రభువు. వామనావతారంలో ఇంద్రునికి సోదరుడుగా (తమ్ముడుగా) జన్మించాడు. ఇందులో అతనికి పోయిన ఘనత లేదు. ఇంద్రునికి వచ్చిన గౌరవం లేదు. పరిస్థితిని బట్టి సరిపెట్టుకోగల వినయశీలి కాబట్టే, పొట్టి తమ్ముడుగా పుట్టి బలిని పాతాళంలోకి సాగనంపాడు. పొట్టివాళ్ళలో పొట్టి. స్థూలకాయుల్లో మహాకాయుడు. అణకువగా ఉన్నా, అతిశయించి ఉన్నా అతనిలోని ప్రాశస్త్యంలో మార్పు లేదు. ఎప్పటికీ అతని కీర్తి అమోఘమే. అతని పవిత్రత, పరాక్రమం ఎన్నటికీ అకుంఠితం.

ఒకప్పుడు ఇంద్రుని తమ్ముడుగా ఒదిగివున్న వామనుడు మరొకప్పుడు ఇంద్రుని అతిశయించిన అతీంద్రు డవుతాడు. అతీంద్రియమైన అనుభూతి ఆత్మకు గురుతు. పరమాత్మకు ఉనికి. యమ నియమాది సాధనలతో ఆత్మసంయమంతో అంతరాంతరాలలో ఒదిగియున్న ఆత్మను దర్శించిన మహాత్ములకు, సృష్టి స్థితి లయాల రహస్యం తెలుస్తుంది. తాను చేసిన సృష్టిని తనకు కావలసినంతవరకు నెలకొల్పి, తాను సంకల్పించిన ప్రయోజనం నెరవేరగానే, తనలో లీనంచేసుకొనే పరమేశ్వరుని మాయ

ఇంద్రియపరాయణులకు బోధపడదు. దానికి అతీంద్రియ భావనా శక్తి అవసరం. అది ఆత్మపరాయణులకే సాధ్యం.

18

అన్ని విషయములు తెలిసినవాడు, అందరు తెలుసుకొనవలసినవాడు. సర్వకాల సర్వావస్థలయందు యోగముద్రలో ఉండి, దర్శనమాత్రంచేత సకల దర్శనసారాన్ని బోధించగలిగిన సదాయోగి మాధవుడు. మంచి మంచి మాట-లలో తియ్యని తలపులను మందులా అందించే వైద్యుడు, వేదవేద్యుడు. అతని లోకోత్తర పరాక్రమం, అంతులేని ఉత్సాహం, అంతుపట్టని అంతర్యం మామూలు మానవులకు బోధపడవు. దానికి అతీంద్రియమైన అనుభవం కావాలి.

19

మహత్తరమైన మేధస్సు, మహత్తరమైన తేజస్సు, మహత్తరమైన బలము, వెలుగు -- ఇవన్నీ ఆ మహామానవుని లక్షణాలు. శరీరపురుషుని, ఛందఃపురుషుని, వేదపురుషుని మించిన మహాపురుషుని ఆకృతి ఇలా ఉంటుందని నిరూపించేందుకు వీలు లేదు. ఏ రూపంలో భావిస్తే ఆ రూపంలోనే ఆ బహురూపి గోచరించవచ్చు. శ్రీకరమైన యే రూపంలోనైనా అపరిమేయ లావణ్యంతో తన ఆత్మజ్యోతిని వెలయింపజేసే శ్రీమంతుడు భగవంతుడు. పెద్ద పెద్ద కొండలను కూడా అవలీలగా చిటికెనవ్రేలిపై నిలబెట్టగలిగిన శక్తిమంతు డా భగవంతుడు.

20

సర్వస్వాన్ని స్వాధీనం చేసుకోగల మహాధనుస్సు సర్వేశ్వరుని చేతిలో సర్వదా శోభిల్లుతూ ఉంటుంది. ప్రణవాకారంలో రమ్యంగా, నమ్యంగా ఉండే యీ ధనుర్బలంతోనే, మహాధన్వి మహీతలాన్ని పాలిస్తాడు, పోషిస్తాడు. శ్రీనికేతనం అతనికి నిరసుఖాలయం. అతని అనుగ్రహంకోసం అష్టాంగ యోగసాధనలో నిమగ్నులైన సాధకులకు ఆ శ్రీసదనమే పరమగమ్యం

పరమరమ్యమైన ఆ గమ్యాన్ని చేరదలచుకుని పయనించే బాటసారులకు శ్రీనివాసుడే అన్ని వసతులు కల్పిస్తాడు. కావలసిన పాథేయం ఇచ్చి, అవాంతరములయిన ఆపదలను తొలగించి, సాధనా పథాన్ని అనిరుద్ధంచేసి, అనుగ్రహిస్తాడు గోవిందుడు. గోవిందా! అని బిగ్గరగా పిలిస్తే, పలుకుతాడు. చేరినవారిని చేదుకొని దేవతలకుకూడా లభించని ఆనందాన్ని వాళ్ళకు ప్రసాదిస్తాడు. గోవిందునిలోని గోప్యం అలాంటిది. గోరహస్యం తెలిసిన గోస్వాములకు స్వామి గోవిందుడు. ఆవులోని మంచితనం, వాక్కులోని తియ్యదనం, సురలోకపు సౌందర్యం, భూవాసుల సద్భావం -- అన్నీ గోవిందనామంలో గుమికూడి ఉన్నాయి. ఆ నందనందనుడు గోవిందుడు.

## 21

అంతరిక్షంలో హంసలా పయనించే ప్రభాకరుడు, ఆ ప్రభాకరుడు ప్రసరింపజేసే ప్రచండకిరణాలు, ఆ కిరణాలు సాధించే సర్వదమన సామర్థ్యం -- అన్నీ పరమహంసకు ప్రతిరూపాలు. కాంతికిరణాలు గోవిందునికి శాంతినిలయాలు. కిరణాంతరంగంలో చేరిన కరుణాంతరంగుడు అందరి అంతఃకరణంలో ఆత్మసంయమాన్ని నెలకొల్పుతాడు. కిరణాలు వెలుగు నిస్తాయి. వెలుగు మెలకువ నిస్తుంది. మెలకువ తెలివిని వెలయిస్తుంది. ఈ తెలివితో, ఈ చెలిమితో, ఈ కలిమితో నేలమీద ప్రాకే పాము కూడా అంతరిక్షంలో గరుడపక్షిలా ఎగురుతుంది. గరుత్మంతునిపై ఎక్కి పయనించే పరమాత్ముడే పన్నగశాయియై పవళిస్తాడు. చక్కని రెక్కలతో చుక్కలకు సమీపంగా ఎగురగల సుపర్ణునిలో ఉన్న ఐశ్వర్యమే ప్రక్కబలంతో ప్రాకులాడే పాములసామిలో కూడా ఉంది.

శ్రీహరిగర్భంలో హిరణ్యం ఉంది. హిరణ్యంలా పరమరమ్యంగా కనిపించే అతని నాభిస్థానం లోకకల్యాణం చేకూర్చగలదు. ఎంత తీసినా తరగని బంగారం అతని బొడ్డులో కూరుకొని ఉంది. అయితే తపస్సంపన్నులకే ఆ బంగారం కనిపిస్తుంది. 'రారా తండ్రీ'యని పిలుచుకున్న దశరథుడు, పాల బుగ్గల పసిడి చెక్కిలిని ముద్దిదుకున్న కౌసల్య, మన్ను తిన్న నోటిలో మహామహిని చూచిన యశోద -- వీళ్ళందరూ అలాంటి తపస్సంపన్నులే. ఆ

ప్రజాపతి గర్భంలో బంగారమే కాదు, పద్మం కూడా ఉంది. బంగారంలాంటి పద్మం పరమాత్మకు నాభిస్థానం, కేంద్రం.

## 22

మరణ మెరుగని మహనీయుడు మర్త్యుల జనన మరణ సంసరణాన్ని మెలకువతో గమనిస్తూ ఉంటాడు. పండిన ధాన్యం రాలినట్టు, పరిపక్వమైన ప్రాణం పంచత్వం పొందుతుంది. ఈ పరిణామాన్ని ప్రాణపతి అన్ని దిక్కుల నుండి పరికిస్తూ తిలకిస్తూ ఆమోదిస్తూ ఉంటాడు. సింహంలా వెనుకకు చూడటమే కాదు, నరసింహునిలా నలువైపుల చూచే నాల్గుమోముల స్వామి సర్వసమ్మేళనం చేసే సంధాత. ఎక్కడ ఎప్పుడు ఏ ప్రాణాలను ఎలా సంధానం చేయాలో తెలిసి అనుసంధించే సంధికార్య విశారదుడు జగన్నాటక సూత్రధారుడు. ఎన్నిపూసలు పోయినా యీ సంధిసూత్రం నశించదు. అది సుస్థిరమైన శాసనం. అతనికి పుట్టుక లేదు. సకలసృష్టికి మూలమైన అకారమే ఆ సూత్రానికి బీజాక్షరం. అకారంనుండి ఉదయించిన అజునికి ఆకారం లేదు, వికారం లేదు. అతని మాటకు ఎదురు లేదు, తిరుగు లేదు. దుశ్శాసనులకు లొంగని సుశాసనుడు కాబట్టి, అతన్ని గురించి ప్రపంచమంతా చెప్పుకుంటుంది. వేదాలు, వేదాంగాలు, వేదాంతం, పురాణాలు, కావ్యాలు, కథలు, కలాపాలు -- అన్నీ అతనికి ప్రశస్తిపాత్రాలే. మంచిని విరోధించే మహాదానవులను క్షణంలో అంతమొందించగల అసురారి ఆ మురారి.

## 23

పరమాత్మ ప్రపంచానికి గురుతుల్యుడు. అందరికీ మంచిని పంచి పెట్టగల జగద్గురువు. అంతకుమించిన గురువు మరొకరు లేరు. అంధకారాన్ని తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసాదించే దివ్యధామం అతని దివ్యనామం. ఆ నామమే వెలుగు నిస్తుంది, నిలువ నీడ నిస్తుంది. సత్యమే ఆ వెలుగుకు మూలం. నారాయణుడు సత్యస్వరూపుడు. సత్యమే అతని పరాక్రమం. అతని పరాక్రమమే సత్యం. మిగిలినది అసత్యం. అందరి పరాక్రమానికి

ప్రాణంపోసే మహాప్రాణి అతడే. కనురెప్పపాటులో కాంతిని ప్రసాదించి, శాంతిని నెలకొల్పగల నిమిషజీవి. అసలు నిమిషమనేది అతని సంకల్పంవల్లనే ఏర్పడుతుంది. చలనంలేని అనాది కాలంలో ఆత్మవంతుని సంకల్పంచేత సృష్టిలో చలనం, స్పందనం, నిమిషత్వం ఏర్పడ్డాయి. సృష్టి ఆరంభమయింది. అతని మెడలోని ముత్యాలహారం అతిరమణీయమైనది. దానిలోని పూసలే నిమిషాలు, హోరలు, పగళ్ళు, రాత్రులు, వారాలు, నెలలు, సంవత్సరాలు, యుగాలు. అనంత కాల మాలను మెడలో వేసుకొని, తన అనంతవైభవాన్ని అక్షరరూపంలో -- వాఙ్మయరూపంలో -- అసంఖ్యాక జీవకోటికి అందించే ఉదారమతి అతడు. వాగ్విలాసం ఉన్నంతమాత్రాన లాభం లేదు. అది లోకకల్యాణానికి ఉపయోగపడాలి. పరమాత్ముని పదసంపద, ప్రాణికోటికి పరమ కల్యాణ పరంపరలను నిరంతరం ప్రసాదిస్తుంది. కనుక అతడు సకలారాధ్యుడైన వాచస్పతి.

## 24

ఇంద్రియగ్రామాన్ని, భూతగ్రామాన్ని, విశ్వగ్రామాన్ని సక్రమంగా, సహేతుకంగా, సోద్దేశ్యంగా, సాభిప్రాయంగా తనతో పాటు ముందుకు తీసికొని పోయే అగ్రణి పరమేశ్వరుడు. ఎక్కడినుంచి వచ్చామో, ఏ దిక్కున వెళ్ళుతున్నామో, చివరకు ఎక్కడకు చేరుకోవాలో తెలియని బాటసారులకు ప్రశస్తమైన దారిని చూపించే ఊరిపెద్ద భగవంతుడు. అతడు శ్రీమంతుడు. బాటసారులకు కావలసిన దారిబత్తెం అతనిదగ్గర పుష్కలంగా ఉంది. ఎవరికి ఎలాంటి పాథేయం ఎంత పరిమాణంలో ఏ రూపంలో అందించాలో గమనించి పంచిపెట్టే న్యాయమూర్తి విష్ణుమూర్తి. గాలి ఎలా ప్రసరిస్తుందో ఆ విధంగానే ఆ రూపంలోనే వాయువాహనుడు పయనిస్తాడు. జగన్నాయకుడు సమస్త జగత్తును సమీరంతో సమీకరిస్తాడు. స్థలాన్నిబట్టి, సమయాన్నిబట్టి, ఋతువునుబట్టి అనేకరూపాల్లో సంచరించి, ప్రాణాలను నిలబెట్టే ప్రాణవాయువులాగా ప్రాణపతియైన పరమాత్మ వెయ్యి రూపాల్లో, వెయ్యి తలలతో, వెయ్యి కళ్ళతో, వెయ్యి కాళ్లతో అన్ని వేళలా అంతటా సంచరిస్తుంటాడు. పైరగాలిలో, పడమటి వడగాడ్పుల్లో, మలయమారుతంలో,

మందు బెండల్లో, అంతటా విశ్వావసురూపంలో విశ్వాత్మ విస్తరించి ఉంటాడు. ఆ విశ్వరూపాన్ని సాక్షాత్కరించుకునేందుకు విశ్వభావన కావాలి. విష్ణు భావనకూ విశ్వభావనకూ భేదం' లేదు.

## 25

నిజంగా ప్రపంచంలో ప్రమేయంలేని పరమాత్మ ఏ మూలసౌధంలోనో నిర్లిప్తంగా నివృత్తిమార్గంలో నిష్ణాతుడైన సన్న్యాసిలాగా ఉంటాడు. కాని, జీవకోటి ఉదయానికి, అభ్యుదయానికి, లయానికి అతడే మూలకారకుడు. పోషించేది, శోషింపజేసేదికూడా అతడే. ఎండ వానలు, వెలుగు నీడలు, మంచి చెడ్డలు -- అన్నీ అతని కనుసైగను గ్రహించే వర్తిస్తాయి. కాని, అతడు మాత్రం నివృత్తుడు. పగలు రావాలంటే రాత్రి గడవాలి. వెలుగు రావాలంటే చీకటి పోవాలి. దీనికి సాంధ్యసంఘర్షణ అవసరం. ఈ సమరంలో ప్రధానపాత్ర వహించే ప్రభాకరుడు, ప్రచండమైన తేజస్సుతో ఉదయించి, చీకటిని తొలగించి వెలుగును ప్రసరింపజేస్తాడు. అగ్ని కూడా వెలుగు నిస్తుంది. కాని వెచ్చదనంకూడా ఇస్తుంది. గాలి వెచ్చదనాన్ని, చల్లదనాన్నికూడా ఇస్తుంది. ఈ రెంటికి మించిన ప్రాణశక్తినికూడా ఇస్తుంది. సూర్యచంద్రులలోని వెలుగు, వెన్నెల, అగ్నిలోని వెచ్చదనం, ప్రాణ వాయువులోని ప్రాణశక్తి -- అన్నింటికి బీజం ధరణీధరుని ధారణాశక్తి. మనకు ఆధారం ధరాతల మయితే, ధారుణికి ఆధారం ధరణీధరుడు. ఈ బ్రహ్మండానికి అతడు గొప్ప కొండలాంటి వాడు. మామూలు కొండ గాదు, అది పెనుగొండ, పసిడి కొండ.

## 26

ఇంత విశాలమైన విశ్వాన్ని భరించే భారం తనమీద ఉన్నదని విశ్వాత్మకు విసుగు లేదు, దిగులు లేదు, చీకు లేదు, చిరాకు లేదు. ఎప్పుడూ నవ్వుతూ కళకళలాడుతూ ఉంటుంది -- అతని ప్రసన్న వదనం. ఎన్ని పనులు చేస్తున్నా తీరికగా కూర్చుని ఉన్నట్టు కనిపిస్తాడు. మనస్సులో ఎన్ని ఆలోచనలున్నా ముఖారవిందం కొంచెంకూడా ఆ ఆలోచనల నీడలు

తనవైపు రానీయదు. కనుకనే అతడు సమస్త జగత్తును ధరించి భరించి విశ్వంభరుడని, విశ్వధారియని, విభుడని, విశ్వవ్యాప్తమైన ప్రశంసల నందుకుంటున్నాడు.

అతడు చాల మంచివాడు. మంచి మంచి పనులు చేస్తాడు. మంచిని మన్నిస్తాడు. మంచిని చూచి ఆదరిస్తాడు, అభిమానిస్తాడు, అనుగ్రహిస్తాడు. మంచినీటిని పంచిపెట్టే గంగను తనలో దాచిన జహ్నువు తాత్కాలికంగా మంచిని మరుగుపరిచాడు. మంచికీ, మమకారానికీ గిట్టనప్పుడు కొంత కాలం మంచిని దాచటంవల్ల, మమకారంకూడా మంచిగా మారుతుంది. నరుడు నారాయణుడవుతాడు. నరునిలోని మమకారం నారాయణునిలోని మంచిని క్రమంగా గ్రహిస్తుంది. ఇది నర నారాయణ సమీకరణం.

## 27

ప్రపంచంలో ప్రమేయంలేని అప్రమేయుని స్వరూప స్వభావాలను నిరూపించి నిర్వచించటం సాధ్యం కాదు. మన కొలతలకు, మనలెక్కలకు అందేది కాదు ఆ ఆత్మ. అన్నిటికి వేరైన ఆత్మతత్త్వం ఒక పద్ధతికి లొంగేది కాదు. అది విలక్షణం, విశిష్టం. కాని పవిత్రం. అన్నింటికీ అంటని వస్తువే సామాన్యంగా పవిత్రంగా ఉంటుంది. ఇలా మడిగట్టుకుని విడిగా ఉన్న అప్రమేయుడు, తాను విశిష్టుడై ప్రత్యేకంగా ఉండటమేకాక, ఇతరులను కూడా శిష్టులను చేస్తాడు. చెప్పినమాట వినేవాడు శిష్టుడు, విననివాడు దుష్టుడు. దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించటం ధరణీధరుని కర్తవ్యం. దీనికి శుచి ఆధారం. నిప్పులాంటిది శుచి. నిప్పుదగ్గరకు వచ్చిన ప్రతి వస్తువు నిప్పయిపోతుంది. కాలని వస్తువు కాల్పలేదు. అలాగే పరమాత్మకూడాను. అతనిలోని సిద్ధి అతనిని ఆశ్రయించిన ప్రతి వ్యక్తికీ లభిస్తుంది. అతడు సాధించవలసినది లేదు. సకలసిద్ధులు అతనికి స్వాధీనములు. దానికి సంకల్పశుద్ధి మూలకారణం. సంకల్పం శుద్ధమయితే సిద్ధిస్తుంది. మంచి మనసు మంచి పనులకు పునాది. మంచి తెలిసినవాడు మంచి చేయగలడు. సిద్ధిని స్వాధీనం చేసుకున్న సిద్ధార్థుడు ప్రపంచానికి సిద్ధిని ప్రసాదించగలడు. సిద్ధికి సాధనం సిద్ధుడే.

ఒక దీపం మరో దీపాన్ని వెలిగించగలిగినట్లే ఒకానొక మనిషి మరొక వ్యక్తికి మానస మకరందాన్ని అందజేయగలదు.

## 28

ప్రపంచంలో సమస్తం నశించినా ధర్మం నిలబడుతుంది. నిలబడి నిలబెట్టటం ధర్మంయొక్క లక్షణం. మంచి మంచి కోరికలను నెరవేర్చి మంచిని వర్షించటం ధర్మం చేసే పుణ్యకార్యం. ధర్మం అహోరాత్రాలు కర్మాన్ని సాధించినచోట, వృషభరూపంలో విచ్చేసి ధర్మసంస్థాపనకు కంకణం కట్టుకొని నిలబడి ఉంటాడు విష్ణుమూర్తి. ధర్మమే వృషభంలోని కాంతి. కాంతిని వర్షించటమే శ్రీకాంతుని నిత్యకృత్యం. ధర్మం వర్షించిన ప్రతి దినం అతనికి పర్వదినం. విరాట్ పురుషుని విశాలకాయంలోని ప్రతి భాగం ధర్మరసంతో నిండి ఉంటుంది. అతని కడుపులో ధర్మం కూడుకొని ఉంటుంది. ధర్మరసంతో నిండి నిబిడీకృతమైయున్న విష్ణుమూర్తి, వృష-భాకారంలో ధర్మసారాన్ని ప్రపంచానికి పంచిపెడుతూ ఉంటాడు. కరిగే కొద్దీ పెరిగే నీలమేఘంలాగా ఘనశ్యాముడు, కరిగిన కరుణాజలంతో పెరిగి పెద్దవాడవుతుంటాడు. తాను పెరగటమే కాక, ఇతరులను పెంచుతాడు. కరగటం, పెరగటం అతనికి సరదా. ఇలా ప్రపంచంతో కలిసి మెలసి కరుగుతూ పెరుగుతూ తిరుగుతున్నప్పటికీ, అతనికి ఏకాంతమంటే ఎక్కడలేని మమకారం. అందరితో ఉంటూనే అందరికీ దూరంగా ఉండగలిగిన వివేకి కనుకనే, అతని దగ్గరకు వేదాలు మనోహరనాదాలను వినిపిస్తూ పరుగెత్తుకొని వస్తాయి. మందంగా మధురంగా మృదులంగా సరళంగా నినదించే వేద నదులు, ఆ రత్నాకరుని వెతుక్కుంటూ పొంగి పొరలే ఉత్సాహంతో అతని ఒడిలో ఇమిడిపోతాయి. ధర్మం కురిసిన వర్షజలంతో ఆ శ్రుతిసాగరుడు నిండిపోతాడు, పండిపోతాడు. కాని చెలియలికట్ట దాటడు. గట్టులోపలనే గలగల, కలకల.

## 29

మోకాళ్ళవరకు విస్తరించిన విశాలబాహువులతో విరాట్ పురుషుడు విశ్వభారాన్ని అవలీలగా మోయగలడు. కాని అతని భారాన్ని మరెవ్వరూ

వహించలేరు. ఆజానుబాహువు, మహాబాహువు, చతుర్భుజుడు -- అని కొనియాడబడిన పరమాత్ముని భుజబలం చూచి భావించవలసినదే కాని, ధరించ నలవికాదు. శత్రువులను సంహరించేందుకు, ధర్మం నిలబెట్టేందుకు ఈ అపరిమేయ బాహుబలాన్ని సుభుజుడు ఉపయోగిస్తాడు. ఈ భుజబలానికి తోడు భగవంతుని వాగ్విలాసంకూడా దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు ఉపయోగ పడుతుంది. భుజబలం శరీరానికి సంబంధించింది. వాక్సంపద మనస్సుకు సంబంధించింది. ఈ రెంటినీ సమన్వయించుకొన్న మహామహుడు మహేంద్రు డవుతాడు. సకలసంపదలను స్వాధీనం చేసుకుంటాడు. స్వాధీనమైన సంపదను పదిమందికీ పంచిపెడుతాడు. ఈ విశ్వసంపదలో తాను కూడా ఒకభాగమై పోతాడు. మట్టిలో ధాన్యమై, చెట్టులో కాయలై, జలములో సారమై, గాలిలో ప్రాణమై, నిప్పులో వేడియై, నింగిలో శూన్యమై, అంతటా అన్నిరూపాల్లో వ్యాపించి, అన్నింటికి వసతి కల్పించిన వసుమూర్తి, వసుంధరకు వసుప్రదు డవుతాడు. వసువై వసువులను ప్రసవిస్తాడు.

అతనిది ఒకరూపం కాదు. అనేక రూపాల్లో ఆ బృహద్రూపి సాక్షాత్కరిస్తాడు. సూర్యకిరణాల్లో అతనికాంతి తరంగాయమానంగా తరలి వస్తుంది. నిమిషాల్లో అంతరిక్షమంతా అతని తేజస్సుతో నిండిపోతుంది. ఎక్కడ వెలుతురు కనిపిస్తే అక్కడ కాంతిదాత సాక్షాత్కరిస్తాడు. ఈ వెలుగంతా అతనిదే. అతడే యీ వెలుగు. వెలుగు లేనిచోటకూడా అతని వెలుగు ప్రవేశిస్తుంది.

## 30

ప్రపంచంలో ప్రకాశించేది జ్యోతి అయితే, పరమాత్మలో వెలిగేది పరంజ్యోతి. అది వెలుగులకు వెలుగు. ఆ వెలుగునుండే ఓజస్సు, తేజస్సు, ద్యుతి ఆవిర్భవిస్తాయి. శరీరానికి శోభ చేకూర్చే ఓజస్సు, మనస్సుకు మెరుగుపెట్టే అంతస్తేజస్సు, ఆత్మకు ఆలోకం ప్రసాదించి ఆత్మను దర్శించే అవకాశం కల్పించే ద్యుతి -- ఈ మూడింటికి మూలం పరంజ్యోతి. ఈ జ్యోతి ప్రపంచానికి వెలుగునే కాక వెచ్చదనంకూడా ఇస్తుంది. ప్రకాశం, ప్రతాపం రెండూ ప్రపంచానికి అవసరమే. ఈ రెంటిని పరబ్రహ్మలోని

పరంజ్యోతి ప్రసాదిస్తుంది. ఇలా ప్రపంచంలోని ప్రతిప్రాణికీ ప్రతిక్షణం పంచి పెట్టినా పరంజ్యోతిలోని ప్రకాశం మందగించదు. ప్రతాపం క్షీణించదు. పైపెచ్చు, ఇచ్చినకొద్దీ హెచ్చుతుంది. కాబట్టి దానికి వృద్ధే కాని, క్షయం లేదు. ఈ అక్షయకోశం గాలి సోకి లౌకికమైన వాక్కు అలౌకికమైన అక్షర మవుతుంది. అక్షరంగా మారిన వాక్కు హృదయాన్ని స్పృశిస్తుంది. హృదయస్పర్శతో పెంపొందిన అక్షరమే మంత్ర మవుతుంది. ఆ మంత్రమే పరంజ్యోతిని సాధించి పెడుతుంది. చంద్రునిలోని చల్లదనం, సూర్యునిలోని వెచ్చదనం ప్రకాశ ప్రతాపాలకు ప్రతీకలు. ఈ రెండింటికీ మూలమైన పరంజ్యోతి అనుగ్రహం కావాలంటే స్పష్టమైన అక్షరాన్ని ఆరాధించి, ఆ బలంతో తనలోఉన్న ఓజస్సును, తేజస్సును, దీప్తిని సాక్షాత్కరించుకొని, నిత్య సత్య సందీప్తుడయిన నిర్మలకాంతికాయుణ్ణి సేవించాలి. చంద్రునిలో, సూర్యునిలో, అగ్నిలో ఉన్న వెన్నెల, వెలుతురు, వెచ్చదనం పరమేశ్వరుని నయనాలలో ప్రతిఫలించి ఉంటాయి. ఆ జ్యోతిని దర్శించేందుకు అక్షరమే ఆధారం.

## 31

క్షీరసాగరమథనంలో ఉదయించిన అమృతాన్ని తన కిరణాల్లో పొంగ పరచుకొన్న చంద్రుడుకూడా, ఆ క్షీరసాగరమందే ఉదయించాడు. అమృతానికి, అమృతకిరణుడైన చంద్రునికి జన్మదాత అయిన జగజ్జనకుడు చంద్రునిద్వారా అమృతాన్ని పంచిపెడతాడు. సూర్యునిద్వారా కాంతిని ప్రసరింపజేస్తాడు. ఒకే కాంతిపుంజంనుంచి వెలువడిన వెన్నెల, వేడి వేరు వేరు గుణాలను వెల్లడించినట్లే, ఒకే తత్త్వం నానారూపాలలో నానాగుణాలతో భాసిస్తుంది. పండువెన్నెలతో ప్రపంచాన్ని మురిపించే జాబిల్లిలో, కుందేటిని కూర్చినవాడు కూడా ప్రకాశకాయుడైన పరమాత్మే. దేవతలు వారి వారి విధులను నెరవేర్చేట్టు చూచే నియంత భగవంతుడు. అగ్ని, వాయువు, ఇంద్రుడు -- అందరూ అతనికి భయపడి తమ తమ విధులను సక్రమంగా నిర్వహిస్తుంటారు. అప్పుడప్పుడు పేగు మందగించి అజీర్ణం చేసినా, ఆరోగ్యం చెడినా, ఔషధం ఇచ్చేవాడుకూడా పరమాత్మే. ఇహలోకంలో

ఐశ్వర్యం, పరలోకంలో ఆనందం లభించేటట్టు ఈ రెండు లోకాలకు వంతెనకట్టి, రాకపోకల సౌకర్యం కల్పిస్తాడట విశ్వకర్మ. ఈ సేతుబంధనం, ఔషధ నిబంధనం -- ఇవన్నీ దేనికోసం? సత్యం, ధర్మం కొనసాగేందుకు. ఈ రెండింటిని నిలబెట్టేందుకు పరమేశ్వరుడు నిరంతరం కృషిచేస్తాడు. సత్యధర్మాలు ఆయనకు రెండు. పాదాలు. ఈ పాదాలతోనే భగవంతుడు ముందంజ వేస్తాడు. నడిచేటప్పుడు ఒక కాలు పైన, ఒక కాలు క్రింద ఉంటుంది. అన్యోన్య సహకారంతో రెండుకాళ్లు ముందుకు నడుస్తాయి. అలాగే సత్య ధర్మ సమన్వయంతో పరమాత్మ పరాక్రమం పురోగమిస్తుంది.

## 32

భూత భవిష్యద్ వర్తమానాలను నడిపించే భూతనాథుడు నడిచే తీరే చాల విచిత్రంగా ఉంటుంది. వెనుకనుంచి వచ్చేవాళ్ళను, ఇరుప్రక్కల నడిచేవాళ్ళను, తొందరపాటుతో ముందుకు సాగిపొయ్యే దుందుడుకులను -- అందరినీ కూడగట్టుకుని వెళ్ళేందుకు సత్యధర్మ పరాక్రముడు ప్రయత్నిస్తాడు. ఒకప్పుడు గాలిలా గాలిలో ఎగిరి వెళ్ళుతాడు. మరొకప్పుడు పావనమైన గమనంతో ప్రశాంతంగా పయనిస్తాడు. ఒకానొకప్పుడు ఎంత తిన్నా చాలని అగ్నిలా ప్రజ్వలిస్తాడు. ఒకప్పుడు కామాన్ని పరిహరించి దహించి వేస్తాడు. మరొకప్పుడు కామాన్ని కల్పించి ప్రోత్సహిస్తాడు. వేరొకప్పుడు కమనీయమైన కామంలో కాంతిని వెలయిస్తాడు. ఒకానొకప్పుడు ధర్మ సమ్మతమైన కామాన్ని తనివిదీర అనుభవించవలసినదని కామకోటిని అనుమతిస్తాడు. ఒకప్పుడు అనుగ్రహిస్తాడు. మరొకప్పుడు ఆగ్రహిస్తాడు. సృష్టి స్థితి లయాలకు మూలకందమైన కామాన్ని సత్యధర్మాలతో సమన్వయించి సరియైన మార్గంలో కామయానం కొనసాగేట్టు చూచే కామేశ్వరుడు కామజగత్తుకు ప్రభువు. అతనివల్లనే కామం ఉదయిస్తుంది. అతని అనుగ్రహంవల్లనే కామం కామితార్థాలను నెరవేర్చుతుంది. అతని కనువిప్పుకు కామం దహించుకుపోతుంది. ధర్మసమ్మతమైన కామమే కామేశ్వరుని స్వరూపం.

## 33

కాలపురుషుని అడుగుల్లో యుగాలు, యుగాంతరాలు ఒదిగి ఉంటాయి. యుగాన్ని ఆరంభించి సాగించి ముగించేది అతడే. కబళించేది కాలం. కాలరూపంలో భగవంతుడు చేసే పని యిదే. అనేక మాయలు పన్ని మహా ప్రళయాలను సృష్టించి, తన సృష్టిని తానే లీనం చేస్తాడు మహామాయావి. ఇలా చేయటంలో పరమార్థ మేమిటని అడగాలంటే, ఆయన మనకు కనిపించడు. కాని ఆయన చేసే పనులు మనకు ప్రత్యక్షంగా కనిపిస్తాయి. అతని చేతలే అతని చేతులు. వేలకొలది చేష్టల్లో వేలకొలది విజయాల్లో అతని కీర్తిగాథ వినిపిస్తుంది. అతని విజయమే అతని ఉదయం.

## 34

మహామహిని విశ్వబాహువులతో ధరించిన ఆ మహనీయునికి ఇష్టులు లేరు. అనిష్టులు లేరు. ఇష్టి చేసినవారు ఇష్టులు. లేనివారు అశిష్టులు. వారినికూడా తన ఇష్టవర్గంలో చేర్చుకొనేందుకు విశిష్టమైన ప్రణాళిక ఒకటి ఉంది. శిష్టమార్గంలో చెప్పినమాట విని, చేయవలసిన పని చేసేవాళ్ళు ఇష్టులు. అలా చెయ్యనివాళ్ళను అదిరించి బెదరించి సరియైన మార్గంలో పెట్టేందుకు పరమాత్ముని సాత్త్వికమైన క్రోధం పనికివస్తుంది. కోపం పాపమే. కాని కోపంవల్ల పాపపరిహారం జరిగితే అది కూడా పుణ్యమే అవుతుంది. శిష్టులను ఇష్టులను ప్రోత్సహించేందుకు పరమేశ్వరుడు క్రోధాన్ని నటిస్తాడు. పాములా కాటు వేస్తాడు. వృషభంలా రంకె వేస్తాడు. కాని, పాముకాటు కాలకూటాన్ని అమృతంగా మారుస్తుంది. ఎద్దు వేసిన రంకె రస ధారలకు ఆధారమవుతుంది. నెమలిపింఛం పరమాత్ముని శిరస్సుకు అలంకారం. అందులో విషాన్ని అమృతంగా మార్చే శక్తి ఉంది. శిష్టమార్గంలో భగవంతునికి ఇష్టమైన పనులు చేసేవారికి ప్రపంచమంతా అమృతమయం అవుతుంది. పాము కాటువెయ్యటం మాని నాట్యం చేస్తుంది. వృషభం వాంఛితార్థాలను వర్షిస్తుంది.

## 35

మహీధరుడు ఆడినమాట తప్పడు, మరోబాట తొక్కడు. ఆరు మార్లైనా మారు ఆర్లైనా అతని తీరే తీరు. తీర్చిన తీర్పే తీర్పు. అతని ద్యుతికి చ్యుతి అనేది లేదు. అందువల్ల అచ్యుతుడని అతన్ని అందరూ ఆరాధిస్తారు. ఇంతటి ఖ్యాతి మరెవ్వరికీ లేదు. ముందెవ్వరికీ లేదు. ప్రాణమే తానయిన పరమాత్మ ప్రాణికోటికి ప్రాణదాత. అదితి గర్భంలో ఇంద్రుని తర్వాత జన్మించినందువల్ల ఇంద్రునికి తమ్ముడైన వటికీ, ఇతనికున్న ప్రఖ్యాతి, ప్రాధాన్యం ఇంద్రునికికూడా లేవు. సృష్టిక్రమంలో ప్రప్రథమమైన జలరాశికి అతడే మూలం. అనంత జలరాశి అతనిలోనే నిక్షిప్తమైఉంది. నీరే కాదు, సకల చరాచరజగత్తుకు అతడే ఆధారం. అతనికి మరో ఆధారంలేదు. తనకు తానే ఆధారమై, తనంతట తాను ప్రకాశించే పరమాత్మ ప్రపంచంలో ప్రతికణంలో సుప్రతిష్ఠితుడై ఉన్నాడు.

## 36

ఎక్కడ ఉన్నా ఒక్కక్షణంలో ఎక్కడ స్మరిస్తే అక్కడికి దిగి వచ్చే చైతన్య మహాప్రభువు వాసుదేవుడు. అష్ట వసువుల్లో, ముక్కోటి దేవతల్లో, అసంఖ్యాక జీవకోటిలో అంతటా అన్ని వేళలా తన ఉనికిని స్ఫురింపజేసే సర్వాంతర్యామికి వాయువే వాహనం. ధ్రువనక్షత్రంనుంచి భూమండలం వరకు ఏడువాడల్లో ఏడు వేగాల్లో వీచే వాయు సప్తకం అతణ్ణి ఎక్కడికైనా తీసుకొని వెళ్ళుతుంది. అమృతంలా జారి నరకోటిని తరింపజేసే స్వభావంవల్ల అతనిని స్కందుడన్నా అనవచ్చు. ఒకవిధంగా చూస్తే ప్రతిమానవుడు, ప్రతిజీవి ఇలాగే ఏ మూలనుండో దిగివచ్చినవాడే. కాని సామాన్య మానవులు తెలియక దిగజారిన వాళ్ళు. దేవతలు, దేవదేవుడు తెలిసి దిగివచ్చే వాళ్లు. తెలిసి జారిన వాళ్లు తెలియక పొరపాటున జారిపడిన వాళ్ళను చూచి జాలిపడి, దెబ్బ తగులకుండా సరదాగా జట్టున జారటం నేర్పుతారు. అలాగే సర్వలోక పితామహుడు తన పిల్లలకు ఇలా పైనుంచి క్రిందికి జారటం నేర్పుతాడు. పడితే పట్టుకుంటాడు. జారగా జారగా మోజుతో జారటం, ఆ తర్వాత జారటం మానటం జరుగుతుంది.

ఇది పరమాత్మకు వినోదం. జీవాత్మకు ప్రమాదం. ఈ ప్రమాదంనుంచి బయటపడేందుకు వాసుదేవుడు సహకరిస్తాడు. కోరిన వరాలు కురిపిస్తాడు. వెయ్యి సూర్యులవల్ల లభించే కాంతిని ప్రసాదిస్తాడు. ఆదిదేవుని అనుగ్రహంతో త్రిపురసౌందర్యం కనిపిస్తుంది. దేహపురిలోని దేవరహస్యం గోచరిస్తుంది. ఎక్కడెక్కడనో వెదకినా అంతు చిక్కని ఆదిదేవుడు అంతఃపురంలోనే పురందర రూపంలో దాగియున్నాడనే 'చిదంబర' రహస్యం చటుక్కున బయటపడుతుంది. ఇదే ఆత్మసాక్షాత్కారం, జీవన్ముక్తి.

## 37

ఆ తర్వాత జీవి శోకరహితుడవుతాడు. శోకం, మోహం, వార్ధక్యం, మరణం, ఆకలి, దప్పిక -- ఇవన్నీ దేహబుద్ధివలన ఏర్పడే మానస వీచికలు. ఈ అలల అలజడి అణగిన తర్వాత అశోక మనఃస్థితి ఏర్పడుతుంది. యోగులు అభిలషించే మనోదశ ఇదే. ఈ స్థితికి వచ్చినప్పుడు, తరింపజేసే తారకుడు తారలా తళతళలాడుతూ కనిపిస్తాడు. అతని శౌర్యం, పరాక్రమం, ఆధిపత్యం సమగ్రంగా బోధపడుతుంది. సంసార సముద్రంలో ఎన్ని సుడిగుండాలకో గురియై చివరకు దరిజేరిన బాటసారివలె, సంసారి పరసీరుహాక్షుని కటాక్ష వీక్షణాలను దర్శించి తరిస్తాడు. ఒద్దు చేరే సరికి నీటిలోని సుడిగుండాలు కనిపించవు. కన్నులపండువుగా విప్పారిన రెక్కలతో విరబూసిన పద్మాలు కనిపిస్తాయి. పద్మంలాంటి నేత్రాలతో భక్తకోటిని అనుగ్రహిస్తున్న కమలనయనుడు కనిపిస్తాడు.

## 38

ఆ కమలమే అతని నాభిస్థానంలో కూడా కనిపిస్తుంది. అతని కళ్ళలో కనిపిస్తుంది. అలాంటి కమలమే అతని గర్భంలోకూడా దాగి ఉన్నట్టనిపిస్తుంది. ఎక్కడ చూచినా కమలమే. పద్మమే, అరవిందమే. ఈ కమలమే ప్రపంచవికాసానికి మూలకమలం. ఈ విశ్వకమలమే విశ్వాన్ని ధరిస్తుంది, భరిస్తుంది. శరీరాన్ని పోషిస్తుంది. క్షీణించే జీవంలో రాణిస్తుంది. క్షీణించవలసినది క్షీణించగా రాణించవలసినదానిని రాణింపజేస్తుంది. పెరుగ

వలపినదానిని పెంచుతుంది. తాను పెరుగుతుంది. పెరిగి పెరిగి అంతరిక్షంలో విహరించే గరుత్మంతుని అధిరోహిస్తుంది. ఇది పరమాత్ముని వృద్ధివిలాసం. భయంకర కాలసర్పాలకు కాలరూపుడై అమృతం పంచిపెట్టే గరుత్మంతుడు పరమాత్ముని వాహనం. అతని కీర్తికి పతాక. అంతరిక్షంలో మహోన్నత స్థాయిలో పయనించే గరుడవాహనుడు మహోక్షుడవటంలో ఆశ్చర్యంలేదు. అతని అక్షరేఖ అతి విస్తృతమయింది. అతని కంటికి కని-పించని పదార్థముండదు. అన్నింటిని చూడగల అత్యున్నత నభోమండలంలో గరుత్మంతునిపై ఎక్కి మహోక్షుడు కమలనయనుడు పయనిస్తూ ఉంటే, సామాన్యమానవులు కూడా ఆ విరాట్ స్వరూపంలో ఏకీభవించిపోతారు.

## 39

మహోక్షునికి సరితూగగల మహనీయుడు మరొకడు ఉండదు. అతనికి అతడే సాటి. గరుడవాహనంమీద ఎక్కి శరవేగంతో పయనిస్తుంటే చూప-రులకు భయం వేయవచ్చు. లేక పరమాత్ముని పరాక్రమం చూచి ధైర్యం కూడా రావచ్చు. సత్యానికి ధర్మానికి అతని పరాక్రమం అంకితం కదా! అందువల్ల నిస్తులమైన అతని పరాక్రమం నిఖిలలోకానికి అభయహేతువు కావటమే సహజం. ఇలా అంతరిక్షంలో పయనించే అంతరాత్మకు భూతలంలో ఎప్పుడు ఎక్కడ అవతరించాలో, దిగిరావాలో తెలుసు. అందువల్ల అతడు సమయజ్ఞుడు. తాను చేసిన బాస గుర్తుంచుకొని ఆడిన మాట తప్పక సామ్యబుద్ధితో చేసే యజ్ఞయాగాదులలో తనకు అర్పించిన హవిర్భాగాన్ని స్వీకరించేందుకు కూడా సమయానికి అతడు విచ్చేస్తాడు. అన్ని లక్షణాలకు అతనిది పెట్టినపేరు. అందం, అనురాగం, ఆనందం, పరాక్రమం, అభయం, ఔదార్యం అన్నింటికీ పరమాత్ముని ప్రవర్తనలోనే లక్షణాలు కుదిరిపోతాయి. గుణగణాలకు లక్షణాలు చెప్పుకునేందుకు పరమాత్మను లక్ష్యంగా ఉప-యోగించుకోవచ్చు. సకల గుణసంపన్నుడైన సర్వేశ్వరుని స్వరూప స్వభావాలు శ్రీలను వెలయిస్తాయి. అతని అంగాంగంలో మంగళదేవత మూర్తీభవించి ఉంటుంది. పదిమందిలో అతని మాట నెగ్గుతుంది. సమరాంగణంలో అతని శౌర్యానికి ఎదురు లేదు. యోగేశ్వరుడున్నచోట శ్రీ నివసిస్తుంది. శ్రీ వసించినచోట విజయం తథ్యం.

## 40

అనంత జలరాశిలో అడ్డు లేకుండా చోటుచేసుకొని చొచ్చుకొనిపోయే మహామత్స్యంలాగా, మహీధరుడు మహావేగంతో విక్షరంగా లక్షితంగా విశ్వంలో విహరిస్తాడు. నీటిలో మునిగి నశించే ప్రాణు లనేకు లుండగా మహామీనంలాంటి భగవంతుడు క్షరనిరపేక్షంగా తన పయనం సాగిస్తాడు. ఈ స్వచ్ఛంద గమనానికి మార్గం దానంతట అదే ఏర్పడుతుంది. అన్నింటికి మూలకారణుడైన దామోదరుడు అందరిని అతిశయించి పురోగమిస్తాడు. ఎక్కడనైనా ఆగవలసివస్తే కొండలా ఆగిపోతాడు. కదలడు, మెదలడు. ఎవ్వరూ కదలించలేరు. కనిపించినదంతా యీ మత్స్యానికి భక్షణయోగ్యమే. తినరానిది లేదు. తినలేనిది లేదు. ప్రళయకాలంలో కూడా ఈ మత్స్యానికి క్షరంలేదు. ప్రళయం చివర మిగిలేది ఈ మీనం ఒకటే. గమనంలో, సహనంలో, విజయంలో, అభయంలో -- అన్ని విధాలా ఈ మత్స్యం అవ్యయుడైన ఆదిదేవుని అవతారం.

## 41

ప్రపంచం ప్రసవించే ప్రాణికోటిలో ప్రకృష్టమైన తత్త్వం ఈశ్వర తత్త్వం. అందరిలాంటి ప్రాణి కాక, ప్రాణాలకు ప్రాణప్రాయుడైన పరమేశ్వరుడు సామాన్యభవుడు కాడు. ఉద్భవుడు. అతని పుట్టుకలో ఎంతమంది దుష్టుల మనస్సో క్షోభిస్తుంది. దుష్టశిక్షణ చెయ్యకుండా శిష్టరక్షణ జరగదు. అమృతాన్ని, విషాన్ని రెండింటినీ తనవెంట తీసుకుని పరమేశ్వరుడు ప్రపంచంలో ఉద్భవిస్తాడు. అందువల్లనే అతడు శ్రీగర్భుడు. ఆగర్భ శ్రీమంతుడై అవతరిస్తాడు. దివ్యతేజస్సు భవ్యరూపం ధరిస్తుంది. ఇది ఎలా జరుగుతుంది అనేది చాలా విచిత్రమైన విషయం. సర్వతంత్ర స్వతంత్రుడు సర్వేశ్వరుడు సర్వ కార్యసాధకుడు. కార్యకారణ సంబంధాన్ని కూర్చే కారకు డతడే. కారణ మతడే. కార్యసాధనకు ఉపకరించే కరణం (పరమసాధనం) కూడా అతడే. అతడే కర్త. అతడే వికర్త. అన్ని పనులు చేసినా ఏమి చేయనట్టే. అందువల్ల అతని కార్యపద్ధతి సామాన్యదృష్టికి బోధపడేది కాదు. గహ్వరమైన గుహలో నివసించటంవల్ల అతని ఆచరణవిధానంకూడా గహనాతిగహనంగా, గూఢంగా ఉంటుంది.

## 42

ఏమిచేసినా పరమేశ్వరుడు చేసే పనులన్నీ వివేకవంతంగా, వ్యవస్థితంగా, పద్ధతిప్రకారం చూడ ముచ్చటగా కనిపిస్తాయి. ఎవరికి ఎంత ప్రాధాన్య మియ్యాలో, ఏ పనికి ఎంత ప్రాముఖ్య మియ్యాలో చక్కగా ఆలోచించి కార్యనిర్వహణ సక్రమంగా జరిపిస్తాడు. నిలకడగల స్వామి కాబట్టి ఇతరులకుకూడా నిలకడ నిస్తాడు. తాను మాత్రం చలించడు స్థిరంగా, ధ్రువంగా ఉంటాడు. ఎంత సమృద్ధి చేకూరినా తొణకడు. అతని శోభ పరాకాష్ఠ నెంది ఉంటుంది కాబట్టి, అతడు నిత్యతృప్తుడై యుంటాడు. అతని తుష్టికి పుష్టికి ఎప్పుడూ ఏ మాత్రం కొదువ ఉండదు. వల్లని మాపుల సామికి దాపరికం లేదు. స్పష్టవాది. తన తుష్టిని, పుష్టిని, సమృద్ధిని, శోభను తన సృష్టికే అంకితంచేసి, లోకకల్యాణంకోసం నిర్విరామంగా కృషిచేసే వ్యవసాయశీలి విశ్వనాథుడు.

## 43

తన రాజ్యంలోని ప్రతివ్యక్తీ తుష్టితో పుష్టితో తులదూగుతూ ఉండేటట్టు లోకోత్తరభావనతో ప్రజలను పాలించిన రామభద్రుడు నిర్విరామంగా కృషిచేసినా నిర్లిప్తభావంవల్ల విరాముడే అయినాడు. సకలజీవుల్లో సర్వాంతర్యామియై సర్వదా సంచరిస్తూ ఉన్న పరాత్పరుడు ప్రవృత్తివల్ల రాముడు. నివృత్తివల్ల విరాముడు. ప్రాణికోటికి పరమగతిని ప్రసాదించే ప్రభు వవటంవల్ల కూడా అతడు జీవితానికి పూర్ణ విరామం కూర్పగల విరక్తుడు. జీవ రజస్సు సోకని అనాసక్తుడవటంవల్ల విరజుడనికూడా భావించవచ్చు. పరమాత్మలో లయించటమే జీవాత్మకు జీవిత పరమావధి. ఇలా జీవాత్మను పరమాత్మదగ్గరికి తీసుకొనిపోయే నాయకుడు, వినాయకుడు కూడా. వెళ్ళే జీవి, వెళ్ళే మార్గం -- అన్నీ రామునిలోని రమణీయతనే తెలియపరుస్తాయి. విరతిలో, నిరతిలో -- రెండింటిలో రామతత్త్వమే ఏదో ఒక రూపంలో గోచరిస్తుంది. శక్తిమంతుల్లో రాముణ్ణి మించినవారు లేరు. కోదండరామునికి ఎదురుగా రణరంగంలో నిలబడగల వీరుడు లేడు. కాని రాముని నిజమైన శక్తి అతని భుజబలంలో గానీ, కోదండంలో

గానీ లేదు. అతని సత్యపరాక్రమం ధర్మపరాయణతలో ఉంది. ధర్మం అతనికి సర్వస్వం. తా ననుసరించే ధర్మమే తనకు రక్ష - అని రాము డందరికీ మాటిమాటికి చెప్తాడు. విభీషణునిలోని ధర్మమే అతనికి రామాశ్రయం ప్రసాదించింది. రాముడు రూపెత్తిన ధర్మం. రామునికి తెలిసినట్లు ధర్మరహస్యాలు మరెవ్వరికీ తెలియవు. కనుకనే సత్య ధర్మాలకు విరోధం ఏర్పడినప్పుడు తల్లిదండ్రులకు, తమ్ముడికి సరియైన ధర్మం చాటి చెప్పిన ధర్మమూర్తి రామమూర్తి.

## 44

ప్రణవస్వరూపుడైన పరమాత్మ బోధించేమార్గం అకుంఠితమైనది. వైకుంఠంలో అకుంఠితదీక్షతో ధర్మమార్గాన్ని ఏర్పరచి ప్రాణికోటికి ప్రణవ రూపంలో ప్రసాదించే పరమపురుషుడు పరమారాధ్యుడు. ప్రాణ మతడే. ప్రాణప్రదుడుకూడా అతడే. ప్రణవంలోనే ప్రాణం, ప్రాణనం ఉన్నాయి. ప్రాణరూపంలో ప్రాణదాతయైన పరమేశ్వరుడు అంతటా వ్యాపించి యున్నాడు. దాగియున్న సువర్ణసంపదను ప్రాణికోటికి పంచిపెడతాడు. శత్రువులను సంహరించి ఇష్టులకు ప్రాణవాయువును ఇస్తాడు. ఇంద్రియములు బహిర్ముఖము లయినంతవరకు అతీంద్రియమైన యీ ప్రత్యగాత్మ స్వరూపం బోధపడదు. అంతర్ముఖమైన ఆరాధనవల్లనే అధోక్షజుని ఆంతర్యం అర్థమవుతుంది.

## 45

కాలం చక్రంలాంటిది. నిర్విరామంగా నిరంతరం తిరుగుతూ ఉంటుంది. విష్ణుమూర్తిచేతిలోని సుదర్శనచక్రం ఇలా నియతగతితో తిరిగే కాలచక్రానికి చిహ్నం. భగవంతుడు కాలస్వరూపుడు. ఋతువుల్లో సంవత్సరాల్లో సర్వేశ్వర సంకల్పమే వినోద విషాదాలను సమకూర్చుతూ ఉంటుంది. పరమాకాశంలో గ్రహగతిని శాసిస్తూఉండే విశ్వరూపుడు ఒకప్పుడు ఉగ్రరూపంలో కనిపిస్తాడు. మరొకప్పుడు విశ్రాంత మనోవృత్తితో ప్రాణికోటికి హాయి నిస్తాడు. ఉగ్రరూపం ధరించందే అగ్ని, వాయువు, సూర్యుడు, చంద్రుడు వాళ్ళ వాళ్ళ పనులు సక్రమంగా చేయరు. అందువల్ల హృదయంలో దయ

ఉన్నా బయటికి ఉగ్రస్వరూపంలో కనిపిస్తూ అందరినీ అదుపులో పెట్టడం దాక్షిణ్య దయానిధి దక్షతకు, దాక్షిణ్యానికి నిదర్శనం. అందరూ అతనికి అనుకూలురే. ఋతుపరివర్తన చూచి ఆనందించే జీవకోటి ఆయుక్షీణాన్ని గమనించదు. కాలం గడిచే కొద్దీ ఆయువు క్షీణిస్తున్న విషయం, హాయిగా గడిచే ఆనందసమయంలో అతనికి బోధ పడదు. ఇదే విశ్వదక్షిణుని దక్షత, చాతుర్యం.

## 46

విశ్వతోముఖదాక్షిణ్యంతో విశ్వాత్మ విశ్వమంతటా విస్తరించి ఉంటాడు. అతని విస్తారం సాధారణమైన విస్తృతికాదు. స్థావరమైనది. స్థాణురూపంలో అనేకులకు ఆశ్రయమిచ్చేది. తాను కదలకపోయినా ప్రాణికోటి తనలో చేరటంవల్ల అతని విస్తృతికి అంతరాయంలేదు. కొండలు, గుహలు, అడ-వులు, అర్ణవాలు -- అన్నీ అతనిలోనే ఉండటంవల్ల అతనికి స్థాణురూపం ఏర్పడింది. జ్ఞాన స్వరూపు డవటంవల్ల అతని ఉనికికి, విస్తృతికి, నిలకడకు వేరే ప్రమాణం లేదు. సామాన్యంగా బీజం విస్తరించి, చెట్టుగా మారిన తర్వాత, బీజం నశిస్తుంది. కాని పరమాత్ముని విస్తృతి అతని బీజరూపానికి ఏమాత్రం అంతరాయం కలిగించదు. బీజం బీజంగానే ఉండి వృక్షం పెరుగుతుంది. పరమాత్మ వికాసంలో మరో రహస్యం ఉంది. అతనిని కోరి అతనిదగ్గర చేరేవారే కాని, అతడు కోరవలసినది, చేరవలసినది లేదు. అతని దగ్గరలేని ద్రవ్యం లేదు. అన్నకోశంనుండి ఆనందకోశంవరకు అన్ని కోశాలకు అతడే కోశాధిపతి. కోరిన భోగాలను అనుభవించి, కోరిన ధనాన్ని కొల్లలుగా కూడబెట్టి పంచిపెట్టగల శ్రీమంతుడు శ్రీనివాసుడు.

## 47

సకల సమృద్ధిశాలియైన సర్వేశ్వరునికి నిరాశ, నిర్వేదం అనేవి తెలి-యవు. తనకు కావలసినది లేనప్పుడు నైరాశ్యానికి తావే లేదు. వేదమూర్తికి నిర్వేదం అసంబద్ధం. విశ్వమంతట వ్యాపించిన విష్ణుమూర్తికి భూమిలో, భవంతో అనుబంధం లేదు. ధర్మబంధమే అతనిని భూమండలానికి

సంపృక్తం చేస్తుంది. అన్ని యజ్ఞయాగాదులకు అతడే యజమాని. నక్షత్ర లోకానికి కేంద్రస్థానంలో ఉండటంవల్ల అతని కనుసన్నలలోనే నక్షత్రమండలం పంచరిస్తుంది. చుక్కలలో జాబిల్లిలా ఖగోళంలో అతనికి ప్రముఖమైన స్థానం ఉంది. ఓర్పులో, నేర్పులో అతదు పుడమిని పోలి యుంటాడు. మనస్సులోని మాలిన్యం క్షీణించిన తర్వాత, అంతరంగంలోని అలజడులు శాంతించిన తర్వాత తనంతట తాను ఆవిర్భవిస్తాదు -- క్షామరూపంలో (పరిక్షీణరూపంలో) క్షోణీతలాన్ని చేరే పరంధాముదు. అతని కోరికలు పరహిత కారికలు. సకలలోకకల్యాణమే సర్వేశ్వరుని అభిలాష.

## 48

యజ్ఞమంటే స్వామికి చాలా ఇష్టం. యజ్ఞయాగాదులలో ఆరాధించ వలసిన పూజ్యుడు, ఇజ్యుడు అతడే. ఆరాధ్యదేవతలలో పరమారాధ్యుదు, పరమపూజ్యుడు, పరమేజ్యుడుకూడా అతడే. యజ్ఞయాగాదులే కాక, క్రతువులు, కర్మకాండలు, సదస్సులు -- అన్నింటికీ పరమావధి యజ్ఞ నారాయణుడే. సాధువులు కోరుకొనే సద్గతిని ప్రసాదించే ముక్తి కారకు డతడే. తాను ముక్తుడు కాబట్టే ఇతరులకు ముక్తిని ప్రసాదించగల సామర్థ్యం అతనికి ఉంది. అతనికి అన్నీ తెలుసు. ఉత్తమమైన జ్ఞానం అతని సొత్తు. అతని జ్ఞానం కేవలం బుద్ధి గమ్యమేకాదు, చూచి ఆనందించదగిన సుందర దృశ్యం. అన్నింటిని సమభావంతో చూచే సర్వదర్శిని దర్శించటమే సర్వదర్శనసారం.

## 49

ప్రపంచాన్ని పాలించే పరమేశ్వరుని పరిపాలనదక్షత విలక్షణమైనది. మొదట దృఢమైన సంకల్పంతో ఆరంభించి, తర్వాత తన ఆలోచనలు పది మందికి నచ్చజెప్పి దానిలోఉన్న సాధక బాధకాలను సమగ్రంగా సూక్ష్మంగా చర్చించి, అప్పుడు ప్రజానీకానికి తన సంకల్పసారాన్ని అందజేస్తాడు. అందరికీ ఆనందం కలగటమే ఆనందమయుని ధ్యేయం. శరణని తన చరణములను సమీపించిన ప్రతివ్యక్తికీ, ఆశ్రయ మివ్వటమే ఆ సుహృద్వరుని మహావ్రతం.

అతిలోకసౌందర్యం, అంతులేని ఔదార్యం, అపరిమేయ పరాక్రమం - అతని వ్యక్తిత్వానికి సమగ్రతను చేకూర్చుతాయి. అవసరమయినప్పుడు అరివర్గాన్ని చీల్చి చెండాడటంలో కూడా వెనుదీయడు. సహజంగా కోపిష్టికాడు. కాని కార్యసాధనకోసం కోపాన్ని ప్రదర్శిస్తాడు. కోపం వచ్చినా ఒళ్ళు తెలియనంత కోపం రాదు. కోపాన్ని అదుపులో పెట్టుకొని, లోకకల్యాణం కోసమే దానిని ఉపయోగించుకొనే శాంతమూర్తి విష్ణుమూర్తి.

## 50

క్షీరసాగరంలో తీరికగా శయనించే శేషశాయి, ఎంత కమ్మని కలలు కంటూ ఉంటాడో ఊహించటంకూడా సాధ్యం కాదు. కాని ఆ కలల నీడలే జీవకోటి జీవనవిధానంలో ప్రతిఫలిస్తాయి. తాను కన్న కలలు తన బిడ్డల జీవితంలో ఫలించాలని జగత్పిత భావిస్తాడు. అదే భావనతో పిల్లలను చిచ్చికొట్టి నిద్రపుచ్చినట్లు, జీవకోటికి తియ్యని కలల్లో స్వస్వరూపాన్ని చూపిస్తాడు -- స్వప్నసౌందర్యరాశి. అనుకున్నప్పుడు ఆత్మతత్త్వం తెలియపరచటం, అక్కరలేనప్పుడు మరిపించటం అతని చేతిలో ఉంది. సర్వవ్యాపకుడైన పరమాత్మ ప్రతిజీవాత్మలో వ్యాపించి ఉంటాడు. ఒక చైతన్యమే అనేకులలో అనేకరూపాల్లో వ్యక్తమవుతుంది. అనేకరూపాల్లో అనేకవిధులు నెరవేరుస్తూ ఉంటాడు సర్వాంతర్యామి. జీవకోటిని తనలో దాచుకొని వాత్సల్యభావంతో అందరినీ తన బిడ్డలుగా చూచుకుంటాడు -- పరమకారుణ్యమూర్తి. రత్నాలను దాచిన గర్భంలో జీవరాశినికూడా దాచి కాపాడుతాడు ధనేశ్వరుడు. నిధనపతి సన్నిధిలో నిధనం కూడా ధనంగా మారుతుంది.

## 51

రత్నరాశిని, జీవరాశిని తనలో దాచుకొన్న ధర్మాత్ముడు ధర్మాన్ని కూడా దాచి కాపాడుతాడు. రక్షించినవారిని రక్షించటం ధర్మలక్షణం. కాబట్టి, ధర్మపరాయణుడైన నారాయణుడు ధర్మాన్ని కాపాడి పెంచి పంచి పెడతాడు. మంచిని పెంచాలి, చెడును పరిహరించాలి. క్షరాన్ని విరసించాలి, అక్షరాన్ని ఆరాధించాలి. ఇదే భాగవత ధర్మం. భగవత్

సిద్ధాంతం. ఈ సిద్ధాంతాన్ని నిరూపించి కార్యరూపంలో చూపించే విధాతలో ఈ పరమ ధర్మానికి సంబంధించిన లక్షణాలన్నీ కూడుకొని ఉన్నాయి. పరమాత్మ స్వరూపం బోధపడితే చాలు, పరమరహస్యం తెలిసిపోతుంది. కాని అజ్ఞేయుడైన అంతరాత్మలోని ఆంతర్యం అంత సులభంగా అంతు చిక్కదు. వెయ్యి కిరణాలతో వేవెలుగులతో విశ్వమంతటా వ్యాపించిన విభుని దివ్య లీలలు అవాఙ్మానస గోచరాలు. సాత్త్వికమనఃస్థితి, సర్వేశ్వరుని అనుగ్రహం దీనికి సోపానాలు.

## 52

ప్రపంచంలో మనకు కనిపించే కాంతికి, కిరణరాశికి పరమాత్మ కేంద్రంలో ఉన్నాడు. అతని ఉనికిని గమనించాలంటే అతని సాత్త్విక చైతన్యాన్ని అలవరచుకోవాలి. ద్వంద్వాతీతమైన పరమ సాత్త్విక మనః స్థితికి దేవదేవుడు కరిగిపోతాడు. సింహంలా ఠీవిగా దర్పంతో జీవజగత్తులో సంచరించే నరసింహుడు, మహేశ్వరుడు, మహాదేవుడు, ఆదిదేవుడు, దేవ దేవుడు గురువుగా సాక్షాత్కరించి తన దివ్యసందేశాన్ని మనకు అందిస్తాడు. దేవతలకుకూడా అతడే గురువు. గురువులకు గురువైన జగద్గురువు వాసు దేవుని అనుగ్రహంతో ప్రపంచవాసనలు నశించి, ఈశావాస్యమైన ఐశ్వర్యం లభిస్తుంది.

## 53

సంసార సముద్రాన్ని తరించి, ఇతరులను తరింపచేయగల తారకే-శ్వరుడు సర్వోత్తముడు. ఉత్తములకు ఉత్తరుడు. ప్రాణికోటి ఎదుర్కొనే ప్రతిప్రశ్నకు ప్రత్యుత్తర మియ్యగల ప్రశ్నోత్తరుడు. సామాన్య జంతుజాలానికి అతీతంగా అత్యున్నతస్థాయిలో ఉంటాడు కనుక ఉత్తరుడు. గోకులంలో గోవులను పాలించే గోపాలుడు సామాన్యబాలుడు కాడు. అతడు కాచే గోవులలో సమస్త భూమండలం, నశించని నాకలోకం, ఉదారమైన వాగ్వి-లాసం, సర్వేంద్రియ సమూహం -- అన్నీ ఇమిడి ఉన్నాయి. వీటన్నిటికీ అధిపతియైన గోపతి -- గోపగోపీజనుల నోముల పంటగా గోకులంలో

అవతరించాడు. గోవులతోపాటు భూమ్యాకాశాలను, పుణ్యపాపాలను, వాగ్విభూతిని కూడా పాలించిన గోపతి గుప్తరూపంలో ఉంటాడు. తనదగ్గర చేరిన వాళ్ళను కాపాడటంలో గోపాలుని గోప్యం కూడి ఉంది. వాక్కును, మనస్సును శాసించే గోప్త అందరికీ అందుబాటులో ఉండదు. వాక్కు అతనిని వర్ణించలేదు. మనస్సు అతనిని ఊహించలేదు. కేవలం జ్ఞానమే అతన్ని తెలుసుకొనగలదు. అజ్ఞానం నశిస్తేనే కాని, జ్ఞానం ఉదయించదు. జ్ఞానంవల్లకాని, నిశ్చలమైన భక్తి కుదరదు. కాబట్టి పరమ గోప్యంగా ఉన్న గోపతిని జ్ఞానమే గుర్తించగలదు. పురాతనుడైన పరాత్పరుడు సకల శరీరధారులను అనాదికాలంనుంచి పోషిస్తూ ఉన్నాడు. ప్రాణికోటిని పోషించటమే అతనికి పుష్టి. పిల్లలు కడుపునిండా తింటే తన ఆకలి తీరినట్టు భావించే తల్లివలె, భగవంతుడు తన బిడ్డల పుష్టినే తన పుష్టిగా భావిస్తాడు. నీరే ప్రాణాలకు ఆధారం. ఆ నీటితో బ్రతికే ప్రాణికోటికి అధీశ్వరుడు కపీంద్రుడు. శాఖామృగముల సాయంతో, లోక రావణుడయిన రావణాసురుని సంహరించటంలో రామచంద్రుని ఔదార్యం వ్యక్తమవుతుంది. తనకు సాధ్యంకాక కాదు; ఇతరులను తరింపజేయవలెననే పిపాసతో కోదండపాణి కపిపుంగవులను ఆశ్రయించాడు. అతని దాక్షిణ్యం అలాంటిది. ఎంత దక్షుడో అంత దక్షిణుడు -- అనుకూలుడు. అతని మంచితనానికి తిర్యగ్యోనులు కూడా అనుకూలు రయినారు. వానరులను కూడగట్టుకుని, వారధి కట్టించిన రామభద్రుని మంచితనం, అతని గుణగణాల్లో అన్నింటినీ మించినది.

## 54

అంత మంచితనానికి అతని ఆహారంకూడా కొంతవరకు కారణమై ఉండాలి. సకలజీవుల శరీరంలో ప్రవేశించి, వాళ్ళలోని సత్త్వసారాన్ని గ్రహించి, భుజించే మహాభోక్త సోమభుక్కు -- అమృతభుక్కు. యజ్ఞయాగాల్లో సోమరసాన్ని సేవించే యజ్ఞపురుషుడు సోమరసంలోని సౌమ్యాన్ని అణువణువులో స్పందింపజేస్తాడు. క్షీరసాగర మథనంలో అమృతం, అమృతకిరణుడైన చంద్రుడు ఉద్భవించారు. అమృతాన్ని అందరికీ పంచిపెట్టి,

అమృతకిరణుణ్ణి అమరేశ్వరునికి శిరోధార్యంగా కూర్చిన జయభద్రుడు విష్ణుమూర్తి. దేవతలను రాక్షసులనుకూడా తృప్తిపరచిన నేర్పరి. లోక కల్యాణంకోసం గరళంకూడా గటగట త్రాగిన అమరేశ్వరుడు. అమృతం కురిపించే సోముణ్ణి తలదాల్చి, తానుకూడా ఉమాసహితుడవటంవల్ల సోమ-త్వాన్ని పొందాడు. సోమరసం త్రాగిన యజ్ఞపురుషుడు, అమృతం త్రాగిన అమృతాంశుడు, ఉమాపతిత్వంవల్ల సోముడైన సోమేశ్వరుడు -- అందరూ పురుషోత్తముని అంశాలే. సజ్జనులలో ఉత్తముడు, మహనీయుడు అవటంవల్ల పురుషోత్తముణ్ణి పురుష సత్తముడని కూడా అనవచ్చు. అందరిని జయించిన విజయుడవటంచేత అతనికి పురుజిత్తనికూడా పేరు. అప లతడు జయ భద్రుడు, వినయమోహనుడు, సత్యసంధుడు. అతని విజయానికి వినయం ఆధారం. వినయానికి సత్యం ఆధారం. ఈ జయ వినయాలవల్ల, సత్యనిష్ఠవల్ల అతనికి పూజార్హత లభించింది. దాసరి(దశార్హ)కులంలో జన్మించినా, పాండవుల అగ్రతాంబూలం అతనికే చెందింది. దాశార్హుడు పూజార్హు డవుతాడా? అన్న ఆక్షేపణ, రాను రాను దాశార్హుడే పూజార్హుడనే సిద్ధాంతానికి దారి తీసింది. దానాలను గ్రహించే దశార్హజాతి, పురుసత్తముని పుట్టుకతో పూజ్యస్థానం వహించింది. అలాగే సాత్వత తంత్రాన్ని అనుసరించే సాతాని జాతికికూడా యదుపతి అధిపతి అయినాడు. బ్రహ్మస్పర్శచేత పామరుడుకూడా పావను డవుతాడు.

## 55

పరమేశ్వరుని విజయానికి నిదర్శనం అతని జీవలక్షణం. జీవికి వినయం నేర్పేందుకు తానే జీవియై, తనలోని బ్రహ్మత్వాన్ని జీవికి ప్రసాదిస్తాడు -- సర్వసాక్షియైన సర్వేశ్వరుడు. వినయంవల్లనే ముక్తి లభిస్తుంది. శక్తి చేకూరుతుంది. ముక్తిని ప్రసాదించే ముకుందుడు మూడులోకాలకు అధిపతి అయినప్పటికీ, ముద్దుకృష్ణుడుగా సామాన్యజీవిగా నటిస్తాడు. కాని అవసర మయినప్పుడు, అవకాశం దొరికినప్పుడు తన విక్రమాన్ని ప్రకటిస్తాడు. అతని విక్రమం మహార్ణవంలాగా అనంతం, అపరిమితం. జీవాత్మలోని చైతన్యం పరిమితం. పరమాత్మ పరాక్రమం అనంతం. అన్నింటిని అంతమొందించే

అంతులేని ప్రభావం తనకు ఉన్నప్పటికీ, ఏమి తెలియనట్లు ఏ సముద్రం మూలనో నిశ్చింతగా నిద్రపోతుంటాడు ఛిద్రమెరుగని క్షీరసాగర శయనుడు.

## 56

ఆకారంనుండి ఆవిర్భవించిన అజుడు వైష్ణవవర్చస్సుతో కోటి మన్మథులకు సాటియై సృష్టిని, దృష్టిని ఆకర్షిస్తాడు. అతని దివ్యమంగళ విగ్రహం చూడగానే అతనికి నమస్కరించాలనిపిస్తుంది, పూజించాలనిపిస్తుంది, సేవించాలనిపిస్తుంది, ఏమేమో చెయ్యాలనిపిస్తుంది. ఏమిచేసినా చాలదనిపిస్తుంది. అతని మహార్హత - గిరాకి - అలాంటిది. కాని యీ మహార్హత అతనికి స్వభావసిద్ధంగా వచ్చిందే కాని, మధ్యలో తెచ్చిపెట్టుకొన్నది కాదు. సహజంగా లభించిన స్వత్వం, సంచితమైన సంపద కాదు. అందువల్ల అతనికి శత్రువులే లేరు. మిత్రులు కాని అమిత్రులెవరయినా ఉంటే వాళ్ళనుకూడా తన సహజ వాత్సల్యంతో, అవ్యాజమైన అనురాగంతో తన వారినిగా చేసుకుంటాడు. జయింపబడిన అమిత్రులే కాని, జయించవలసిన శత్రువులు లేరు. అందరికీ ఆనందం పంచిపెట్టటమే అతని ఏకైక లక్ష్యం. అతని అంగప్రత్యంగాలు ఆనందంతో పొంగిపోయే తరంగాలు. ఆనందమయుని అంతరంగం నందన వనంలా నయనమనోహరమే కాక, ఆత్మానందానికి మూలకంద మవుతుంది. అనుక్షణం ఆనందంలో మునిగి, ఆనందంతో పెరిగి, అందరికీ ఆ ఆనందాన్ని పంచిపెట్టే నందనందనుడు -- సత్య ధర్మ సమీక్షణంవల్లనే మూడు లోకాలను పాలించగలుగుతున్నాడు. ఏ లోకంలో చూచినా ఆలోకం, ఆనందం సత్య ధర్మ పరిపాలనవల్లనే సాధ్యమవుతున్నవి. సత్యం, ధర్మం పర్మేశ్వరుని చరణద్వయం. ఆ బలంతోనే లోకనాయకుడు లోకత్రయాన్ని సేవించగలుగుతున్నాడు. లోకం అతణ్ణి ఆరాధిస్తుంది. లోకాన్ని అతడు సేవిస్తాడు. ఈ సేవ్య సేవకభావన చాలా విచిత్రమైనది.

## 57

పుట్టుకతోనే మహనీయుడైన మహార్హుడు మహర్షుల హృదయంలో నివసిస్తాడు. సమగ్రంగా వేదవాఙ్మయాన్ని పరిశీలించి, విశుద్ధమైన ఆత్మ

తత్త్వాన్ని సాంఖ్యరూపంలో నిరూపించిన మహర్షి కపిలాచార్యుడు, సాక్షాత్ భగవదంశతో అవతరించిన భాగవతోత్తముడు. సిద్ధులలో ప్రసిద్ధికెక్కిన కపిల మహర్షిని నేనని భగవంతుడే తన గీతలో చెప్పుకున్నాడు. ప్రపంచ మొక మహారచన. ఇది భగవత్కృతమైన భవ్య మహాకావ్యం. ఈ కావ్యపరిశీలనచేసి, యిందులోని కావ్యాత్మను గుర్తించి, వివరించగల మహాత్ములు వందనీయులు. కృతిని, కృతాన్ని గుర్తించినవారు నిజంగా కృతజ్ఞులు. ఇలాంటి కృతజ్ఞులకు దారిచూపేవాడు - మేదినీపతి, ప్రపంచాన్ని నిర్మించిన విరించి. మేదిని (భూమండలం)లో సామాన్యమానవునికి మేదస్సే (రక్తమాంస సముచ్చయం) కనిపిస్తుంది. కాని కృతజ్ఞతాభావంతో గమనించి చూస్తే, యీ మేదస్సుకు చేతస్సును ప్రసాదించే మేధస్సు కనిపిస్తుంది. మేదినీపతి గోచరిస్తాడు. ఆ మేదినీపతి మూడుపాదాల్లో సంచరిస్తూ ఉంటాడు. మెలకువతో తిరుగుతు-న్నప్పుడు వైశ్వానర రూపంలోను, కలలుకంటూ నిదురపోయే సమయంలో తైజసరూపంలోను, గాఢనిద్రలో మైమరచి పరున్నప్పుడు ప్రాజ్ఞరూపంలోను ఈ త్రిపాది పరమేశ్వరుడు సాక్షాత్కరిస్తాడు. మూడు వేదాలకు, మూడు కాలాలకు, మూడు లోకాలకు, ప్రణవంలోని మూడు మాత్రలకు, మూడు గుణాలకు -- ముక్తసరిగా చెప్పాలంటే - ప్రపంచంలో కనిపించే త్రయి కంతటికీ అధ్యక్షత వహించే స్వామి, ప్రళయాన్ని లీలగా ప్రదర్శిస్తాడు. సమస్త సృష్టి నశించినా, పడవకు ఢీకొన్న తన మహాశృంగంతో సృష్టిబీజాన్ని నిలబెట్టే మహామీనంగా, మృత్యువుకు మృత్యువుగా, అంతకాంతకుడు అవతరిస్తాడు. మృత్యువును కల్పించి ప్రేరేపించి తొలగించే లయగ్రాహి మహేశ్వరుడు.

## 58

మహావరాహరూపంలో అవతరించి, మహామహిని మహాప్రళయం నుంచి కాపాడిన గోవిందుడుకూడా అతడే. గో సంరక్షణ, భూసంవర్ధన గోవిందుడైన మేదినీపతికి ప్రధానమైన లక్ష్యం. ఈ మహత్తరమైన కార్యనిర్వహణకు అతనికి కావలసిన సైన్యంకూడా సిద్ధంగా ఉంది. కనకాంగద కేయూరాలతో, కమ-నీయరూపంతో, కదనరంగంలో దుమికి, పరమగంభీరమైన సమరతంత్రంతో అరివర్గాన్ని అరికట్టగల మహాశూరుడు గోవిందుడు. ఎవరికీ అంతుపట్టని పట్టు

అతడు సాధించాడు. అతని యుద్ధవైఖరి గుహ్యం, గహనం, గోప్యం. ఒక చేతిలో సుదర్శనచక్రం, మరోచేతిలో కౌమోదకి తీసుకొని, సమరాంగణంలో అనిరుద్ధమైన తేజస్సుతో అవతరిస్తాడు. విజయం అతని స్వాధీనం.

## 59

తానెంత స్వాధీనుడో, తాను సృష్టించిన జీవకోటికూడా అంత స్వతంత్రంగా సమగ్రంగా స్వశక్తితో జీవించాలని, సృష్టికర్త సంకల్పం. అలాగే ఏ జీవికి ఆ జీవి సర్వాంగసుందరంగా స్వయంసమృద్ధంగా స్వాంగంగా ఉండే జీవనవిధానాన్ని ఏర్పరచిన వేధను, వేధించగల మేధావి లేదు. అత డజే- యుడు. సకలసృష్టిని ఆకర్షించే దృఢగాత్రుడు సంకర్షణుడు. తాను గీచిన గీటు తాను దాటడు. మరొకరిని దాటనియ్యడు. అచ్యుతునియందలి యీ దృఢవ్రతత్వం అనన్య సామాన్యమైనది. సంకల్పమాత్రంచేత సకలసృష్టిని విక- సింప జేస్తాడు. క్షణంలో లయింపజేస్తాడు. మిత్రరూపంలో రాత్రిని పగలు చేస్తాడు. వరుణరూపంలో పగటిని రాత్రిగా మారుస్తాడు. తలచుకుంటే అవనీతలాన్ని ఏకార్ణవం చేస్తాడు. లేకుంటే వసుంధరను సస్యశ్యామలం చేసే వాన కురిపిస్తాడు. చెట్లు చేమలను పెంచుతాడు. చెట్టులా గట్టిగా నిలబడి ఉంటాడు. విశాల నేత్రాలతో విశాలవిశ్వాన్ని తిలకిస్తాడు. గొప్పమనస్సుతో, మహోన్నతమైన ఔదార్యంతో సృష్టిలోని కణకణాన్ని కరుణతో కనికరిస్తాడు.

## 60

అంతటి కరుణావరుణాలయుడైన భగవంతుడు భాగ్యలాలసులకు భాగ్యం పంచిపెడతాడు. భాగ్యభావన పరిత్యజించి, భగవచ్చింతనకు జీవితం అంకితంచేసిన భాగవతులకు పరమానందం ప్రసాదిస్తాడు. భోగభాగ్యాలకంటె యాగయోగాలే శ్రేయస్కరమని భావించిన పుణ్యజీవులకు ఐశ్వర్యం, ధర్మం, యశస్సు, శ్రేయస్సు, జ్ఞానం, వైరాగ్యం క్రమక్రమంగా ప్రసాదించి, చివరకు నిశ్శ్రేయసానందానికి పాత్రులను చేస్తాడు. లోకుల రాకపోకలను, కలిమి లేములను, తెలివితేటలను తేటతెల్లంగా తెలిసిన భగవంతుడు, పరమానంద నిలయుడు. మోకాళ్ళవరకు వ్రేలాడే నిలువంత వనమాల -- అతని

వవ్యలావణ్యానికి చిరంతనశోభను చేకూర్చుతుంది. శబ్ద స్పర్శ రూప రస గంధాల సమ్మేళనం ఆ పూదండలో గుబాళిస్తూ ఉంటుంది. ఆ దండలోని పూలు, అతడు తనంతట తాను పెంచి పూయించుకున్నవి. దానికి నిదర్శనం బలభద్రుని తలపించే అతని చేతిలోని నాగలి. హలంతో వనమాల తయారయితే, హల్లులతో వర్ణమాల తయారవుతుంది. ఈ వనమాలలో వర్ణమాలకూడా మిళితమైవుంది. నిజానికి అది జీవనమాల. ఆదిత్యునివలె చిర నవీనం. నిత్యం ఉదయించి, నిత్యం అస్తమించే ఆదిత్యునిలో ఉన్న వెలుగే యీ వనమాలిలో గోచరిస్తుంది. అదితి గర్భంనుంచి ఉదయించిన, దేవత-లలో మిన్నగా మింటినంటి చరించే దివాకరుడు అందరిని అతిశయిస్తాడు. వెలుగులో, కదలికలో, గగనంలో, కదనంలో అతన్ని మించిన సహదేవుడు లేడు. మహారథి లేడు. అతనిది తొలి వెలుగు. తొలి చలనం. మిగిలిన వెలుగులకు, చలనాలకు అది మూలం.

## 61

ఇలా ప్రచండవేగంతో కోదండపాణి దండకారణ్యంలో స్వైరవిహారం చేస్తుంటే, ముయ్యేదు మారులు క్షాత్రజగత్తును దుయ్యబట్టిన పరశురాముడు స్ఫురిస్తాడు. దశరథరాముడు ధనుర్విద్యాపారంగతుడు. పరశురాముడు గండ్రగొడ్డలికి రాచబిడ్డలను బలిచేసిన సంగ్రామశూరుడు. ఒకడు బ్రహ్మ తేజంతో రంజిల్లే రాచబిడ్డ. మరొకడు క్షత్రియశౌర్యాన్ని ప్రదర్శించిన ఋషి కుమారుడు. ఈ రెండింటి సమ్మేళనం విష్ణుపరాక్రమం. కనుకనే పరమదారుణంగా రూపొంది, దుష్టశిక్షణకు తోడ్పడింది. వీర మరణం ప్రసా దించే విలుకాడే, దివ్యభోగాలను కూడా అనుగ్రహించగలడు. అంతరిక్షంలో విహరించే వరదహస్తం, అందరికీ యథోచితమైన అభయం సూచిస్తుంది. పైనుంచి ప్రసరించే పరమాత్మ పర్యవేక్షణం సకలజీవరాశిని సమస్తంగా చూడగలదు. వ్యస్తంగా -- వేరువేరుగా -- చూచి ఎవరికి కావలసినది వారికి లభించేట్టు చేయగలదు. భగవంతుని చూపుల్లోనే అతని వాక్కు ప్రసరిస్తుంది. నోటినుంచి వెలువడే వాక్కు మామూలు మాటలను, లౌకికమైన భావాలను మాత్రమే వెలయించగలదు. కాని, కళ్ళు చూచిన

దాన్ని చూచినట్టే చెప్పాలంటే కళ్ళే చెప్పాలి. నోటిదాకా వెళ్ళేసరికి చెప్పవలసినవిషయం చప్పని వాచవిగా మారిపోతుంది. అసలు రుచి చవిచూచిన ఛవికే తెలుస్తుంది. అదే చెప్పాలి. పరమాత్ముడు పలికే వాక్కు ఇలాంటిది. పెదిమలు కదిలించకుండా నేత్రసంచలనంతోనే సమస్తం చెప్పగల వాచస్పతి వాగ్విలాసమే, తపస్సంపన్నుల వాగ్వైఖరిలో చూచాయగా కనిపిస్తుంది, వినిపిస్తుంది. వాక్కును ఋక్కుగా మార్చే పరమ రసాయన మిదే.

## 62

వాచస్పతినోట వెలువడే మాటలు పాటలుగా మారి, సామగానంలా సాగి, వేదనాదాన్ని వినిపిస్తాయి. నాభినుండి ఉదయించి, కంఠంలో ప్రస రించి, నాలుకలో పలికే పరమరమణీయమైన వాక్కు స్వరంలో, రాగంలో, లయలో మూడురకాల సామ్యాన్ని వెలయించి సమయజ్ఞుని సామరస్యాన్ని చాటిచెపుతుంది. అకారంనుంచి వెలువడిన వాక్కు, చివరకు అకారంలోనే లీనమైపోతుంది. ఇది వాక్ప్రపంచంలో జరిగే నిర్వాణం. ఇలా వెలుగునుండి ఉదయించిన వెలుగు మళ్ళీ వెలుగులో కలిసిపోవటమే నిర్వాణం. ఇది పరమేశ్వరుని అక్షరలీల. ఉదయాస్తమయముల మధ్య వికసించిన వాక్కే సంసారబాధల ననుభవించే భవ రోగులకు మందు. ఈ మందును తయారుచేసి, అందరికీ అందజేసే వైద్యుదు, వేదవేద్యుడయిన పరమాత్మ. సర్వస్వం పరమాత్మకు అర్పించి, నిశ్చింతగా, నిష్ఠగా, శాంతియుతంగా జీవితం గడపటమే జీవిత పరమావధి. ఈ బుద్ధిని ప్రసాదించి తనలో లయింపజేసికొనే పరాయణుడుకూడా నారాయణుడే. నరకోటికి పరమ శరణ్యుడైన నారాయణుడే సమస్తధర్మాలకు, కర్మలకు, భక్తికి, జ్ఞానానికి, ధ్యానానికి, గానానికి, జీవిత సర్వస్వానికి పరాయణుడు.

## 63

శుభ్రమైన వాక్కును వెలయించే వాగీశుడు స్ఫురద్రూపి, శుభాంగుడు. అతనిరూపు చూచినంతనే మనస్సు శాంతిస్తుంది. కువలయానందకరమైన

వల్లని వెన్నెలలా అతని వాక్కు సర్వజన మనోహరంగా ఉంటుంది. గాలిని తిని కమ్మని పాటకు తనివిచెందే పాము, పలుకుల సామికి సొమ్ము. కళ్లు మూసు కొని పారవశ్యంతో గానం వినే పన్నగం వాక్పతికి వాల ఇష్టం. వాక్కును లోకంలో ప్రసరింపజేయుటం, రక్షించటం, దాచటం, పెంపొందించటం వాగ-ధీశ్వరుని కర్తవ్యం. వేదవాక్కుకు ఆయన ధర్మకర్త. ధర్మమన్నా, ధర్మాన్ని కాపాడే వృషభమన్నా ఆయనకు ఎనలేని అభిమానం. ఎద్దు రంకెవేస్తే మబ్బు కరిగి కురుస్తుంది. అలాగే ధర్మం పిలిస్తే పరమాత్మ పలుకుతాడు. ధర్మరక్షణకు వాగ్విభూతి కూడా చాలా అవసరం. వాక్కుద్వారా మనస్సును, మనస్సుద్వారా ఆత్మను అవగాహనం చేసుకొనవచ్చు. కాని, ఆ వాక్కు ధర్మసమ్మతమైనదిగా ఉండాలి. అందుకనే స్వామి ధర్మవర్ధనియైన వాక్కు కోసం వెదుకుతూ ఉంటాడు. ధర్మం పలుకని వాఙ్మయం వ్యర్థం. మాటలు రాని ధర్మం మనిషికి చేటు. ఈ రెండింటిని ఒకచోట సమకూర్చటం శాంతిదాత సద్ధర్మం.

## 64

ఈ మహత్కార్యాన్ని లోకుల యోగక్షేమంకోసం పరమశివుడు శివ సంకల్పంతో సాధిస్తాడు. ఈ సంకల్పం నెరవేరేంతవరకూ అతని ప్రయత్నం సాగుతూనే ఉంటుంది. పని విరమించటంగాని, మనస్సు మరలించుకొన-టంకాని జరగదు. ప్రజల మంచికోసం ఏ పని ఎంతవరకు చెయ్యాలో బాగా ఆలోచించి, దాని ననుసరించి తన నివృత్తిని, ప్రవృత్తిని. నియమించుకుం-టాడు. సాధ్యంకాని దాన్ని, సాధ్యంకాని వారిని చక్కబరచేందుకు సంక్షిప్త మైన పద్ధతులనుగూడా ప్రయోగిస్తాడు. ఏమి చేసినా మన మంచికోసమే. ఈ సాధనలో పరమేశ్వరునికి పరమేశ్వరి సహకారం పూర్తిగా లభిస్తుంది. ఆమె యెప్పుడూ ఆయన వక్షఃస్థలంపై శోభిస్తూ ఉంటుంది. ఆమెకు చిహ్నంగా, శ్రీవత్సం అని ప్రసిద్ధి కెక్కిన పుట్టుమచ్చ, ఆయన వక్షఃస్థలాన్ని అలంకరిస్తూ ఉంటుంది. శ్రీపతికి శ్రీహృదయమే నివాసస్థలం. భగవదంశ ఎక్కడెక్కడ అవతరిస్తే అక్కడక్కడ శ్రీదేవి కూడా చేరుతుంది. కాని, శ్రీపతితో సరితూగగల శ్రీమంతుడు మరొకడు లేడు.

## 65

శ్రీలకు నిలయమైన శ్రీనాథుడు తనను ఆశ్రయించినవారికి శ్రీపరంపర ప్రసాదిస్తాడు. సిరిసంపదలు, భోగభాగ్యాలు, ఐశ్వర్యం, ఆనందం, కీర్తి, ప్రతిష్ఠ -- ఇలాంటి శ్రేయఃపరంపరకు శ్రీదేవి అధిష్ఠాత్రి. ఆమె శ్రీమన్నారాయణుని సతీమణి. శ్రీమంతుని స్మరించినంతమాత్రాన శ్రీలు వర్షిస్తాయి. తన కాంతుని చూచినంతనే శ్రీకాంత, శ్రీలకు నిక్షేపమవుతుంది. ఆమె వెలయించగల నిధులన్నీ శ్రీకరునిలోనే కూడిఉన్నాయి. శ్రీభావనకు ఆలంబనం, శ్రేయస్సుకు ఉద్దీపనం, శ్రీదేవికి విభావం శ్రీమన్నారాయణుడే. మూడులోకాలకు అతడే దిక్కు. సర్వలోక శరణ్యుడైన శ్రీనాథుడు శ్రీలకు నిధి.

## 66

శ్రీనివాసుడు సర్వాగసుందరుడు. అతని మనోహర నయనాలలో, అంగాంగలావణ్యంలో వందలకొలది ఆనందనందనులు నందివిద్యను సేవించవచ్చు. ఎక్కడచూచినా వెలుగే. ఎక్కడ చూచినా జ్ఞానమే. ఎటునుంచి నమస్కరించినా నమస్కరించవచ్చు. ఎలా పూజించినా, ఎలా ధ్యానించినా, ఎలా అర్చించినా జ్యోతిర్మయుడైన పరమాత్మ ఆమోదిస్తాడు. అనంతమైన అంతరిక్షంలో వెలిగే జ్యోతిర్గోళాలకు జ్యోతిని ప్రసాదించే పరంజ్యోతి యీ స్వామి. ప్రపంచాన్ని జయించిన పరమాత్మ ఒకరికీ లొంగిఉండడు. అలా లొంగవలసిన అవసరంకూడా లేదు. కాని అది విజయగర్వం కాదు. సహజంగానే అందరూ అతణ్ణి గౌరవిస్తారు. అతని కీర్తి అలాంటిది. శుద్ధ సాత్త్వికమైన అతని సాన్నిధ్యం లభిస్తేనే చాలు, అన్ని సందేహాలు తీరుతాయి. సంశయాలు విడిపోయి సదాశయాలుగా మారుతాయి.

## 67

భౌతికంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా మహోన్నతస్థానంలో ఉన్న సర్వేశ్వరుడు అందరినీ అన్నింటినీ అన్నివైపులనుండి చూడగలడు. అతనికి కనిపించకుండా ఏ పని చేసేందుకూ వీలులేదు. అతడు సర్వసాక్షి. అతనికి

సాక్ష్యం అక్కరలేదు. అతనిపై మరో నాథుడు లేదు. ఒకవిధంగా అతడు అనాథుడు, అనీశుడు. అతని నిరంకుశ శాసనం శాశ్వతంగా స్థిరంగా సాగుతుంది. భూమిలో ఒక భాగంగా, భూమికి అలంకారంగా, భూలోకవాసులకు భూరిభూరి వరాలను ప్రసాదిస్తూ, వారికి శోకం సోకకుండా చూచే దయామయుడు కనుక, అతని ఆధిపత్యం కలకాలం ఉండాలని వాళ్ళు కాంక్షిస్తారు. ఈశ్వరానుగ్రహం ఉంటే అంతులేని కష్టాలు కూడా అవలీలగా తొలగిపోతాయి.

## 68

శోకమోహాది తరంగాలకు దూరంగా నిశ్చలంగా నిర్మలంగా శుద్ధసిద్ధాకృతిలో ఉన్న పరమాత్మ, పూజింపవలసిన పురుషోత్తముడు. సకల దేవతలు అతనినే అర్చిస్తారు. అందరి కాంతికిరణాలు అతనిలో పుంజీభవించి ఉంటాయి. అతడు నిండుకుండలాంటివాడు. తొణకదు, తరగదు. పరిపూర్ణమైన వాత్సల్యంతో అందరి దాహాన్ని తీరుస్తాడు. కాని యెప్పటి కప్పుడే అది పూర్ణకుంభం. తనలో ఏ దోషం లేదు కనుక, ఇతరులు కూడా నిర్దోషులుగానే అతని కంటికి కనిపిస్తారు. అతని చూపు తగిలితే చాలు, అన్ని దోషాలు నశిస్తాయి. అతణ్ణి నిరోధించే శక్తి ఎవరికీ లేదు. ఎవ్వరూ అతనికి అడ్డు తగలలేరు. అనిరుద్ధుడు, అప్రతిరథుడు -- అని అతని గుణగణాలను భక్తులు కొనియాడుతారు. ప్రభూతమైన కాంతితో, అనంతమైన పరాక్రమంతో శోభిల్లే పరమాత్మకు, ప్రద్యుమ్నాది నామాలు ప్రసిద్ధి పొందటంవల్ల, అతనిని సేవించి తరించదలచినవారికి తరణోపాయం లభించింది. భగవంతుని స్తుతించినందువల్ల భక్తులకే లాభం. భగవంతునికి లాభనష్టాలు లేవు. పరమాత్మ సర్వదా సంపూర్ణుడే.

## 69

కాలనేమిని చంపిన మహావీరుడు పరాక్రమానికి పరాకాష్ఠ. భగవంతుడు కాలస్వరూపుడు. కాలం అన్నింటిని కబళిస్తుంది. అలాంటి కాలాన్ని కబళించగల శూరుడు కాలాంతకుడు. శూరసేన వంశాన్ని ఉద్ధ-

రించి, కృష్ణావతారంలో శౌరిగా ఉదయించిన పరమాత్మ శూరులందరికీ అధిపతి అయినాడు. నిమిత్తమాత్రంగా కృష్ణపరమాత్మ శూరవంశంలో ఉదయించినా, మూడులోకాలకు అతడు అధినాథుడు. అందరిలో వ్యాపించి అందరినీ శాసించి, అందరికీ ఆశ్రయమిచ్చే హరి సర్వలోకనివాసి. కేశి అనే రాక్షసుణ్ణి సంహరించగా, అతనికి కేశవుడనే పేరు వచ్చింది. ఇలా అతని అనంతలీలలు అనంతనామాలను వెలయించాయి. కాని 'హరి' అంటే చాలు. అన్నీ చెప్పినట్టే; అన్నింటిని హరించేవాడు హరి. రఘువంశాన్ని తరింపజేసిన రాముడు, యదువంశాన్ని ఉద్ధరించిన కృష్ణుడు -- ఇద్దరూ ఈ హరిశబ్దంలో ధ్వనిస్తారు. శాంతిని ప్రసాదించే కాంతి కిరణాలకు నిలయం 'హరి' నామం.

## 70

'హరి' శబ్దంలో రామతత్త్వమే కాదు, కామతత్త్వంకూడా ఉంది. కల్యాణరాముడే కమనీయకాముడు. కల్యాణకామమే కమనీయధామం. కామదేవుడైన మన్మథుడు శ్రీమన్నారాయణుని కుమారుడు. ప్రద్యుమ్న నామం అతనిదే. ధర్మ సమ్మతమైన కామంతో తాను నివసిస్తానని భగవంతుడు తానే చెప్పకున్నాడు. కామాన్ని కల్పించి, పోషించి, సేవించి, సేవింపజేసే కాంతిమంతుడు శ్రీకాంతుడు. ఆగమశాస్త్రాలను ఆదేశించిన అధికారి. కామాన్ని లోకకల్యాణంకోసం వినియోగించవలసినదని శాసిస్తాడు. వ్యక్తిగతమైన కామం కలుషితమవుతుంది. లోకకల్యాణాన్ని సాధించగల కామం భగవదారాధన అవుతుంది. ఇలా విష్ణుమూర్తిని అనేక నామాలలో అనేక రూపాలలో కావించినా, ఇత్థమిత్థమని అతని స్వరూపాన్ని నిరూపించటం సాధ్యం కాదు. వీరులలో మహావీరుడు, దిగ్విజయం సాధించి ధనాన్ని స్వాధీనం చేసుకున్న ధనంజయుడు, అంతులేని అనంతశయనుడు -- ఇలా చెప్పకుంటూ పోవాలి. బ్రహ్మవాచకమైన 'క' కారం, విష్ణువాచకమైన 'అ'కారం, శివవాచకమైన 'మ'కారం కలిపి కామదేవుణ్ణి సృష్టిస్తే, దేవదేవుడు కామదేవుడయినా కావచ్చు. గీతామృతం ఆస్వాదించిన అర్జునుణ్ణి ధనంజయునిగా భావిస్తే, అతనిలో కూడా పరమాత్మ ఉన్నట్టు తోస్తుంది. పాండవుల్లో ధనంజయుణ్ణి

వేనని పరమాత్మ పార్థుడితోనే చెప్పి చమత్కరించాడు. ఈ చమత్కారాన్ని అర్థం చేసుకునేందుకు గొప్ప సంస్కారం కావాలి.

## 71

ఇన్ని విధాల చెప్పనక్కరలేదు. 'బ్రహ్మ' అంటేనే బ్రహ్మతత్త్వమంతా చెప్పినట్టే అవుతుంది. తపస్సు, తపస్సంపన్నమైన వాక్కు, తపస్సంపన్నులైన జ్ఞానులు, జ్ఞానం -- ఇవన్నీ బ్రహ్మశబ్దంలో ఇమిడి ఉన్నాయి. ఇదంతా బ్రహ్మసంపద. ఈ సంపదను పెంపొందించే పరమాత్మ బ్రహ్మణ్యుడు. అసలు పెరగటం బ్రహ్మ లక్షణం. ఈ పెరుగుదలను ప్రోత్సహించే పురుషోత్తముడు బ్రహ్మణ్యుడు. బ్రహ్మ సృష్టికర్త. బ్రహ్మను సృష్టించేవాడు బ్రహ్మకర్త. బ్రహ్మను సృష్టించే పరబ్రహ్మ స్వరూపం పరమాత్మస్వరూపం. బ్రహ్మతత్త్వాన్ని వివరించే మంత్రం, సృష్టాక్షరం, బుద్ధ్యాక్షరం (ఉచ్చరించే కొద్దీ, స్మరించేకొద్దీ, జపించేకొద్దీ పెరిగే సిద్ధవాక్కు) కూడా బ్రహ్మపరంగా వాడటం పరిపాటి. సృష్టికర్త బ్రహ్మ సగుణ బ్రహ్మ, సక్రియబ్రహ్మ. వేదమూర్తిబ్రహ్మ అక్షర పరబ్రహ్మ. నిర్గుణపరబ్రహ్మ శుద్ధచైతన్యపుంజం. ఈ రెండింటిని బ్రహ్మాండంలో పెంపొందించే బ్రాహ్మీమయమూర్తి శ్రీమహావిష్ణువు. బ్రహ్మపై సరస్వతి కోపించి, అతని చేతిలోని సృష్టిదండాన్ని తన చేతిలో పెట్టుకున్నప్పుడు దిగులుపడ్డ బ్రహ్మయ్యకు, మరో సృష్టిదండం ప్రసాదించినవాడు మహావిష్ణువు. బ్రహ్మతత్త్వం తెలిసినవాడు కనుక, ఆ తత్త్వం తెలిసిన బ్రహ్మవేత్తలన్నా, బ్రాహ్మణులన్నా యీ బ్రాహ్మీమూర్తికి చాలా ఇష్టం. అలాగే బ్రహ్మవిదులైన బ్రాహ్మణులకుకూడా బ్రహ్మకు బదులు అపరబ్రహ్మను సృష్టించగల పరబ్రహ్మ అంటే అపార గౌరవం. నిజానికి బ్రహ్మతత్త్వాన్ని వ్యాకరించే సమస్త వేదవాఙ్మయం బ్రహ్మణ్యుడైన వరేణ్యునిగురించే చెప్తుంది. వేదవేద్యుడే బ్రహ్మజిజ్ఞాసకు మూలపురుషుడు. జగన్నాటక సూత్రధారుని చేతిలోని బ్రహ్మసూత్ర మిదే.

## 72

బ్రహ్మసూత్రంతో బ్రహ్మాండాన్ని నడిపించే బ్రహ్మణ్యుని పనితనం, గమనం, చలనం, చైతన్యం అన్నీ బ్రహ్మాండమైనవి. మహామహులకుకూడా

బోధపడేవి కావు. ఏ పని చేసినా, ఎక్కడికి వెళ్ళినా అతని మహత్తరమైన తేజస్సు ఉట్టిపడుతుంటుంది. ఒక మహాసర్పంలా దర్పంతో ముందుకు సాగే యజమాని, మహనీయమైన సంకల్పంతో మాననీయమైన కార్యాలను సాధిస్తాడు. అతని సంకల్పమే ఒక క్రతువు. అతని చేష్టలే ఒక మహాయజ్ఞం. హోమంలో అగ్నిహోత్రుని కర్పించే ఆజ్యంలో అతని మహాపూజ్యమైన పుణ్యరూపం సాక్షాత్కరిస్తుంది. వెన్నలా కరిగిపోయే మహాహవిస్సులో అతని దివ్యవర్చస్సు గోచరిస్తుంది.

## 73

ఇంతటి మహనీయమూర్తిని సమీపించేందుకు నిర్మలమైన హృదయంతో స్తుతించటంతప్ప మరోమార్గం లేదు. అతడు స్తుతికి యోగ్యుడు. స్తుతికి సంతోషించేవాడు కాబట్టి, స్తోత్రమే సులభమైన మార్గం. కాని, స్తుతి నందుకొనేవాడే స్తుతిచేసేవానిలో ప్రవేశించి ఉంటాడు. స్తవనీయుడతడే, స్తోతకూడా అతడే. అంతే కాదు, స్తోత్రపాఠంలో స్తుతికార్యంలో -- రెండింటిలో అంటిఉన్న అక్షరపరబ్రహ్మను స్తుతించటంవల్ల, అది ఒక రకంగా ఆత్మస్తుతికూడా కావచ్చు. కాని అది దోషరహితమైన ఆత్మస్తుతి. అక్షరం వెలసిన చోట అక్షరపరబ్రహ్మ సాక్షాత్కరిస్తాడు. కాబట్టి ఆరాధ్యుడు, ఆరాధకుడు, ఆరాధన, ఆరాధన కుపయోగించే సాధనసంపత్తి అంతా అక్షరమయమే. అక్షరంలో ఆవిర్భవించే ధ్వని, రవం (రణం) అంటే పరమాత్మకు చాలా ఇష్టం. ఒక్కొక్క అక్షరంలో ఒక్కొక్క ఈశ్వరాంశ వ్యక్తమవుతుంది. ప్రణవంలోని ప్రతిరవం పరమేశ్వరుని పారమ్యాన్ని ప్రకటిస్తుంది. అది పరిపూర్ణమైన స్వరం. పరబ్రహ్మ కూడా పరిపూర్ణుడు. పరిపూర్ణతను ప్రసాదించే పరిపూరకుడు. పుణ్యమూర్తి. అతని మూర్తిలో, కీర్తిలో కూడా పుణ్యం పరిపూర్ణంగా ఉంటుంది. అందులో పాపానికి, జాడ్యానికి, ఆమయానికి తావు లేదు. పాపాలను పరిహరించి, పుణ్యాన్ని పరిపూర్ణం చేసే పుణ్యకీర్తి అనామయుడు, ఆరోగ్యవంతుడు. అలాంటి పుణ్యకీర్తిని స్తుతించటంకూడా ఆరోగ్యకరం.

## 74

పుణ్యపరిపూర్ణుడైన పురుషోత్తముడు మనోవేగంతో మారుమూలలకు కూడా వెళ్ళి సకలవిద్యలను ప్రబోధిస్తాడు. పుణ్యతీర్థాలలో బ్రహ్మ జిజ్ఞాసతో కూడిన పిపాసువుల అంతర్దాహాన్ని తీర్చి వాళ్ళను కృతార్థులను చేస్తాడు. పరమేశ్వరుని పవిత్రవీర్యంతోనే ప్రపంచమంతా పరిపూర్ణంగా ఉంది. అగ్ని, వాయువు, నీరు, వెలుగు -- అన్నీ వసుమూర్తి ప్రసాదించిన వసతులే. అష్టవసువులు, అష్టైశ్వర్యములు, అష్టసిద్ధులు -- అన్నింటినీ వసుప్రదుడే ప్రసాదిస్తాడు. కాని, యీ వసువులు రెండు రకాలు. కొన్ని ఇహలోకానికి సంబంధించినవి; అస్థిరమైన చర సంపదకు చెందినవి. మరి కొన్ని శాశ్వ-తంగా స్థిరంగా ఇహ పర తారకంగా ఉపకరించే ద్రవ్యసంపదకు చెందినవి. భవ్యమైన పార్థివసంపద త్వరగా లభిస్తుంది. త్వరలోనే నశిస్తుంది. దివ్యమైన నిశ్శ్రేయసానందం నెమ్మదిగా కూడుతుంది. నిలకడగా కలకాలం నిలు-స్తుంది. ఈ రెండురకాల వసువులు వసుమూర్తి వెలయించిన వసుంధరలో ప్రతివస్తువులో ఒకదాని నొకటి అంటి ఉన్నాయి. వాసుదేవుని నివాసనిలయ-మైన యీ వసుమతి, సర్వలోక వాస్తవ్యుని గొప్పమనస్సును అణువణువున చాటి చెపుతుంది. తొలిసంజలో, మలిసంజలో ప్రత్యూషంలో, ప్రభాసంలో, ఆవాసంలో, ఆచ్ఛాదనలో, ప్రభాకరునిలో, సుధాకరునిలో -- అన్నింటిలో వసునాయకుని వసుచ్ఛవి గోచరిస్తుంది. బ్రహ్మార్పణమని అగ్నిహోత్రంలో హోమంచేసే హవిస్సులో కూడా వసుప్రదుని తేజస్సే కనిపిస్తుంది. అంతా వసుమయం. 'వాసనాద్ వాసుదేవస్య వాసితం తే జగత్త్రయం.'

## 75

వాసుదేవుడే సర్వలోకనివాసుడు. అందరికీ సద్గతిని ప్రసాదించేవాడు. మంచిపనులుచేసే సజ్జనులకు సద్గతిని ఇచ్చి తన ఉనికిని భాసింపజేస్తాడు. మంచి నడవడిలో, మంచి పనులలో, మంచి ఉనికిలో, మంచి కలిమిలో, మంచి నిష్ఠలో మంచికి మారుపేరుగా మసలే మహత్తత్త్వమే సచ్చిదానం-దుని సత్స్వరూపం. మంచిని పెంచే మహనీయులకు ఈ రూపాన్ని మించి మరో రూపం లేదని తెలుసు. సత్యనారాయణుని సత్య స్వరూపం

సజ్జనులకు పరమారాధ్యం. పరమ రమణీయమైన పరమావధి. తన ఉనికిని తెలిపేందుకు ఈ సన్నివాసుదు సామాన్యుల మధ్య కూడా అవతరిస్తాడు. శూరసేనవంశంలో, యాదవకులంలో, యమునాతీరంలో కొన్నాళ్లు గడపా-లని పరవాసుదేవుడు సంకల్పించాడు. దేవకీవసుదేవుల కడుపు పంటగా జన్మించాడు. యశోదానందుల కంటి వెలుగుగా చిలిపిచేష్టలను చూపించాడు. సామాన్యమైన యమునాతీరంలో ప్రేమామృతం కురిపించి, యమునలోని ప్రతికణాన్ని అమృతసిక్తం చేశాడు. సామాన్య నదీతీరం సారస్వత మహా తీర్థమయింది. సన్నివాసుదు మంచిని వెదుక్కుంటూ వెళ్లుతాడు. మంచి కనిపించిన చోటు మాధవునికి మహాలయ మవుతుంది.

## 76

'ఇక్కడ ఉంటాడు, అక్కడ ఉండడు' అనే వివక్షతలేకుండా వాసు-దేవుడు సకలభూతాలలో, సమస్తజీవుల్లో, అందరి హృదయాల్లో, అందరి ప్రాణాల్లో గూడుకట్టుకొని ఉంటాడు. ప్రతిశరీరంలో వెచ్చదనం ఉంది. ఆ వెచ్చదనానికి ఆధారం సర్వాంతర్యామియై అందరి హృదయాకాశంలో వెలుగుతున్న పరంజ్యోతి. ఆ జ్యోతి వెలుగుతున్నంతవరకు శరీరం శివాల-యంగా వెలుగుతుంది. ఆ జ్యోతి ఈ శరీరాన్ని వదలగానే, శివాలయం శవాలయ మవుతుంది. శరీరమున్నప్పుడే ఆ జ్యోతిని దర్శించాలి. కాని, బాహ్యదృష్టి అంతర్ముఖమై, అహంకారం నశిస్తేనేగాని ఆ వెలుగు కనిపించదు. అహంకారం సంస్కారంవల్లగాని నశించదు. సంస్కారం సజ్జనసాంగత్యంవల్ల లభిస్తుంది. సజ్జనసాంగత్యం సన్నివాసుని అనుగ్రహంవల్లనే సాధ్యమవుతుంది. అహంకారంలేని ఆత్మప్రత్యయం, ఆత్మవిశ్వాసం మంచిదే. అలాంటి విశ్వా-సాన్ని, శ్రద్ధను మనస్సులో నెలకొల్పుకోవటమే పరమేశ్వర ధ్యానం. ఎంత ప్రయత్నించినా మాటిమాటికి తన గొప్పతనం పరమేశ్వరుని వరేణ్యతకు అడ్డు తగులుతుంటుంది. ఎదుటివాళ్ళ గొప్పతనాన్ని ముందు అంగీ-కరిస్తేనేగాని మనలోని సంస్కారం మనకు సహకరించదు. అందువల్లనే దైవచింతన ఎంతో సాధనతో, సంస్కారంతోగాని కుదరదు. ఈ నిలకడకోసం నిరంతరం పోరాడాలి. మనస్సుకు నచ్చచెప్పాలి. శరీరం మీది వ్యామోహం

తగ్గించుకొని ఆత్మవైపు పయనించాలి. ఈ పోరాటంలో పరమాత్మదే పైచెయ్యి. పరమాత్మకు ఓటమి లేదు. మనకుకూడా గెలుపు లభించాలి అంటే పరమాత్మ జీవాత్మను గెలిపించాలి.

## 77

సర్వస్వం ధరించే ధరాతలాన్ని అవలీలగా ధరించిన ధరాధరుడు, ధ్యానంలో దుర్ధరుడైపోతాడు. అతన్ని పట్టుకొని మనస్సులో నిలుపుకోవటం ఒక రాగాన సాధ్యమయే పని కాదు. దీనికి మనస్సులోని చాంచల్యం కొంతవరకు కారణం. ఒకవేళ మనస్సును నిలుపగలిగినా, విశ్వమంతటా వ్యాపించి, అనేకరూపాల్లో వ్యక్తావ్యక్తంగా భాసించే విశ్వాత్మకు, సరియైన రూపకల్పన చేయుటం అసాధ్యమైన పని. ప్రపంచమంతటా కనిపించే రూపాన్ని ఇదమిత్థమని నిరూపించటం ఎలా సాధ్యమవుతుంది? మహీతలాన్ని ఆవరించిన యీ మహామూర్తి లఘుమూర్తియైన సాధకుని ఊహకు మించి విరాడ్రూపాన్ని ప్రదర్శిస్తాడు. భానుకోటి ప్రకాశంతో వే వెలుగులతో వెలిగే దీప్తమూర్తిని చూచేందుకు దివ్యచక్షువులు కావాలి. చివరకు చూడగలిగిన సామర్థ్యం లభించేసరికి అసలు మూర్తే కనిపించదు. అనేక రూపాల్లో భాసించే విశ్వరూపానికి ప్రత్యేకంగా ఒక రూపమంటూ లేదు. వంద మందిలో, వంద ముఖాల్లో వ్యాపించిన పరమాత్మ ఒక రూపంలో కనిపించదు. అస లత దవ్యక్తుడు. సామాన్య మానవులు వ్యక్తులు. మహా మానవుడు మానవుల్లో, ప్రాణుల్లో వ్యక్తమవుతాడే కాని, ప్రత్యేకంగా చూస్తే అతడు అవ్యక్తుడు, నిరాకారుడు, నిరంజనుడు, అనిర్దేశ్యుడు.

## 78

పరమేశ్వరు డొక్కడా? అనేకుడా? అని చెప్పేందుకుకూడా వీలులేదు. ఒకరూపంలో చూస్తే ఒకడు, అనేకరూపాల్లో చూస్తే అనేకుడు. తపస్సంపన్నులు చేసిన తపస్సు ఫలించగా లభించిన తపస్సారమే పరమాత్ముని 'సవ' స్వరూపం. యజ్ఞయాగాదులు ప్రభవించిన ఉత్సవరూపుడు పరమాత్ముడు. అతడెవరు? అని ప్రశ్నించుకుంటే, ఆ ప్రశ్నకు సమాధానం ప్రశ్నవాచకమైన

ఎవడు (కః) అనే 'క'కారమే ఇస్తుంది. 'క'కారం బ్రహ్మవాచ్యం. ఏమిటి? అని ప్రశ్నిస్తే, మళ్ళీ ఏమిటి (కిం) అనే ప్రశ్నవాచకమే ప్రతిధ్వనిస్తుంది. ఎక్కడినుండి? అని ప్రశ్నిస్తే 'అక్కడినుండే' అని బదులు పలుకుతుంది. మన ప్రశ్నవాచకమైన స్వరం వెడలిన చోటు, చేరిన చోటు రెండూ ఒకటే అన్నట్టు, మనవాక్కు మారుమ్రోగి మనతో సంభాషిస్తుంది. మన పదాలను ప్రతిపదానువాదంతో ప్రతిధ్వనింపజేసే పరమపదం అదే. అదే అనుత్తమమైన విష్ణుపాదం. 'తద్ విష్ణోః పరమం పదం.' ఆ పరమపదంలో ప్రతిపాద్యుడైన పరమాత్మ సకలలోకబాంధవుడు. లోకేశ్వరుడు. మధువును కురిపించే మాధవుడు. భక్తులను బిడ్డలుగా చూసుకొని పోషించే భక్తవత్సలుడు.

## 79

పసిడివన్నెతో మిసమిసలాడే పరమాత్మస్వరూపంలో ఏ భాగం చూచినా హేమవర్ణంతో తళతళలాడుతుంది. చందనచర్చితమై, ఆభరణములతో శోభాయమానంగా విలసిల్లే అతని అంగాంగశోభ నయనానందకరంగా ఉంటుంది. శూన్యంలో శోభించే శుభాంగుని అంగలావణ్యం అతణ్ణి ప్రపంచానికి వేరు చేస్తుంది. వీరు లందరూ అతనిముందు భీరులైపోతారు. నెయ్యిలా కరిగిపోయే నవనీతమూర్తి ఎంత నిలకడగా ఉంటాడో, అంత చాంచల్యాన్ని కూడా నటిస్తాడు. ఒకప్పుడు కొండలా కదలక మెదలక నిలకడగా ఉంటాడు. మరొకప్పుడు మారుతవేగంతో ప్రసరిస్తాడు. చలించినా, చలించకపోయినా స్మరించినంతనే కరిగి కరుణించే కరుణాలయుడు పరమాత్మ.

## 80

తనను ప్రపంచం గౌరవించి సేవించవలెననే అభిమానం అతనికి లేదు. కాని తనను సేవించినవారిపట్ల చూపవలసిన అభిమానం, గౌరవం, ఆదరం ఆవగింజంత వ్యత్యాసం లేకుండా చూపిస్తాడు. ఇతరులకు లభించవలసిన గౌరవంలో ఏమాత్రం కొరవ రాకూడదని అతని సంకల్పం. అందువల్లనే అతనికి సహజంగా గౌరవం లభిస్తుంది. మూడు లోకాలను లాలించి పాలించి పోషించే లోకనాథుడు కీర్తికోసం ప్రాకులాడడు. కీర్తి ప్రతిష్ఠలు

అతనిని వెతుక్కుంటూ వస్తాయి. సూదంటురాయిలాంటి అతని మేధాశక్తి సర్వస్వాన్ని తనవైపు లాక్కుంటుంది. కాని తన మేధస్సు పై అతనికి అభిమానం లేదు. దానివల్ల ప్రపంచానికి ఏమాత్రం మేలు కలిగినా అందులోనే తన ధన్యత ఉందని భావించే పుణ్యాత్ముడు, పరమాత్ముడు. కలకాలం నిలిచే నిజమైన మేధస్సు కనుక, అది మేదినికి ఆధార మవుతుంది. ఒకనాటితో తరిగిపొయ్యే మేధస్సు కాదది. సూర్యమండలంలో అక్షయనిధిగా అలరారే దివ్యమేధస్సు ధరాతలాన్ని ధరిస్తుంది. ధర్మాన్ని నింబెడుతుంది. ధర్మసంవర్ధనియైన యీ మేధాశక్తి సర్వధా స్తవనీయం.

## 81

ప్రపంచంలోని కాంతిని తనలోని ద్యుతిలో నిలువచేసుకొని, కావలసినప్పుడు కావలసినంత కాంతిని కాంతికాములకు ప్రసాదించే తేజోదాత యీ మేధావి. అతని మేధస్సునుండి యీ తేజస్సు నిరంతరం వర్షిస్తుంది. కాని తరగదు. సూర్యుడు తన కిరణాలనుండి రసధారలు కురిపించినట్లే, సూర్యునిలోని తేజోమూర్తి తేజోరేఖలతో ప్రపంచాన్ని కాంతియుతం చేస్తాడు. సహజంగా దయామయుడైన పరమేశ్వరుడు అవసరమైనప్పుడు అస్త్రశస్త్రాలను ధరించి అరివర్గాన్ని సంహరించేందుకు కూడా వెనుదీయడు. ప్రజలు తప్పుదారి పట్టకుండా అదుపులో పెట్టుకొనేందుకు స్వామి పగ్గాలను చేత పట్టుకుంటాడు. స్వైరవిహారంచేసే ఇంద్రియాలను పగ్గంతో లాగి పట్టుకొంటేనేగాని అవి చెప్పిన మాట వినవు. ఇలా నిగ్రహాన్ని నేర్పి, ఎలాగయినా ప్రజాకోటి సరియైన మార్గంలో నడిచేందుకు ప్రయత్నిస్తాడు ప్రభువు. ఎంత చెడిపోయినా పూర్తిగా చెడిపోకుండా చివరిక్షణంలోనయినా పరమాత్మ పగ్గం లాగి పట్టుకుంటాడు. లోకకల్యాణంకోసం ఆయన చూపే వ్యగ్రత ఆయన కొమ్ముల్లో కనిపిస్తుంది. నాలుగు కొమ్ములతో, మూడుకాళ్ళతో, రెండు తలలతో, ఏడుచేతులతో మూడు స్తంభాలకు కట్టివేసిన మహావృషభంలాగా, మహేశ్వరుడు మానవాభ్యుదయంకోసం బిగ్గరగా కేకవేస్తూ ఉంటాడు. ఆ స్వరంలో చివరి నిస్వనం పరమాత్మకు నివాసస్థానం. ఏ స్వరమయినా పర్యవసానంలో పరమాత్మ ఉనికిని సూచిస్తుంది. అందువల్లనే పరబ్రహ్మాను

వ్యగ్రుడని, గదాగ్రజుడని అంటారు. వేద నిగదితములైన మంత్రరాజములకు అధిపతిగా, సమస్త వాఙ్మయాన్ని ప్రవచించిన ప్రభువు కాబట్టి, ఆయన తేజస్సు అక్షరప్రపంచానికి అక్షయమైన కాంతిని, అపారమైన శాంతిని ప్రసాదిస్తుంది.

## 82

నాలుగు వేదములలో ఈ గదాగ్రజుడు గోచరిస్తాడు. నిజానికి పరమేశ్వరుని ప్రాభవమే నాలుగువేదములలో ప్రతిపాదించబడిన పరమార్థం. విరాట్పురుషునిగా, సూత్రాత్మగా, అవ్యాకృతమూర్తిగా, తురీయాకృతిగా మహర్షులు కొనియాడిన చతుర్మూర్తి విష్ణుమూర్తి. భగవంతుని చతుర్భుజుడని కీర్తించటం పరిపాటి. శంఖ, చక్ర, గదా, పద్మములతో శోభిల్లే నాలుగు బాహువులు ప్రాణికోటికి శబ్ద స్పర్శ రూప రస గంధాలను, ధర్మార్థ కామ మోక్షాలను ప్రసాదించే నాలుగు వరాలు. వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ రూపాలలో నాలుగు వ్యూహాలను రచించి, చతుర్వ్యూహుడు తన బాహుబలాన్ని ప్రదర్శిస్తాడు. దుష్టశక్తులు ఏ మూలకు పారిపోయినా ఈ బాహువులను, వ్యూహాలను తప్పించుకోలేవు. నాలుగు వైపులా పరమాత్మకు ప్రవేశం ఉంది. నలుదిక్కుల ప్రసరించే అతని దృక్కులకు అన్ని చిక్కులూ చిక్కిపోతాయి. జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయావస్థలలో కూడా చతురాత్మ తనచాతుర్యాన్ని ఏదో ఒక రూపంలో చూపిస్తూనే ఉంటాడు. ఈ చతురాత్మ ఒకే భవంలో నాలుగు భావాలను వెలయిస్తాడు. నాలుగు వేదాలుకూడా ఆయన పాదాలను సేవించి అందులో ఒక పాదమే యీ దృశ్యజగత్తని చాటి చెప్తాయి. ఒక పాదమే ఇంత విలక్షణ చైతన్యాన్ని వెదజల్లగలిగితే, నాలుగు పాదాలు మరెంత తేజోవంతంగా ఉంటాయో ఊహించలేము.

## 83

ఊహకందని వ్యూహాలను నిర్మించి, ప్రపంచమంతటా వ్యాపించిన పరమాత్మ, వ్యాసంగాన్ని ఆయన తనంతట తాను ఉపసంహరించుకో

వలసినదే కాని, మరెవ్వరు దీనిని ఆపలేరు. ఈ విశ్వకావ్యానికి అంతు లేదు. ఆత్మవైభవం ఎప్పటికీ ఆగిపోదు. ఆత్మ అనివృత్తం. కాని, ఆత్మసాయుజ్యం కావాలంటే విషయవాసనలనుండి మనస్సు నివృత్తం కావాలి. బాహ్య విషయములనుండి నివృత్తి చెందిన మనస్సు, అంతరాత్మలోని అనంతవిభూతిలో సమావర్త మయిపోతుంది. కాని, విషయవాసనలను జయించటం దుష్కరం. అలాగే ఆత్మసాయుజ్యం పొందటంకూడా దుస్సాధ్యమే. ఆత్మసాక్షాత్కారం లభిస్తే అన్నింటిని అధిగమించి, దుర్లభం, దుర్గమం అయిన దుర్గంలో ప్రవేశించి, దురతిక్రమ సార్వభౌముని సందర్శించవచ్చు. ఆ దొరను ఎదుర్కొనగల మరో సమర్థుడు లేదు. మారుమూలన ఎవరికి అంతు చిక్కని మహావివరంలో దహరాకాశంలో దాగియున్న మహాప్రభువును చేరగలిగితే శత్రుభయం లేదు, పాపభయం లేదు, ద్వైతభయం లేదు, ఏ భయం లేదు. అన్ని ఆటంకాలను క్షణంలో వీక్షణమాత్రంచేత తొలగించగల మహాప్రభువు అనుగ్రహం కావాలి.

## 84

చక్కని అవయవములతో సర్వాంగసుందరంగా, మూడ ముచ్చటగా ఉండే స్ఫురద్రూపిగా పరమాత్మను ధ్యానించాలి. ఏ అవయవం ఏ రూపంలో ఏ పరిమాణంలో ఉండాలో అలా చెక్కినట్లు కూడిన శరీర సౌష్ఠవంతో కూడిన మోహనాంగుడు సర్వలోకసారాన్ని గ్రహించి లావణ్యరాశిగా రూపొంది ఉంటాడు. పూలలోని మకరందాన్ని గ్రోలే తుమ్మెదలా, పుడమిలోని పుణ్యాన్ని ఏరుకొని తనదగ్గర చేర్చుకుంటాడు భక్తలోక భృంగమైన పరమేష్ఠి. ఒకవిధంగా చూస్తే లోకసారమైన ఓంకారంవల్ల పొందదగినవాడు, లేదా ఓంకారంద్వారా కీర్తింపదగినవాడు అవటంవల్లకూడా, పరమాత్మను లోకసారంగు డనవచ్చు. లోకులందరూ అతని బిడ్డలు. లోకాలు అతని అవయవాలు. ఇలా సకలలోకాల్లో, లోకవాసుల్లో అతని ఆత్మ విస్తరించి ఉంది. అందరూ అతని సంతతికి చెందినవారే. ఇలా తన సంతతిని నిరంతరం పెంచుకునిపోతూ ఉంటాడు - తంతు వర్ధనుడు. ఊరక జనవిస్తారమేకాక, కార్య విస్తృతిలోకూడా కర్మసాక్షికి ఆసక్తిఉంది. ప్రజల

ప్రాభవాన్ని పెంచే గొప్పగొప్ప పనులను తనబిడ్డలచేత చేయిస్తాడు కాబట్టి, ఇంద్రునిలా మహేంద్రునిలా అతని కార్యదీక్ష మహోన్నతమైన స్థాయిలో కొనసాగుతూ ఉంటుంది. కాని ఇందులో అతని కర్తృత్వం ఏమి లేదు. అందరిచేత చేయిస్తూ ఉంటాడు. అతనికి ఏ పని చేయవలసిన అవసరమూ లేదు. అతడు కృతకృత్యుడు. చేయవలసినవి చేసివేసిన కర్మిష్ఠి కనుక అతడు నిశ్చింతగా కూర్చుంటాడు. సామాన్యమానవులు పనిచేసిన తర్వాతనే తా మీ పని చేశామని చెప్పుకుంటారు. అలాంటివాళ్ళు కృతకృత్యులు. కాని, పరమేష్ఠి ఇంకా జరగని పనినికూడా జరిగిందని చెప్తాడు. కనుక అతడు కృతాగముడు. జరుగనున్న భారతయుద్ధాన్ని ఊహించి, అర్జునుడు భీతిల్లిపోయాడు. ఇదంతా జరిగిపోయిందని కృష్ణపరమాత్మ తేల్చి చెప్పాడు. కృతాగమునికి కాలభేదం లేదు. జరిగినది, జరుగుతున్నది, జరుగనున్నది -- అన్నింటికీ అతని కృతిత్వం సమానాధికరణాన్ని సాధిస్తుంది. ఆగమ సారస్వతమంతా అతని కృతిత్వం వెలయించిందే. ఆగతం, అనాగతం అతని అనాహతంలోని భాగాలే.

## 85

జనన మరణాలుకూడ కాలంమీద ఆధారపడినవి. కాబట్టి, కాలాతీతుడు జననమరణాలకు కూడా అతీతుడు. భవబంధం అతన్ని బంధించ లేదు. భవానికి అతీతంగా ఉన్నతంగా ఉన్న ఉద్భవుడు ఎంత అదృష్టవంతుడో అంత అందాల రాశి. క్షణభంగుర సౌందర్యం పరిమితలావణ్యంతో కూడి ఉంటుంది. శాశ్వత సౌందర్యం విలక్షణ లావణ్యాన్ని వెలయిస్తుంది. ఆరని తడితో, తరగని దయతో అనంత సౌందర్యరాశి తన అశేష సంపదలను జీవకోటికి ప్రసాదిస్తూ ఉంటాడు. అతనిలో రత్నాల రాశి ఉంది. ఎన్ని రత్నాలు నాభినుండి బయటికి తీసినా ఆ రాశి తరగదు. ఎంత కాంతిని ప్రసరించినా అతని కనుదోయిలోని వెలుగు తగ్గదు. ఆదిత్యాది దేవతలకు కూడా కాంతిని ప్రసాదించే ఆదిదేవుడు నిజమైన అర్కుడు. కాంతిని ప్రసరింప జేసే సూర్యుణ్ణే ప్రపంచం ప్రత్యక్షదైవమని కొనియాడుతుంది, అర్చిస్తుంది. కాని, సూర్యకాంతికి మూలకాంతి నిచ్చే మూలవిరాట్టును

సూర్యుడుకూడా అర్చిస్తాడు. అందరి అర్చనలను అందుకొనే అర్కుడు, నీరు లేకుండానే పెరిగే జిల్లేడు చెట్టువలె, స్వయం ప్రభతో భాసిస్తాడు. అర్చించినవారికి అన్నం పెట్టి, పోషించి, జయం చేకూరుస్తాడు -- వాజసనుడయిన జయంతుడు. తిన్నది బ్రహ్మ, తినేది బ్రహ్మ. గెలుపు బ్రహ్మ, గెలిపించేది బ్రహ్మ. సర్వం బ్రహ్మమయం. బ్రహ్మకు అన్నీ తెలుసు. అంతటా గెలుపే. బ్రహ్మ కోశంలో పరాజయమనేది లేదు.

## 86

బంగారంలాంటి పరబ్రహ్మకాయంలో ఎక్కడచూచినా కనక బిందువులే. సువర్ణ బిందు సందోహంతో మిసమిసలాడే విరాడ్వపువును ఎవ్వరూ హరించలేరు. రాగద్వేషాలకు, శోకమోహాలకు, లాభనష్టాలకు, మానావమానాలకు ఏమాత్రం చలించక, క్షోభించక, నిశ్చలంగా, నిర్వికారంగా ఉండే సువర్ణదేహంలో సర్వవర్ణ సమామ్నాయం ఉంది. అక్షరపరబ్రహ్మ శరీరంలోని కణకణం, నరనరం సువర్ణకాంతితో అక్షయదీప్తిని వెలయిస్తూ ఉంటుంది. వాక్కును శాసించే సర్వవాగీశ్వరులకు ఈ సువర్ణదేహుడు అధీశ్వరుడు. ఈ సువర్ణదేహుని సువర్ణ బిందువులతో ఒక మహాహ్రదం -- గొప్ప మడుగు ఏర్పడి ఉంది. అదే సువర్ణ ప్రపంచం. వాఙ్మయజగత్తు. అది ఒక పెద్ద అగడ్త -- మహాగర్తం. ఎన్ని బిందువులైనా దానిలో చేరవచ్చు. దాని లోతు తెలియ నలవికాదు. పంచమహాభూతాలను, తన్మాత్రలను తనలో ఇముడ్చుకొనగల ఘన పరిమాణం ఆ హ్రదానికి, గర్తానికి ఉంది. ఏకాంతంగా సమాధిని నిలిపి యోగులు సాధించిన నిధులన్నీ ఆ మహానిధిలో ఉన్నాయి. పరబ్రహ్మ ప్రజానీకానికి ప్రసాదించే యీ సువర్ణమాల సకల జన సంసేవ్యమయినది. పరతత్త్వం అక్షరరూపంలో అందరికీ అందుబాటులోకి వస్తుంది. ఆ బిందువును గమనిస్తే ఆనందం ఉంది.

## 87

ఆ బిందువు సమస్త భూమండలానికీ ఆనందం చేకూర్చుతుంది. కలువపువ్వులా రాత్రినిగూడా కుసుమితం చేయగల కుందమందహాసం ఆ

బిందువులో తొణికిసలాడుతుంది. ఆ బిందువులోని మందహాసం దాచితే దాగదు. కువలయాన్ని చీల్చుకొని సప్తలోకాలలో ఆ కుందహాసం ప్రసరిస్తుంది. అయాచితంగా రసధారలు కురిసే మేఘంలా (పర్జన్యంలా) చల్లని పవిత్రమైన గాలిని వ్యాపింపజేస్తూ పావన వాయువాహనుడు ప్రచరిస్తాడు. ఇలా వాయువేగంతో ప్రపంచ మంతటా సంచరించి అందరికీ అందం, ఆనందం, జ్ఞానం పంచిపెట్టే సర్వజ్ఞుడు అమృతహృదయుడు. అమృతం గ్రోలిన అమృతగాత్రుడు అమృతం పంచిపెట్టడంలో ఆశ్చర్యం లేదు. అసలు పర్జన్యం మీదినుంచి వీచే పావన వాయువులోనే అమృతం ఉంటుంది. అలాంటి వాయువుమీద అమృతహృదయుడు పయనిస్తుంటే పరిసర వాయుమండలమంతా అమృతమయ మవుతుంది.

## 88

ఇంత అమూల్యమైన అమృతంకూడా సంకల్పసిద్ధులైన సాధకులకు సులభంగా లభిస్తుంది. సంకల్పం బలీయంగా ఉండాలి. హృదయం పవిత్రంగా ఉండాలి. పవిత్రహృదయానికి సాధ్యంకాని దేమీ ఉండదు. ఇలాంటి దృఢవ్రతులయెదుట బాహ్యాశత్రువులుగాని, అంతఃశత్రువులుగాని నిలబడలేరు. ఈ సంకల్పబలం మానవుల్లోనే కాదు, చెట్లుచేమల్లోకూడా ఉండవచ్చు. మర్రిచెట్టులో, అత్తిచెట్టులో, రావిచెట్టులోకూడా నిశితంగా పరిశీలిస్తే ఇలాంటి పరమ పావన భావన గోచరిస్తుంది. జడ చేతన భేదం లేకుడా సకలచరాచర సృష్టిలో నారాయణతత్త్వాన్ని చూడగలిగిన ధీరులకు, చాణూరాది మహావీరులు భయపడి పారిపోతారు. కంస చాణూర మర్దనుడైన జనార్దనుని స్మరించగానే చీకటి తొలగి వెలుతురు వస్తుంది. మృత్యువు పోయి అమృతత్వం లభిస్తుంది. మంచి మిగులుతుంది. మేలు కలుగుతుంది.

## 89

సంకల్పశుద్ధితో శత్రువులను సంహరించి, సాధువులకు సులభంగా లభించే తేజోమూర్తి వెయ్యివెలుగులతో అగ్నిలో ప్రవేశించి ఉంటాడు.

అగ్నికి ఏడు నాలుక లున్నాయి. కాళి, కరాళి, మనోజవ, సులోహిత, సుధూమ్రవర్ణ, స్ఫులింగిని, విశ్వరుచి -- ఇవీ యీ నాలుకలు. ఇవన్నీ దివ్యతేజస్సును కురిపించే పరంజ్యోతిలోకూడా ఉన్నాయి. అలాగే యీ నాలుకలలో వెలిగే ఏడు రకాల వెలుగులుకూడా ఆ పరంజ్యోతివే. సమస్త జగత్తుకు ఆధారభూతమైన సప్తమనే గుఱ్ఱాన్ని ఎక్కివస్తాడు -- సప్తవాహనుడైన అగ్నిదేవుడు. అగ్నికి ఒక రూపం లేదు. కాని, అన్ని రూపాలను రూపుమాపే స్వరూప స్వభావాలు ఉన్నాయి. ప్రజ్వలించక ముందు అగ్ని అమూర్తి. వెలుగసాగిన తర్వాత అన్నింటిని తన వెలుగులో లీనం చేసుకుంటాడు. అగ్ని రూపొందగానే పాపం భస్మమై పోతుంది. పవిత్రతకు అగ్ని ఆదర్శం. అనఘత్వం అనల స్వభావం. అగ్నియొక్క ప్రభావాన్ని మనం ఊహించలేము. రమ్యహర్మ్యాలను క్షణంలో భస్మంచేయగల శక్తి అగ్నిలో ఉంది. భయంకరమైన అగ్ని భయాన్ని పోగొట్టి ప్రాణశక్తిని ప్రసాదించ వచ్చు. అగ్నివిద్యవలన అణిమాది సిద్ధులు పొందవచ్చు. భయం, అభయం -- రెండూ ఒకే వస్తువులో ఉన్నాయి. పరస్పర విరుద్ధములైన పదార్థముల సమ్మేళనమే పరమాత్మ స్వరూపం.

## 90

ఈ సమన్వయం సర్వేశ్వరునికి స్వభావసిద్ధం. అణువంతటి చిన్న వాడు బ్రహ్మాండమంతటివాడవుతాడు. వామనుడే త్రివిక్రము డవుతాడు. బక్కచిక్కిన బ్రాహ్మణుడే బలిచక్రవర్తిని పాతాళానికి పంపిన స్థూల కాయు డయినాడు. సకల గుణాలకు రాశి -- అని పురాణాలు కీర్తించిన పురాణ పురుషుడే, నిర్గుణబ్రహ్మగా మారుతాడు. అన్నింటికి తగినవాడు కాబట్టి, మహనీయులలో మహనీయుడు. అతని స్వరూపం మనస్సులో నిలబెట్టుకొని ధ్యానించటం కష్టం. మన ప్రయత్నంవల్ల అతన్ని పట్టుకొనటం సాధ్యం కాదు. తనంతట తానే పట్టుబడాలి. తన నోట తానే తన పేరు, తన ఊరు చెప్పుకోవాలి. మనం చెప్పించలేము. పరాత్పరుని పుట్టు పూర్వోత్తరాలు ఎవ్వరికీ తెలియవు. అందరికంటె ముందు అవతరించినవాడు కాబట్టి అతని వంశం ప్రాగ్వంశం. అతని రూపం ప్రాగ్రూపం. అతని నామం ప్రాఙ్నామం.

అతని పలుకు ప్రాగ్భారతి. తొలివెలుగుతోపాటు మనుగడ పొందిన యీ ప్రాగ్విభవం చిరంతనంగా కొనసాగుతుంది. అతని ప్రాగ్వంశం దినదినప్రవర్ధమానంగా అభివృద్ధిచెందేందుకు, అతని ప్రాగ్భారతి సహకరిస్తుంది.

## 91

అందరి భారాన్ని వహించి పదిమందిలో పేరు ప్రతిష్ఠలు పొందిన పరమయోగి యీ వంశవర్ధనుడు. అతని వంశం ప్రయోజనరహితంగా పెరగలేదు. అతని యోగసాధన అందరికి కామితార్థములను ప్రసాదించింది. ఇకముందు ప్రసాదిస్తుంది. తాపత్రయాలతో, ఈషణాత్రయాలతో నానాబాధల ననుభవించే సంసారులకు విశ్రాంతి నిచ్చే ఆశ్రమంలాంటివాడు శాంతిధాముడు. విషయవాసనలను క్షీణింపజేసి విషకలుషితములయిన జీవితములను అమృతమయం చేస్తాడు వాయువేగంతో సంచరించే సుపర్ణుడు -- గరుడుడు. అతని రెక్కల్లోనే అమృతం ఉంది. అతడు సంచరించే వాయుమండలమంతా అమృతసిక్తమయిపోతుంది. అలాంటి గరుత్మంతుడు పరమాత్మకు వాహనం. విశ్వవృక్షానికి వేదాలు పర్ణాల(ఆకుల)లాంటివి. ఈ వృక్షంమీద రెండురకాల పిట్ట లుంటాయి. ఒకటి కమ్మని పండ్లను తిని ఆనందిస్తుంది, మరో జాతిపక్షి చూచి ఆనందిస్తూ ఉంటుంది. ఆ చూచి ఆనందించే పక్షి సుపర్ణ శబ్దంలో సూచ్యం అవుతుంది. అలాంటి సుపర్ణం సువర్ణ బిందువయిన యోగీశ్వరునికి వాహనం. ఎలాగయితేనేం, శ్రాంతి తప్తులైన కాంతికాముకులకు కాంతిని, శాంతిని ప్రసాదించే భారం పరమాత్మ తనమీద పెట్టుకొన్నాడు. ప్రపంచమంతా తా నయిన పరమాత్మకు ప్రజలు భారమా?

## 92

శాసించగలవాడే శాంతిని ప్రసాదించగలడు. ధనుర్వేద పారంగతుడైన రామభద్రుడు తన కోదండనిస్వనంతో అసంఖ్యాక రాక్షస సమూహాన్ని సంహరించి, సత్య ధర్మాలను శాశ్వతంగా నిలబెట్టాడు. అపారమైన కరుణ హృదయంలో ఇముడ్చుకొని దండించవలసిన దుష్టులను కఠోరంగా

దండించాడు. ముందు సామ దాన భేదాలతో శాంతియుతంగా ధర్మాన్ని సాధించేందుకు ప్రయత్నించాడు. సాధ్యం కానపుడు నాలుగో మార్గం - దండం ప్రయోగించాడు. కాని, చివరి ఉపాయాన్ని అవలంబించే సమయంలో కూడా సంయమంతో, శమదమాది సాధన సంపదతో, సామ్యంతో, సంతులనంతో సత్యాన్ని సాధించాడు. శాంతిని స్థాపించాడు. అలాంటి శుద్ధ సత్త్వ తేజోరాశి కనుక అతనిని ఎవరూ ఎదుర్కొనలేక పొయ్యారు. చివరకు రావణుని నోటకూడా రాముడు నారాయణుడనే భావం పలికించాడు. అన్నింటిని సహించి అన్నింటినీ సాధించగల సర్వసమర్థుడు, పైకి చూచేందుకు నియంతలా కనిపిస్తాడు. కాని, ఆ నిరంకుశ శాసనం లోక కల్యాణంకోసమే కాని, స్వార్థసాధనకోసం కాదు. యమ నియమాదులను ప్రజలకు బోధించి, తాను వీటి కలీతంగా ఉంటాడు -- యమ నియమ నియామకుడైన లోకశాసకుడు. అతడు నియమాలకు అతీతుడైన నియంత. యమునికి యముడైన వాచంయముడు. వాక్కును స్వాధీన పరచుకొన్న వాగధీశ్వరునికి సర్వం స్వాధీన మవుతుంది.

## 93

సచ్చిదానందమయునిలోని సత్తత్త్వమే సత్యధర్మపరాయణుని సత్స్వరూపం. సత్త్వగుణానికి పరిపూర్ణమైన ఆకారం, సాత్త్వికమనోవృత్తికి సమర్థమైన నిదర్శనం, సత్యనిష్ఠకు పరాకాష్ఠ -- ఇవన్నీ రామభద్రుని జీవితంలో చూడవచ్చు. పరుషమైన వాక్కు అతని నోట పలుకదు. అకారణంగా ఎవరినికూడా నిందించడు, దూషించడు, కోపపడడు. సత్య ధర్మ పరిపాలనలో స్వార్థాన్ని దూరనియ్యడు. సత్య ధర్మాలను రెండు పాదాలుగా చేసుకొని రెండింటిని కూడగట్టుకొని ముందుకు పయనించే ప్రేమమూర్తి రామచంద్రుడు. ప్రీతిని పెంచే ప్రేమపాత్రుడు అందరినీ ప్రేమభావంతో చూస్తాడు. ఇసుకను మోసే ఉడుతను, సర్వస్వం వహించే పుష్పకాన్ని సమభావంతో చూడగల అభిప్రాయుడు, అన్నివైపుల అందరిలో అన్నింట ప్రేమకళావిలాసాన్నే చూస్తాడు. ప్రేమస్వరూపుడైన పరమాత్మను సమీపించేందుకు ప్రేమగల హృదయానికే అర్హత. ప్రేమ పరిపూర్ణత చెందినప్పుడు శ్రేయస్కరమవుతుంది. నిశ్శ్రేయసానందానికి దారి చూపుతుంది.

## 94

ఆకాశంలో సంచరించే పరంజ్యోతి, ఆదిత్యరూపంలో భాసిస్తుంది. అదే జ్యోతి అగ్నిలో ప్రవేశించి, హోమంలో వేల్చే హవిస్సును గ్రహిస్తుంది. ఆదిత్యునిలో విష్ణురూపంలో, అగ్నిలో వైశ్వానర రూపంలో ప్రకాశించే పరంజ్యోతి, పరమాత్మకు ఆటపట్టు. ప్రపంచసారాన్ని గ్రహించి ప్రకాశాన్ని ప్రసరింపజేసే ప్రభాకరుడు కిరణములద్వారా తన కాంతిని నలువైపుల వెదజల్లుతాడు. చొరరాని చోట్లలో చొచ్చుకొని వెళతాడు. ప్రాణికోటికి కావలసిన పదార్థాలను ప్రసవిస్తాడు. అలాంటి రవిని లోచనాలుగా చేసుకుని పరమాత్మ ప్రపంచాన్ని చూస్తాడు. చంద్రుడు, సూర్యుడు, అగ్ని -- ఈ మూడే పరమేశ్వరునికి మూడు కండ్లు.

## 95

అంతులేని అనురాగంతో అప్యాయంగా అర్పించిన, హవిస్సును ఆరగించి యజమానులైన ప్రజలకు శాంతిభద్రతలు, సుఖసంపదలు ప్రసాదించే పరమభోక్త పరమాత్మ. అందరికంటె ముందుగా ప్రపంచ కారణంగా ఉదయించిన ఆదిదేవుడు ప్రజలకోసం మాటిమాటికి జన్మిస్తాడు. అతనికి విసుగు లేదు. వైరాగ్యం లేదు. విసుగు విరామం లేకుండా ఎవరెన్ని తప్పులు చేసినా అన్నింటిని క్షమిస్తూ, లోకాలను ప్రశాంతంగా పాలించే పరమాత్మయొక్క పరిపాలనావిధానం అత్యద్భుతమైనది. సామాన్య దృష్టికి బోధపడేది కాదు.

## 96

ఇది ఈ నాటి శాసనం కాదు. అనాదికాలంనుంచి యుగయుగాలుగా వర్ధిల్లుతున్న సనాతన శాసనం; సనాతనతత్త్వంకంటె కూడా సనాతనమైనది. కపిలాచార్యుల కాలంనుంచి ఈ సదాచారం అనూచానంగా వస్తున్నది. మహావరాహరూపంలో సృష్టిని ఉద్ధరించిందికూడా ఈ సనాతన తత్త్వమే. ఆద్యంతములు లేని యీ పరతత్త్వంలోనే సమస్తసృష్టి లయిస్తుంది. అన్నింటికి ఆధారమై, ఆశ్రయమై, ఆదర్శమైన యీ అద్భుత భగవత్తత్త్వం ప్రాణి

కోటికి అఖండమైన శాంతిని చేకూర్చుతుంది. స్వస్తి పలుకుతుంది. స్వస్తిని సృష్టిస్తుంది. స్వస్తిరూపాన్ని ధరిస్తుంది; స్వస్తిని సేవిస్తుంది; అందరికీ అనుకూలమైన స్వస్తిని సాధిస్తుంది. ఈ సనాతన తత్త్వమే సహస్రనామ సారం.

## 97

స్వస్తివాచ్యుడైన సర్వేశ్వరునికి ప్రియమైన కానుక స్వస్తి భావన. అందరూ సుఖంగా వుండాలని అందరూ భావిస్తే, అందరికీ స్వస్తి చేకూరుతుంది. అందులో కొందరికే ఆ భావముండి, చాలామందికి లేకపోతే లేనిపోని వైమనస్యం, ద్వేషం, ఆందోళన, ఆవేశం -- ఇలాంటివన్నీ పెరుగుతాయి. పనులు కొనసాగవు. కర్మం, రాగం, కోపం -- ఈ మూడూ రౌద్రానికి లక్షణాలు. ఈ మూడింటికి దూరంగా నిర్లిప్తంగా, నిష్కాక్తికంగా, నిర్వికారంగా నిఖిలేశ్వరుని పరిపాలన సాగుతుంది. అతని పేరు రుద్రుడయినా అతని పరిపాలన అరౌద్రం. అతడే రుద్రుడు. పదునాల్గు భువనాల పరిపాలన తన మీద ఉన్నా హాయిగా శేషతల్పంమీద శయనిస్తాడు. ఆ భారమంతా తన సుదర్శనచక్రానికి అప్పగించి, తన విక్రమాన్ని విచిత్రంగా ప్రదర్శిస్తాడు. అతని శాసనం ఇతరులను అణగద్రొక్కేందుకు ఏర్పడింది కాదు. అందరినీ ఊర్ధ్వాయుతులనుచేసి ఉత్సాహపరచి ఉన్నతోన్నత దశకు తీసుకొనివచ్చేందుకే విశ్వనాథుడు ప్రయత్నిస్తాడు.

## 98

రౌద్రరహితమైన పరిపాలనలో క్రౌర్యానికి తావుండదు. మనోవాక్కర్మలలో పుష్కలంగా పరిపూర్ణమైన దక్షతతో పరిపాలన సాగించే లోకపాలకుడు అందరికీ అనుకూలుడే. అతని హృదయంలో దాక్షిణ్యమే కాని, క్రౌర్యమనేది లేశమాత్రం కూడా లేదు. అత డెంత సమర్థుడో, అంతటి దయామయుడు. ఓర్పులో అతనిని మించినవారు లేరు. భూమాతకు కూడా అంత ఓర్పు లేదేమో! అన్నీ తెలిసిన తత్త్వవేత్తకాబట్టి, అతనికి భయము, భ్రాంతి లేవు. తనలోని ఆత్మతత్త్వమే అంతటా అనేక రూపాల్లో విస్తరించి

ఉన్నదనే పరమార్థాన్ని ప్రత్యక్షప్రమాణంగా తెలుసుకొని తెలియజేసే తెలుపరి కాబట్టి అతనికి ద్వైతం, ద్వేషం, భయం, భ్రాంతి లేవు. వాటికి తావే లేదు. అతని చెవులకు ఎప్పుడూ మంచి మంచి మాటలే వినిపిస్తాయి. అతని కీర్తి వింటేనే చెవులకు చిన్మయానందం లభిస్తుంది. శ్రవణమాత్రంచేత పాపాలు తొలగి, పుణ్యం లభిస్తుంది. నిజానికి, చెప్పటంకంటె వినటం సులభం. ముక్తిమార్గానికి దగ్గరి దారి.

## 99

ఈ దారిని చూపించే తారకమంత్రం భగవన్నామం. దుష్టభావాలను, దుష్కృత్యాలను, దుఃస్వప్నాలను దూరంగా పారదోలి పుణ్యభావాలను, పుణ్యకార్యాలను, పుణ్యచైతన్యాన్ని పెంపొందించే పుణ్యశ్రవణకీర్తనుడే సంసార సముద్రంలో చిక్కుకొన్న జీవకోటిని దరిజేర్చగల తారకుడు, ఉద్ధారకుడు. ఈ సన్మార్గానికి సరిపడని విపరీత ప్రతిభాషలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. సజ్జనసాంగత్య మెంత అవసరమో, దుష్టులకు దూరంగా ఉండటంకూడా అంత ముఖ్యం. మంచి మంచి పనులు చేస్తూ, మంచివారిలోని మంచిని చూస్తూ, మంచి భావాలను మననంచేస్తూ జీవితం గడిపే సాధుజనులను సర్వేశ్వరుడు సర్వకాల సర్వావస్థలయందు అన్ని వైపుల నిలబడి అన్నివిధాలా రక్షిస్తూ ఉంటాడు. అతని రక్షణలో అన్ని రకాల క్రమశిక్షణ లభిస్తుంది.

## 100

అనేక రూపాలలో అతని అనంతవిభూతి సాక్షాత్కరిస్తుంది. ఏ రూపంలో భావిస్తే ఆ రూపంలోనే శ్రీపతి సాక్షాత్కరిస్తాడు. శ్రీతత్త్వం భూతత్త్వానికి భిన్నమైనది కాదు. శ్రీదేవికి, భూదేవికి సమానమైన అభిమానాన్ని, అనురాగాన్ని పంచిపెట్టే వైకుంఠుడు, అన్నింట తన అకుంఠితమైన రూపాన్ని వెలయించి ఉన్నాడు. కోపతాపాలను పరిహరించి, భయభ్రాంతులను వదలి నలువైపుల చతుర్భుజరూపంతో చతురస్రమండలంలో అంతటా వ్యాపించియున్న పరమాత్మను, నిశితంగా గమనించి నిలకడగా సేవిస్తే,

దిక్కుతెలియని దిశామూఢులకు దిక్కు తెలుస్తుంది. ఏ వైపు వెళ్ళినా అదే చోటు చివరకు చేరుకోవాలి. ఈ ప్రపంచ మొక నలుచదరం. ఎక్కడినుంచి చూచినా చతుర్బాహువులు సమానదూరంలో ఉన్నట్లు కనిపిస్తాయి. ఈ చదరాన్ని తెలుసుకొనేందుకు చదువుకంటె సంస్కారం ఎక్కువగా కావాలి. అహంకారానికి దారితీయని చదువు వ్యక్తిలోని సంస్కారాన్ని మేల్కొలిపి అతనికి కావలసిన ఆత్మశక్తిని ప్రసాదిస్తుంది.

## 101

ఆత్మ అన్నింటికి ఆది. ఆది లేనిది అనాది. ఆత్మకు ఆదికారకుడైన పరమాత్మ అనాదికి మారుపేరు. ఆదికి ఆది, అవనికి అవని, ప్రాణానికి ప్రాణం, లక్ష్మికి లక్ష్మి, వాక్కుకు వాక్కు, అందానికి అందం, జన్మకు జననం, మరణానికి మారకం -- అయిన మూలకారకుని 'అనాది' అని ఒక్కమాటలో నిరూపించవచ్చు. భూర్భువాది సప్తలోకాలకు పునాది భూమి. ఆ భూమికి భూమికను ప్రసాదించే సార్వభౌముడు సర్వకారణుడు. సర్వస-త్తాకమైన భూమికి ఆ సార్వభౌముడు భూతినే కాక సంభూతిని, విభూతిని కూడా ప్రసాదిస్తాడు. నేల, నీరు, వెలుతురు, గాలి, ఆకాశంతో కూడిన పాంచభౌతిక జగత్తును అందంగా తీర్చిదిద్దిన మహాశిల్పి, తన పనితనానికి చిహ్నంగా చక్కని భుజబంధాలతో మహావీరునిలా అలరారుతూ ఉంటాడు. అతనిచూపులో, వాక్కులో, వర్చస్సులో వీరత్వం చిందిపడుతుంటుంది. పుట్టుకకే పుట్టుక నిచ్చే అనాదితత్త్వం చూచేందుకు అందంగా కనిపించినా, కార్యరూపంలో ఉగ్రంగా, భయంకరంగా గోచరించవచ్చు. అవసరమైనప్పుడు భీకరపరాక్రమాన్ని ప్రదర్శించి శత్రువులకు భీమునిలా కనిపిస్తాడు. దుష్టులకు భయం, శిష్టులకు అభయం -- రెండింటిని సాధించేందుకే యీ ఉగ్రరూపం ధరించటం.

## 102

అన్నింటిని ధరించే ధరాతలానికి, ధరాధరాలకు ఆధారంగా నిలబడి ఆశ్రయమిచ్చే విధాత, అధాతగా కూడా సాక్షాత్కరిస్తాడు. అతనికి మరో

ధాత లేకపోవటంవల్ల, అతడు అధాతగా బోధపడుతాడు. ప్రాణికోటికి ప్రాణదానంచేసే ఆ ధాత కూడా, ఈ ధాతలోనే ఉన్నాడు. ధాతగా, విధాతగా, అధాతగా ప్రవర్తించే పరమాత్మ సకలసృష్టికి, సర్వ దృష్టికి సంధాత. ఇలా చరాచర జగత్తుకు సంధాతృత్వం వహించిన విశ్వవిధాత పువ్వులా నవ్వుతాడు. అతని మందహాసానికి ఎన్ని పుష్పహాసాలో మారు పలుకుతాయి. పగలు, రాత్రి భేదం లేకుండా అహర్నిశలు అప్రమత్తంగా పనిచేసే ప్రజాగరుడు, ప్రజల నందరినీ తన స్థాయికి తీసుకురావాలని నిరంతరం ప్రయత్నిస్తాడు. అతడు పయనించే సన్మార్గంలో అందరూ అతణ్ణే అనుసరించాలని అతని అభిలాష. సచ్చిదానంద మార్గానికి సన్మార్గం తొలిమెట్టు. సత్పథంలో సాగిన సాధకుడు క్రమంగా చిన్మయ వీథిలో పయనించి ఆనందనిలయాన్ని అందుకోగలుగుతాడు. ఇలా ప్రాణికోటిని ఊర్ధ్వతన యానంలో సన్మార్గంలో ముందుకు నడిపించే ప్రాణమూర్తి ప్రణవస్వరూపుడు. ప్రాచీనం, నవీనం రెండింటి సమ్మేళనం ప్రణవలక్షణం. ప్రాణదాత పరమాత్మ ప్రణవంలో ప్రతిఫలిస్తాడు. కనుక పరమార్థసాధకమైన ప్రణవం చేతిలో ఉంటే, పరమార్థ మార్గంలో ఏ కొదవ ఉండదు. కావలసిన పాథేయాన్ని కొనిపెట్టే అమూల్యమైన నాణ్యం ప్రణవం. మామూలు నాణ్యాలకు పరిమితమైన పార్థివ సంపద మాత్రమే లభిస్తుంది. కాని, ప్రణవంలాంటి పణంతో ఏ సామగ్రినైనా కొనవచ్చు. ఇహపరాలు రెండూ ఈ నాణ్యానికి లభిస్తాయి. కాబట్టి పరమార్థ సాధనకు ప్రణవాన్ని మించిన పణం లేదు.

## 103

ఈ నాణ్యం అంతటా చెల్లుతుంది. దాని కదే ప్రమాణం. ప్రాణాలను భద్రంగా కాపాడే ప్రణవమే యీ నాణ్యం. ప్రాణాలకు అదే ఆధారం. ప్రాణాలకు ప్రాణంపోసే ప్రాణజీవనుడు - ప్రణవాకారుడు పరమాత్మ. అతనికి జననం లేదు. మరణంలేదు. వార్ధక్యం లేదు. అన్నింటికి అతీతమైన ఆత్మతత్త్వం ప్రణవం. 'అదే నీవు' అనే పరమార్థాన్ని వివరించే ప్రణవవాదం తత్త్వచింతనకు ఆధారం. ప్రణవ రహస్యం తెలుసుకుంటే ప్రాణరహస్యం

తెలుస్తుంది. ప్రాణశక్తిని స్వాధీనం చేసుకుంటే, ప్రాణజీవనుడైన పరమాత్మ తత్త్వం బోధపడుతుంది. మూలాధారం నుంచి సహస్రారంవరకు ప్రాణశక్తిని స్పందింప జేసే ప్రణవనాదం పరమార్థసాధనకు మూలం. నానారూపాల్లో భాసించే ఆత్మతత్త్వం తాత్త్వికంగా ఒకటే. ఏకాత్మ, ప్రత్యయసారమైన సర్వేశ్వర తత్త్వం ప్రణవపాదాల్లో ప్రత్యక్ష మవుతుంది. ప్రాపంచిక వాసనలు ఉపశమిస్తేనే కాని ప్రణవంలోని చతుర్థపాదం, మాత్రారహితమైన స్వయం-ప్రమ గోచరించదు. జన్మ మృత్యు జరాతిగమైన తురీయ చైతన్యం ఈ అమాత్రలో ఇమిడి ఉంటుంది. కాబట్టి ప్రణవజీవులు ప్రాణవేత్తలు, పరమార్థ కోవిదులు.

## 104

స్వయంభువమైన యీ ప్రణవం భూర్భువాది సప్తలోకాలలో సంచరి-స్తుంది. ముఖ్యంగా భూలోకం, భువర్లోకం, స్వర్లోకం ప్రణవానికి ప్రధానమైన వ్యాహృతులను కల్పిస్తాయి. మూడులోకాలలో వ్యాపించిన మహావృక్షం ప్రణవనాదం. అదే సంసార సముద్రంలో మునిగిన సాధకులకు తారకం. 'ఓం భూ ర్భువ స్సువః' -- అని త్రయీతనువును స్మరించగానే, పరమ వరేణ్యుడైన సవిత ప్రత్యక్షమై, నిద్రాణమైన చైతన్యాన్ని మేల్కొల్పుతాడు. తాతముత్తాతలకు కూడా తాత అయిన విధాత, సవితగానే మనకు సాక్షాత్కా-రిస్తాడు. అతని దివ్యమంగళ విగ్రహాన్ని మనసార భావించి, సేవించేందుకు చేసే ప్రయత్నమే యజ్ఞం. యద్రూపంలో ఉన్న యజ్ఞేశ్వరుని దర్శించాలంటే యజ్ఞం చెయ్యాలి. ఎక్కడినుండి యీ ప్రపంచం ప్రసరిస్తూ ఉన్నదో, ఆ యత్పదార్థాన్ని తత్ పదార్థంగా గుర్తించి కీర్తించేందుకు యజ్ఞం చెయ్యాలి. ఈ యజ్ఞం అనేక రూపాల్లో చేయవచ్చు. భగవన్నామాన్ని స్మరించటం ఒక యజ్ఞం; భగవంతుని మూర్తిని భావించి అర్చించటం ఒక యజ్ఞం; అగ్నిని మధ్యవర్తిగా చేసుకుని ఆదిత్యమండలంలోని అఖండ జ్యోతిని ఆరాధించటం మరో యజ్ఞం; పంచప్రాణాలకు మూలమైన ముఖ్యప్రాణాన్ని ప్రాణాయామంతో, యమనియమాది సాధనతో, ప్రజ్వలింపజేసి పరంజ్యోతిని ఆత్మలో దర్శించటం ఒక యజ్ఞం. ఏ రూపంలో ఆచరించినా యజ్ఞం

అంతఃకరణశుద్ధికి తోడ్పడుతుంది. అన్నింటికీ మించినది జ్ఞానయజ్ఞం. జపయజ్ఞం దీనికి మెరుగుపెట్టే అమూల్యసాధన. సాధనలోనే సాధ్యం మిళితమై ఉంటుంది. అలాగే యజ్ఞంలోనే యజ్ఞపతి నివసిస్తాడు. యజ్ఞం చేసే యజమానిలో కూడా యజ్ఞేశ్వరుడు ఉంటాడు. అందుకనే యజ్ఞశాలకు తూర్పుగా యజమానికి ఏర్పరచిన యింటిని ప్రాగ్వంశమంటారు. ప్రాగ్వంశంలో యజమానిరూపంలో యజ్ఞపురుషుడు నివసిస్తాడు. యజ్ఞంలోని ప్రతిభాగంలో, అంగాంగంలో యజ్ఞవాహనుడు మూర్తీభవించి ఉంటాడు. యజ్ఞాన్ని సక్రమంగా నడిపించేవాడుకూడా యజ్ఞేశ్వరుడైన సర్వేశ్వరుడే.

## 105

యజమానులచేత యజ్ఞం చేయించి, దానికి తానే కర్తగా, ధర్మకర్తగా నిలబడి, అందులో అర్పించిన నైవేద్యాన్ని ఆరగించి, సాధనసంపత్తికి సాద్గుణ్యం లభించేలా ఆశీర్వదించి, యథావిధిగా యజ్ఞం పూర్తి అయ్యేటట్టు చూచే మహాయాజి -- పరమేశ్వరుడు. యజ్ఞంలోని రహస్యం అతనికి తెలిసినట్టుగా మరొకరికి తెలియదు. యజ్ఞం చేసేవాడు, చేయించేవాడు, చేసిన సాధన, చేసినందున లభించిన ఫలితం, చేసే విధానం, ఈ విధానంలో ఉన్న రహస్యం అంతా ఈశ్వరార్పణం. అలాగే అన్నం పరబ్రహ్మస్వరూపం. అన్నం తినేవాడుకూడా పరమాత్మ స్వరూపుడే. 'అన్నం తినేది తనకోసం కాదు, తనలో వైశ్వానరరూపంలో నెలకొనియున్న ఇలవేల్పును ఆరాధించేందుకు' అనే పవిత్రభావంతో భుజించినచో భక్ష్యభోజ్యాదులుకూడా పరమాత్మకు ప్రతిరూపాలే అవుతాయి. 'అన్నం బ్రహ్మ. అన్నం తినే -- అన్నాదుడు బ్రహ్మ. అన్నదాత బ్రహ్మ. సర్వం బ్రహ్మమయం' అనేది అన్నజీవి అలవరచుకొనవలసిన అనన్యభావన.

## 106

ఈ అనన్యత జీవాత్మకు, పరమాత్మకు మధ్య అన్యోన్యతను పెంచుతుంది. తన ఆత్మకు పరమాత్మకు భేదంలేదనే విషయం ఆత్మ జిజ్ఞాసవల్లగాని తెలియదు. తనంతట తాను జన్మించి, తనకు తానే కారణమైన ఆత్మ

తత్త్వాన్ని ఎంత తరిచి చూస్తే అంత రహస్యం గోచరిస్తుంది. ఎంత తొలిచి చూస్తే అంత విలువ కనిపిస్తుంది. త్రవ్వి త్రవ్వి చూచేకొద్దీ వెలలేని రత్నరాజిని వెలయించే దివ్యఖని పరమాత్మ స్వరూపం. ఖననంచేతనే ఖని విలువ పెరుగుతుంది. ఆత్మవిద్య సామాన్యమైన గని కాదు. అంతులేని సంపదలు దానిలో దాగి ఉన్నాయి. ఆత్మ వైభవం రెండు మూడు మాటల్లో చెప్తే ముగిసేదికాదు. వెయ్యినామాల్లో కీర్తించినా తనివి తీరదు. సామగానం ఒకవిధంగా ఆత్మగానమే. అనంతవిశ్వంలో వ్యాపించియున్న ఆత్మతత్త్వాన్ని అప్పుడప్పుడు ఒకానొక విశిష్టరూపంలో కూడా దర్శించవచ్చు. దేవకి కడుపు పంటగా జన్మించిన కృష్ణపరమాత్మలో ఈ ఆత్మ సౌందర్యం గమనించవచ్చు. పాపాన్ని తొలగించి, ప్రపంచాన్ని ప్రశాంతినిలయంగా రూపొందించాలని అవతరించిన దేవకీనందనుడు, సృష్టిలో ఒక భాగమయినప్పటికీ, సృష్టి కర్తకు ఉండవలసిన లక్షణాలు అతనిలో ఉన్నాయి. సర్వలోకైకనాథుడు యదునాథుడు. అలాగే సర్వసౌందర్యధాముడు రఘురాముడు. నిజానికి పరమాత్మస్వరూపాన్ని ప్రతిరూపంలో భావించవచ్చు.

## 107

పంచమహాభూతములతో కూడుకొనియున్న పార్థివశరీరమే పాంచజన్యం. అదే పరమాత్మ వినిపించే శంఖధ్వని. పరిసరాలను పావనంచేసి, మంచి మంచి మాటలను మంత్రాలుగా మార్చే మాంత్రిక సామర్థ్యం యోగేశ్వరుని శంఖంలో ఉంది. ప్రపంచాన్ని ఆనందనిలయంగా మార్చేది నందకం అనే అతని ఖడ్గం. కాని ఖడ్గధారలతో చాల మెలకువగా వ్యవహరించాలి. అది అసిధారా వ్రతచర్య. చూచేందుకు తళతళ మెరుస్తూ ఉండవచ్చు. కాని, గురి తప్పితే, వినోదానికి బదులు విషాదం లభించవచ్చు. అప్రమత్తతతో దీనిని వాడుకోగలిగినప్పుడే యీ ఖడ్గసృష్టికి సార్థక్యం. అలాగే సుదర్శన చక్రం. ప్రపంచవలయంలోని చలనాన్ని, భ్రమణాన్ని, అరవింద సౌందర్యాన్ని అరచేతిలో వ్రేలి చివర చూపించగల సామర్థ్యం ఈ సుదర్శనానికి ఉంది. సంసార చక్రంలోని సారమంతా సుదర్శనచక్రంలో ప్రతిఫలిస్తుంది. పరమాత్మకు ఒక ధనువుకూడా ఉంది. బ్రహ్మపదార్థమనే లక్ష్యాన్ని, ప్రణవధనువుమండి వెడలిన ఆత్మ అనే బాణం, వేధించేటట్టు

మెలకువతో బాణం వదలాలని వేదాలు ఆదేశిస్తాయి. ఆ ధనువే యీ శార్ఙ్గం. నాలుగు కొమ్ముల నల్లనయ్య తాల్చిన యీ ధనువులో శృంగారం సుకుమారంగా ధ్వనిస్తుంది. శార్ఙ్గరవంలోని శృంగారాన్ని చక్కగా గమనించ గలిగితే తనువుకూడా ధనువుగా రూపొందుతుంది. పరమేష్ఠికి గద కూడా ఉంది. దాని పేరు కౌమోదకి. కువలయానికి మోదం కలిగించటం ఆ గద చేసే పని. పరబ్రహ్మ నోట వెలువడిన వాక్కే గదగా మారింది. శ్రుతులన్నీ పరమేష్ఠి వదలిన శ్వాసవాయువులని ప్రతీతి. ప్రపంచంలో మనకు వినవచ్చే తియ్యని వినాదాలకు మూలం పరమాత్మ తనచేతిలో ధరించే కౌమోదకి అనే గద.

ప్రాణికోటి పయనించేందుకు అనేకరథాలను సృష్టించి, ఆ రథాంగాలను (చక్రాలను) తనచేతిలో పెట్టుకొన్న చతురుడు రథాంగపాణి. రథం సారథి చేతిలో ఉంటుంది. కాని చక్రం స్వామిచేతిలో ఉంటుంది. ఇది చాల విచిత్రమైన ఊహ. ఈ రథాంగపాణి మామూలుగా మనం భావించే చక్రపాణి కాదు. చక్రపాణికి సుదర్శనచక్రం చేతిలో ఉంటుంది. రథాంగపాణికి రథాంగం (చక్రం) తన అధీనంలో ఉంటుంది. రథచక్రాన్ని చేతిలో పెట్టుకొనటం ఇక్కడ వాచ్యం కాదు, లక్ష్యం. మన రథాలు ఎక్కడ నడుస్తున్నా, వాటి చక్రాలు ఎంతదూరంలోఉన్నా రథాంగపాణి అనుమతిస్తేనే ఆ చక్రాలు కదులుతాయి. అతని ఆమోదం లేకుంటే వెంటనే ఆగిపోతాయి. ఈ రథాలను, చక్రాలను ఆపేందుకుగాని, నడిపేందుకుగానీ రథాంగపాణి తా మున్నచోటునుంచి కదలవలసినపని లేదు. అందరి గమనాన్ని గమనిస్తూ నిర్వికల్పంగా, నిశ్చలంగా అన్నింటిని నడిపించే సర్వలోకసారథి విజయసారథి. ఇంత భారాన్ని తనమీద వేసుకుని తలమునకలు అవుతున్నా, ఆవగింజంత విసుగు కూడా అక్షోభ్యుడైన అంతరాత్మకు లేదు. అతనికి లేని ఆయుధం లేదు. బ్రహ్మాండాన్ని తన అండదండల్లో నడిపించే దండాయుధుడు, తన దండాన్ని దండనకూ ఉపయోగిస్తాడు, మండనకూ ఉపయోగిస్తాడు. అందరినీ రక్షించేందుకు, అవసరమైనప్పుడు కొందరిని శిక్షించేందుకు అన్నిరకాల ఆయుధాలను ప్రయోగించే సర్వ ప్రహరణాయుధుడు సర్వలోక శరణ్యుడు.

## 108

ఈ లోకాలన్నీ ప్రణవంనుంచి ప్రభవించి చివరకు ప్రణవంలోనే లయిస్తాయి. ప్రణవమే బ్రహ్మ, ప్రణవమే విష్ణువు, ప్రణవమే కామేశ్వరుడైన పరమేశ్వరుడు. మూర్తిత్రయం, వేదత్రయం, కాలత్రయం, మాత్రాత్రయం, అవస్థాత్రయం, గుణత్రయం, భువనత్రయం ప్రణవంలో గోచరిస్తాయి. ఆ బృహత్సత్యానికి నమస్కరించటమే జీవిత పరమావధి.

"భూయిష్ఠాం తే నమ ఉక్తిం విధేమ"

ఓం

శ్రీం శ్రియై నమః

# శ్రీ విష్ణు సహస్రనామావళిః

# శ్రీవిష్ణుసహస్రనామావళిః

*ఓం విశ్వస్మై నమః
విష్ణవే
వషట్కారాయ
భూతభవ్యభవత్ ప్రభవే
భూతకృతే
భూతభృతే
భావాయ
భూతాత్మనే
భూతభావనాయ
పూతాత్మనే 10
పరమాత్మనే
ముక్తానాం పరమాగతయే
అవ్యయాయ
పురుషాయ
సాక్షిణే
క్షేత్రజ్ఞాయ
అక్షరాయ
యోగాయ
యోగవిదాం నేత్రే
ప్రధాన పురుషేశ్వరాయ 20
నారసింహవపుషే
శ్రీమతే
కేశవాయ
పురుషోత్తమాయ
సర్వస్మై
ఓం శర్వాయ నమః
శివాయ
స్థాణవే
భూతాదయే
నిధయేఽవ్యయాయ 30
సంభవాయ
భావనాయ
భర్త్రే
ప్రభవాయ
ప్రభవే
ఈశ్వరాయ
స్వయంభువే
శంభవే
ఆదిత్యాయ
పుష్కరాక్షాయ 40
మహాస్వనాయ
అనాదినిధనాయ
ధాత్రే
విధాత్రే
ధాతురుత్తమాయ
అప్రమేయాయ
హృషీకేశాయ
పద్మనాభాయ
అమరప్రభవే
విశ్వకర్మణే 50

* ఓంకారం ప్రతినామానికి మొదట అన్వయిస్తుంది. నామాంతమున నమః అని చేర్చుకొనవలయును.

ఓం మనవే నమః
త్వష్ట్రే
స్థవిష్ఠాయ
స్థవిరాయ ధ్రువాయ
అగ్రాహ్యాయ
శాశ్వతాయ
కృష్ణాయ
లోహితాక్షాయ
ప్రతర్దనాయ
ప్రభూతాయ 60
త్రికకుబ్ధామ్నే
పవిత్రాయ
పరస్మై మంగళాయ
ఈశానాయ
ప్రాణదాయ
ప్రాణాయ
జ్యేష్ఠాయ
శ్రేష్ఠాయ
ప్రజాపతయే
హిరణ్యగర్భాయ 70
భూగర్భాయ
మాధవాయ
మధుసూదనాయ
ఈశ్వరాయ
విక్రమిణే
ధన్వినే
మేధావినే

ఓం విక్రమాయ నమః
క్రమాయ
అనుత్తమాయ 80
దురాధర్షాయ
కృతజ్ఞాయ
కృతయే
ఆత్మవతే
సురేశాయ
శరణాయ
శర్మణే
విశ్వరేతసే
ప్రజాభవాయ
అహ్నే 90
సంవత్సరాయ
వ్యాళాయ
ప్రత్యయాయ
సర్వదర్శనాయ
అజాయ
సర్వేశ్వరాయ
సిద్ధాయ
సిద్ధయే
సర్వాదయే
అచ్యుతాయ 100
వృషాకపయే
అమేయాత్మనే
సర్వయోగ వినిస్సృతాయ
వసవే

ఓం వసుమనసే నమః
సత్యాయ
సమాత్మనే
అసమ్మితాయ
సమాయ
అమోఘాయ 110
పుండరీకాక్షాయ
వృషకర్మణే
వృషాకృతయే
రుద్రాయ
బహుశిరసే

విశ్వయోనయే
శుచిశ్రవసే
అమృతాయ
శాశ్వతస్థాణవే 120
వరారోహాయ
మహాతపసే
సర్వగాయ
సర్వవిద్భానవే
విష్వక్సేనాయ
జనార్దనాయ
వేదాయ
వేదవిదే
అవ్యంగాయ
వేదాంగాయ 130
వేదవిదే

ఓం కవయే నమః
లోకాధ్యక్షాయ
సురాధ్యక్షాయ
ధర్మాధ్యక్షాయ
కృతాకృతాయ
చతురాత్మనే
చతుర్వ్యూహాయ
చతుర్దంష్ట్రాయ
చతుర్భుజాయ 140
భ్రాజిష్ణవే
భోజనాయ
భోక్త్రే
సహిష్ణవే
జగదాదిజాయ
అనఘాయ
విజయాయ
జేత్రే
విశ్వయోనయే
పునర్వసవే 150
ఉపేంద్రాయ
వామనాయ
ప్రాంశవే
అమోఘాయ
శుచయే
ఊర్జితాయ
అతీంద్రాయ

ఓం సంగ్రహాయ నమః
సర్గాయ
ధృతాత్మనే 160
నియమాయ
యమాయ
వేద్యాయ
వైద్యాయ
సదాయోగినే
వీరఘ్నే
మాధవాయ
మధవే
అతీంద్రియాయ
మహామాయాయ 170
మహోత్సాహాయ
మహాబలాయ
మహాబుద్ధయే
మహావీర్యాయ
మహాశక్తయే
మహాద్యుతయే
అనిర్దేశ్య వపుషే
శ్రీమతే
అమేయాత్మనే
మహాద్రిధృషే 180
మహేష్వాసాయ
మహీభర్త్రే

ఓం శ్రీనివాసాయ నమః
సతాంగతయే
అనిరుద్ధాయ
సురానందాయ
గోవిందాయ
గోవిదాంపతయే
మరీచయే
దమనాయ 190
హంసాయ
సుపర్ణాయ
భుజగోత్తమాయ
హిరణ్యనాభాయ
సుతపసే
పద్మనాభాయ
ప్రజాపతయే
అమృత్యవే
సర్వదృశే
సింహాయ 200
సంధాత్రే
సంధిమతే
స్థిరాయ
అజాయ
దుర్మర్షణాయ
శాస్త్రే
విశ్రుతాత్మనే

ఓం సురారిఘ్నే నమః
గురవే
గురుతమాయ 210
ధామ్నే
సత్యాయ
సత్యపరాక్రమాయ
నిమిషాయ
అనిమిషాయ
స్రగ్విణే
వాచస్పతయే ఉదారధియే
అగ్రణ్యే
గ్రామణ్యే
శ్రీమతే 220
న్యాయాయ
నేత్రే
సమీరణాయ
సహస్రమూర్ధ్నే
విశ్వాత్మనే
సహస్రాక్షాయ
సహస్రపదే
ఆవర్తనాయ
నివృత్తాత్మనే
సంవృతాయ 230
సంప్రమర్దనాయ
అహఃసంవర్తకాయ

ఓం వహ్నయే నమః
అనిలాయ
ధరణీధరాయ
సుప్రసాదాయ
ప్రసన్నాత్మనే
విశ్వధృషే
విశ్వభుజే
విభవే 240
సత్కర్త్రే
సత్కృతాయ
సాధవే
జహ్నవే
నారాయణాయ
నరాయ
అసంఖ్యేయాయ
అప్రమేయాత్మనే
విశిష్టాయ
శిష్టకృతే 250
శుచయే
సిద్ధార్థాయ
సిద్ధసంకల్పాయ
సిద్ధిదాయ
సిద్ధిసాధనాయ
వృషాహిణే
వృషభాయ

ఓం విష్ణవే నమః
వృషపర్వణే
వృషోదరాయ 260
వర్ధనాయ
వర్ధమానాయ
వివిక్తాయ
శ్రుతిసాగరాయ
సుభుజాయ
దుర్ధరాయ
వాగ్మినే
మహేంద్రాయ
వసుదాయ
వసవే 270
నైకరూపాయ
బృహద్రూపాయ
శిపివిష్టాయ
ప్రకాశనాయ
ఓజస్తేజోద్యుతిధరాయ
ప్రకాశాత్మనే
ప్రతాపనాయ
ఋద్ధాయ
స్పష్టాక్షరాయ
మంత్రాయ 280
చంద్రాంశవే
భాస్కరద్యుతయే

ఓం అమృతాంశూద్భవాయ నమః
భానవే
శశబిందవే
సురేశ్వరాయ
ఔషధాయ
జగతః సేతవే
సత్యధర్మపరాక్రమాయ
భూతభవ్యభవన్నాథాయ 290
పవనాయ
పావనాయ
అనలాయ
కామఘ్నే
కామకృతే
కాంతాయ
కామాయ
కామప్రదాయ
ప్రభవే
యుగాదికృతే 300
యుగావర్తాయ
నైకమాయాయ
మహాశనాయ
అదృశ్యాయ
వ్యక్తరూపాయ
సహస్రజితే
అనంతజితే

ఓం ఇష్టాయ నమః
(అ)విశిష్టాయ
శిష్టేష్టాయ 310
శిఖండినే
నహుషాయ
వృషాయ
క్రోధఘ్నే
క్రోధకృత్కర్త్రే
విశ్వబాహవే
మహీధరాయ
అచ్యుతాయ
ప్రథితాయ
ప్రాణాయ 320
ప్రాణదాయ
వాసవానుజాయ
అపాంనిధయే
అధిష్ఠానాయ
అప్రమత్తాయ
ప్రతిష్ఠితాయ
స్కందాయ
స్కందధరాయ
ధుర్యాయ
వరదాయ 330
వాయువాహనాయ
వాసుదేవాయ

ఓం బృహద్భానవే నమః
ఆదిదేవాయ
పురందరాయ
అశోకాయ
తారణాయ
తారాయ
శూరాయ
శౌరయే 340
జనేశ్వరాయ
అనుకూలాయ
శతావర్తాయ
పద్మినే
పద్మనిభేక్షణాయ
పద్మనాభాయ
అరవిందాక్షాయ
పద్మగర్భాయ
శరీరభృతే
మహర్ధయే 350
ఋద్ధాయ
వృద్ధాత్మనే
మహాక్షాయ
గరుడధ్వజాయ
అతులాయ
శరభాయ
భీమాయ

ఓం సమయజ్ఞాయ నమః
హవిర్హరయే
సర్వలక్షణలక్షణ్యాయ 360
లక్ష్మీవతే
సమితింజయాయ
విక్షరాయ
రోహితాయ
మార్గాయ
హేతవే
దామోదరాయ
సహాయ
మహీధరాయ
మహాభాగాయ 370
వేగవతే
అమితాశనాయ
ఉద్భవాయ
క్షోభణాయ
దేవాయ
శ్రీగర్భాయ
పరమేశ్వరాయ
కరణాయ
కారణాయ
కర్త్రే 380
వికర్త్రే
గహనాయ

ఓం గుహాయ నమః
వ్యవసాయాయ
వ్యవస్థానాయ
సంస్థానాయ
స్థానదాయ
ధ్రువాయ
పరర్ధయే
పరమస్పష్టాయ 390
తుష్టాయ
పుష్టాయ
శుభేక్షణాయ
రామాయ
విరామాయ
విరతాయ
మార్గాయ
నేయాయ
నయాయ
అనయాయ 400
వీరాయ
శక్తిమతాం శ్రేష్ఠాయ
ధర్మాయ
ధర్మవిదుత్తమాయ
వైకుంఠాయ
పురుషాయ
ప్రాణాయ

ఓం ప్రాణదాయ నమః
ప్రణవాయ
పృథవే 410
హిరణ్యగర్భాయ
శత్రుఘ్నాయ
వ్యాప్తాయ
వాయవే
అధోక్షజాయ
ఋతవే
సుదర్శనాయ
కాలాయ
పరమేష్ఠినే
పరిగ్రహాయ 420
ఉగ్రాయ
సంవత్సరాయ
దక్షాయ
విశ్రామాయ
విశ్వదక్షిణాయ
విస్తారాయ
స్థావరాయ స్థాణవే
ప్రమాణాయ
బీజాయ అవ్యయాయ
అర్థాయ 430
అనర్థాయ
మహాకోశాయ

ఓం మహాభోగాయ నమః
మహాధనాయ
అనిర్విణ్ణాయ
స్థవిష్ఠాయ
అభువే
ధర్మయూపాయ
మహామఖాయ
నక్షత్రనేమయే 440
నక్షత్రిణే
క్షమాయ
క్షామాయ
సమీహనాయ
యజ్ఞాయ
ఇజ్యాయ
మహేజ్యాయ
క్రతవే
సత్త్రాయ
సతాంగతయే 450
సర్వదర్శినే
విముక్తాత్మనే
సర్వజ్ఞాయ
జ్ఞానాయోత్తమాయ
సువ్రతాయ
సుముఖాయ
సూక్ష్మాయ

ఓం సుఘోషాయ నమః
సుఖదాయ
సుహృదే 460
మనోహరాయ
జితక్రోధాయ
వీరబాహవే
విదారణాయ
స్వాపనాయ
స్వవశాయ
వ్యాపినే
నైకాత్మనే
నైకకర్మకృతే
వత్సరాయ 470
వత్సలాయ
వత్సినే
రత్నగర్భాయ
ధనేశ్వరాయ
ధర్మగుప్తే
ధర్మకృతే
ధర్మిణే
సతే
అసతే
క్షరాయ 480
అక్షరాయ
అవిజ్ఞాతే

ఓం సహస్రాంశవే నమః
విధాత్రే
కృతలక్షణాయ
గభస్తినేమయే
సత్త్వస్థాయ
సింహాయ
భూతమహేశ్వరాయ
ఆదిదేవాయ 490
మహాదేవాయ
దేవేశాయ
దేవభృద్గురవే
ఉత్తరాయ
గోపతయే
గోప్త్రే
జ్ఞానగమ్యాయ
పురాతనాయ
శరీరభూతభృతే
భోక్త్రే 500
కపీంద్రాయ
భూరిదక్షిణాయ
సోమపాయ
అమృతపాయ
సోమాయ
పురుజితే
పురుసత్తమాయ

ఓం వినయాయ నమః
జయాయ
సత్యసంధాయ 510
దాశార్హాయ
సాత్వతాం పతయే
జీవాయ
వినయితాసాక్షిణే
ముకుందాయ
అమితవిక్రమాయ
అంభోనిధయే
అనంతాత్మనే
మహోదధిశయాయ
అంతకాయ 520
అజాయ
మహార్హాయ
స్వాభావ్యాయ
జితామిత్రాయ
ప్రమోదనాయ
ఆనందాయ
నందనాయ
నందాయ
సత్యధర్మిణే
త్రివిక్రమాయ 530
మహర్షయే కపిలాచార్యాయ
కృతజ్ఞాయ

ఓం మేదినీపతయే నమః
త్రిపదాయ
త్రిదశాధ్యక్షాయ
మహాశృంగాయ
కృతాంతకృతే
మహావరాహాయ
గోవిందాయ
సుషేణాయ 540
కనకాంగదినే
గుహ్యాయ
గభీరాయ
గహనాయ
గుప్తాయ
చక్రగదాధరాయ
వేధసే
స్వాంగాయ
అజితాయ
కృష్ణాయ 550
దృఢాయ
సంకర్షణాయ అచ్యుతాయ
వరుణాయ
వారుణాయ
వృక్షాయ
పుష్కరాక్షాయ
మహామనసే

ఓం భగవతే నమః
భగఘ్నే
ఆనందినే 560
వనమాలినే
హలాయుధాయ
ఆదిత్యాయ
జ్యోతిరాదిత్యాయ
సహిష్ణవే
గతిసత్తమాయ
సుధన్వనే
ఖండపరశవే
దారుణాయ
ద్రవిణప్రదాయ 570
దివఃస్పృశే
సర్వదృశే వ్యాసాయ
వాచస్పతయే అయోనిజాయ
త్రిసామ్నే
సామగాయ
సామ్నే
నిర్వాణాయ
భేషజాయ
భిషజే
సన్న్యాసకృతే 580
శమాయ
శాంతాయ
నిష్ఠాయై

ఓం శాంత్యై నమః
పరాయణాయ
శుభాంగాయ
శాంతిదాయ
స్రష్ట్రే
కుముదాయ
కువలేశయాయ 590
గోహితాయ
గోపతయే
గోప్త్రే
వృషభాక్షాయ
వృషప్రియాయ
అనివర్తినే
నివృత్తాత్మనే
సంక్షేప్త్రే
క్షేమకృతే
శివాయ 600
శ్రీవత్సవక్షసే
శ్రీవాసాయ
శ్రీపతయే
శ్రీమతాంవరాయ
శ్రీదాయ
శ్రీశాయ
శ్రీనివాసాయ
శ్రీనిధయే
శ్రీవిభావనాయ
శ్రీధరాయ 610

ఓం శ్రీకరాయ నమః
శ్రేయసే
శ్రీమతే
లోకత్రయాశ్రయాయ
స్వక్షాయ
స్వంగాయ
శతానందాయ
నందయే
జ్యోతిర్గణేశ్వరాయ
విజితాత్మనే 620
(అ)విధేయాత్మనే
సత్కీర్తయే
ఛిన్నసంశయాయ
ఉదీర్ణాయ
సర్వతశ్చక్షుషే
అనీశాయ
శాశ్వతస్థిరాయ
భూశయాయ
భూషణాయ
భూతయే 630
విశోకాయ
శోకనాశనాయ
అర్చిష్మతే
అర్చితాయ
కుంభాయ
విశుద్ధాత్మనే
విశోధనాయ

ఓం అనిరుద్ధాయ నమః
అప్రతిరథాయ
ప్రద్యుమ్నాయ 640
అమితవిక్రమాయ
కాలనేమినిఘ్నే
వీరాయ
శౌరయే
శూరజనేశ్వరాయ
త్రిలోకాత్మనే
త్రిలోకేశాయ
కేశవాయ
కేశిఘ్నే
హరయే 650
కామదేవాయ
కామపాలాయ
కామినే
కాంతాయ
కృతాగమాయ
అనిర్దేశ్యవపుషే
విష్ణవే
వీరాయ
అనంతాయ
ధనంజయాయ 660
బ్రహ్మణ్యాయ
బ్రహ్మకృతే
బ్రహ్మణే

ఓం బ్రహ్మణే నమః
బ్రహ్మవివర్ధనాయ
బ్రహ్మవిదే
బ్రాహ్మణాయ
బ్రహ్మిణే
బ్రహ్మజ్ఞాయ
బ్రాహ్మణ ప్రియాయ 670
మహాక్రమాయ
మహాకర్మణే
మహాతేజసే
మహోరగాయ
మహాక్రతవే
మహాయజ్వనే
మహాయజ్ఞాయ
మహాహవిషే
స్తవ్యాయ
స్తవప్రియాయ 680
స్తోత్రాయ
స్తుతయే
స్తోత్రే
రణప్రియాయ
పూర్ణాయ
పూరయిత్రే
పుణ్యాయ
పుణ్యకీర్తయే
అనామయాయ
మనోజవాయ 690

ఓం తీర్థకరాయ నమః
వసురేతసే
వసుప్రదాయ
వసుప్రదాయ
వాసుదేవాయ
వసవే
వసుమనసే
హవిషే
సద్గతయే
సత్కృతయే 700
సత్తాయై
సద్భూతయే
సత్పరాయణాయ
శూరసేనాయ
యదుశ్రేష్ఠాయ
సన్నివాసాయ
సుయామునాయ
భూతావాసాయ
వాసుదేవాయ
సర్వాసునిలయాయ 710
అనలాయ
దర్పఘ్నే
దర్పదాయ
దృప్తాయ
దుర్ధరాయ
అపరాజితాయ

ఓం విశ్వమూర్తయే నమః
మహామూర్తయే
దీప్తమూర్తయే
అమూర్తిమతే 720
అనేకమూర్తయే
అవ్యక్తాయ
శతమూర్తయే
శతాననాయ
ఏకస్మై
నైకస్మై
సవాయ
కాయ
కస్మై
యస్మై 730
తస్మై
పదాయూమత్తమాయ
లోకబంధవే
లోకనాథాయ
మాధవాయ
భక్తవత్సలాయ
సువర్ణవర్ణాయ
హేమాంగాయ
వరాంగాయ
చందనాంగదినే 740
వీరఘ్నే
విషమాయ
శూన్యాయ

ఓం ఘృతాశిషే నమః
అచలాయ
చలాయ
అమానినే
మానదాయ
మాన్యాయ
లోకస్వామినే 750
త్రిలోకధృషే
సుమేధసే
మేధజాయ
ధన్యాయ
సత్యమేధసే
ధరాధరాయ
తేజోవృషాయ
ద్యుతిధరాయ
సర్వశస్త్రభృతాంవరాయ
ప్రగ్రహాయ 760
నిగ్రహాయ
వ్యగ్రాయ
నైకశృంగాయ
గదాగ్రజాయ
చతుర్మూర్తయే
చతుర్బాహవే
చతుర్వ్యూహాయ
చతుర్గతయే
చతురాత్మనే
చతుర్భావాయ 770

ఓం చతుర్వేదవిదే నమః
ఏకపాదే
సమావర్తాయ
(అ)నివృత్తాత్మనే
దుర్జయాయ
దురతిక్రమాయ
దుర్లభాయ
దుర్గమాయ
దుర్గాయ
దురావాసాయ 780
దురారిఘ్నే
శుభాంగాయ
లోకసారంగాయ
సుతంతవే
తంతువర్ధనాయ
ఇంద్రకర్మణే
మహాకర్మణే
కృతకర్మణే
కృతాగమాయ
ఉద్భవాయ 790
సుందరాయ
సుందాయ
రత్ననాభాయ
సులోచనాయ
అర్కాయ
వాజసనాయ
శృంగిణే

ఓం జయంతాయ నమః
సర్వవిజ్జయినే
సువర్ణబిందవే 800
అక్షోభ్యాయ
సర్వవాగీశ్వరేశ్వరాయ
మహాహ్రదాయ
మహాగర్తాయ
మహాభూతాయ
మహానిధయే
కుముదాయ
కుందరాయ
కుందాయ
పర్జన్యాయ 810
పావనాయ
అనిలాయ
అమృతాశాయ
అమృతవపుషే
సర్వజ్ఞాయ
సర్వతోముఖాయ
సులభాయ
సువ్రతాయ
సిద్ధాయ
శత్రుజితే 820
శత్రుతాపనాయ
న్యగ్రోధాయ
ఉదుంబరాయ

ఓం అశ్వత్థాయ నమః
చాణూరాంధ్రనిషూదనాయ
సహస్రార్చిషే
సప్తజిహ్వాయ
సప్తైధసే
సప్తవాహనాయ
అమూర్తయే 830
అనఘాయ
అచింత్యాయ
భయకృతే
భయనాశనాయ
అణవే
బృహతే
కృశాయ
స్థూలాయ
గుణభృతే
నిర్గుణాయ 840
మహతే
అధృతాయ
స్వధృతాయ
స్వాస్యాయ
ప్రాగ్వంశాయ
వంశవర్ధనాయ
భారభృతే
కథితాయ
యోగినే
యోగీశాయ 850

ఓం సర్వకామదాయ నమః
ఆశ్రమాయ
శ్రమణాయ
క్షామాయ
సుపర్ణాయ
వాయువాహనాయ
ధనుర్ధరాయ
ధనుర్వేదాయ
దండాయ
దమయిత్రే 860
దమాయ
అపరాజితాయ
సర్వసహాయ
నియంత్రే
అనియమాయ
అయమాయ
సత్త్వవతే
సాత్త్వికాయ
సత్యాయ
సత్యధర్మపరాయణాయ 870
అభిప్రాయాయ
ప్రియార్హాయ
అర్హాయ
ప్రియకృతే
ప్రీతివర్ధనాయ
విహాయసగతయే
జ్యోతిషే

ఓం సురుచయే నమః
హుతభుజే
విభవే 880
రవయే
విరోచనాయ
సూర్యాయ
సవిత్రే
రవిలోచనాయ
అనంతాయ
హుతభుజే
భోక్త్రే
సుఖదాయ
నైకజాయ 890
అగ్రజాయ
అనిర్విణ్ణాయ
సదామర్షిణే
లోకాధిష్ఠానాయ
అద్భుతాయ
సనాతే
సనాతనతమాయ
కపిలాయ
కపయే
అవ్యయాయ 900
స్వస్తిదాయ
స్వస్తికృతే
స్వస్తయే

ఓం స్వస్తిభుజే నమః
స్వస్తిదక్షిణాయ
అరౌద్రాయ
కుండలినే
చక్రిణే
విక్రమిణే
ఊర్జితశాసనాయ 910
శబ్దాతిగాయ
శబ్దసహాయ
శిశిరాయ
శర్వరీకరాయ
అక్రూరాయ
పేశలాయ
దక్షాయ
దక్షిణాయ
క్షమిణాంవరాయ
విద్వత్తమాయ 920
వీతభయాయ
పుణ్యశ్రవణకీర్తనాయ
ఉత్తారణాయ
దుష్కృతిఘ్నే
పుణ్యాయ
దుఃస్వప్ననాశనాయ
వీరఘ్నే
రక్షణాయ
సద్భ్యో
జీవనాయ 930

ఓం పర్యవస్థితాయ నమః
అనంతరూపాయ
అనంతశ్రియే
జితమన్యవే
భయాపహాయ
చతురశ్రాయ
గభీరాత్మనే
విదిశాయ
వ్యాదిశాయ
దిశాయ 940
అనాదయే
భువోభువే
లక్ష్మ్యై
సువీరాయ
రుచిరాంగదాయ
జననాయ
జనజన్మాదయే
భీమాయ
భీమపరాక్రమాయ
ఆధారనిలయాయ 950
(అ)ధాత్రే
పుష్పహాసాయ
ప్రజాగరాయ
ఊర్ధ్వగాయ
సత్పథాచారాయ
ప్రాణదాయ

ఓం ప్రణవాయ నమః
పణాయ
ప్రమాణాయ
ప్రాణనిలయాయ 960
ప్రాణభృతే
ప్రాణజీవనాయ
తత్త్వాయ
తత్త్వవిదే
ఏకాత్మనే
జన్మమృత్యుజరాఽతిగాయ
భూర్భువఃస్వస్తరవే
తారాయ
సవిత్రే
ప్రపితామహాయ 970
యజ్ఞాయ
యజ్ఞపతయే
యజ్వనే
యజ్ఞాంగాయ
యజ్ఞవాహనాయ
యజ్ఞభృతే
యజ్ఞకృతే
యజ్ఞినే
యజ్ఞభుజే
యజ్ఞసాధనాయ 980
యజ్ఞాంతకృతే
యజ్ఞగుహ్యాయ
అన్నాయ

ఓం అన్నాదాయ నమః
ఆత్మయోనయే
స్వయంజాతాయ
వైఖానాయ
సామగాయనాయ
దేవకీనందనాయ
స్రష్ట్రే 990
క్షితీశాయ
పాపనాశనాయ

ఓం శంఖభృతే నమః
నందకినే
చక్రిణే
శార్ఙ్గధన్వనే
గదాధరాయ
రథాంగపాణయే
అక్షోభ్యాయ
సర్వప్రహరణాయుధాయ 1000

* * *